
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



కూలిందా.. కూల్చారా?

కజక్ విమాన ప్రమాదంపై అనుమానాలు

రష్యా కాల్పుల వల్లే కూలిందన్న వార్తలు

విమానం వెనుక భాగంలో తూటాలు దూసుకెళ్లినట్లు రంధ్రాలు 2

శుక్రవారం | 27-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 252 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 2.27 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ రా. 8.28 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 12.45-2.28; దుర్ముహూర్తం: ఉ. 8.58-9.42, మ. 12.38-1.22; అమృతఘడియలు: ఉ. 10.49-12.34; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 5.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్థిక మార్గదర్శి


ఏం చేయాలో అదే చేశా

ప్రస్తుత మీడియా, ఆ మాటకొస్తే పార్లమెంటులోని విపక్షాల కన్నా.. చరిత్ర నా పట్ల దయతో వ్యవహరిస్తుందని నమ్ముతున్నా. ప్రభుత్వ వ్యవస్థలోని విషయాలన్నీ బయటకు చెప్పలేను కానీ, సంకీర్ణ రాజకీయాల అనివార్యతలను దృష్టిలో పెట్టుకొని, ఏ పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో సరిగ్గా అలాగే వ్యవహరించా.

- 2014 జనవరి 3న ప్రధానిగా చివరి విలేకరుల సమావేశంలో మన్మోహన్‌సింగ్



అస్తమయం



1932 - 2024

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ కన్నుమూత

ఆయన మాటలు గట్టిగా వినిపించవు! 'మౌనమే' ఘనంగా పని చేస్తుంది!

అంతుపట్టని ఆయన ఆలోచనల లోతు... దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టింది!

ఆయన సాహసోపేత సంస్కరణల ఫలితం... నేడు ఘనంగా కనిపిస్తోంది!

పాఠాలు చెప్పే అధ్యాపకుడి నుంచి దేశాన్ని పాలించిన ప్రధానమంత్రి దాకా ప్రతి దశలో, ప్రతి పనిలో ఆయన పేరు చెరగని ముద్రలా నిలిచిపోయింది!

నేటి తరం రాజకీయాల్లో 'మిస్టర్ క్లీన్'... రేపటి తరానికి ఆదర్శం... విద్యావేత్త, ఆర్థికవేత్త, సంస్కరణల రూప శిల్పి... నిగర్వి, నిష్కళంకుడు, నిరాడంబరుడు... మన్మోహన్ సింగ్ జీవన ప్రస్థానం ముగిసింది!

ఎవరేమన్నా... ఎవరెన్ని విమర్శలు చేసినా... 'మౌనం'గా పని చేసుకుంటూ వెళ్లిన మన్మోహన్ సింగ్ అంతే మౌనంగా తన జీవన ప్రస్థానానికి వీడ్కోలు పలికారు! కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో తుది శ్వాస వదిలారు. ఆయన అనుకోకుండా దేశ ఆర్థిక మంత్రి అయ్యారు! అంతే ఆకస్మికంగా, అనూహ్యంగా ప్రధానిగా బాధ్యతలూ చేపట్టారు! 92ఏళ్ల జీవితం.. దేశ విభజన తర్వాత పాకిస్థాన్ నుంచి భారత్‌లో వలస జీవనం... ఎన్నెన్నో మలుపులు, మెరుపులు! డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలను భారతదేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు.

వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో తుదిశ్వాస

గురువారం రాత్రి 9:51 గంటలకు ఎయిమ్స్‌లో మృతి

హుటాహుటిన ఆస్పత్రికి సోనియాగాంధీ, ప్రియాంక

బెళగావి నుంచి ఢిల్లీ చేరుకున్న రాహుల్‌గాంధీ, ఖర్గే

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం

అధికారిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు

7 రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయ యవనికపై ఒక శకం ముగిసింది! కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టిన సంస్కరణల రూపశిల్పి.. ప్రధానిగా ప్రగతిపథంలో పరుగులు తీయించిన ఆర్థిక వేత్త ఇక లేరు!! మౌనమే భాషగా ఉంటూనే రెండు పర్యాయాలు.. దేశాన్ని సమర్థంగా పరిపాలించిన రాజనీతిజ్ఞుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం సాయంత్రం తన నివాసంలో అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. రాత్రి 8.06 గంటల సమయంలో కుటుంబసభ్యులు

మిగతా 13వ పేజీలో...

మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగారు. దేశ ప్రజల జీవితాలను మెరుగు పరిచేందుకు విశేష కృషి చేశారు.

- నరేంద్ర మోదీ

దేశం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి.

- మల్లికార్జున ఖర్గే

గురువును, మార్గదర్శకుడిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో ఆయన దేశాన్ని నడిపించారు.

- రాహుల్ గాంధీ



బెళగావిలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్, వేణుగోపాల్, సుర్జేవాలా తదితరులు

రాజ్యాంగానికి ముప్పు

దాని నాశనమే ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రాజెక్టు

సంఘ్ ప్రోద్బలంతోనే పార్లమెంటులో అంబేడ్కర్‌కు అమిత్‌షా అవమానం

ఆయన రాజీనామా చేయాల్సిందే.. జాతికి క్షమాపణ చెప్పాల్సిందే

గాంధీజీ వారసత్వాన్ని పరిరక్షిస్తాం.. ఇందుకోసం పునరంకితమవుతాం

కాంగ్రెస్ 'నవ సత్యాగ్రహ బైఠక్' రాజకీయ తీర్మానం.. బెళగావిలో సీడబ్ల్యూసీ

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంతవరకూ ఎదురుకాని పెనుముప్పును భారత రాజ్యాంగం ఎదుర్కొంటోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగాన్ని నాశనం చేయడం ఆర్ఎస్ఎస్-బీజేపీల దశాబ్దాల ప్రాజెక్టు అని ధ్వజమెత్తింది. సంఘ్ ప్రోద్బలంతోనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంటులో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కించపరిచారని ఆరోపించింది. ఆయన కచ్చితంగా రాజీనామా చేసి తీరాలని స్పష్టం చేసింది. జాతికి క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. గాంధీజీపై తీవ్రంగా పోరాడిన సైద్ధాంతిక శక్తి (ఆర్ఎస్ఎస్).. ఆయన

మిగతా 2వ పేజీలో...

నో బెనిఫిట్!

ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు

అనుమతించం

అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా

చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. పద్ధతిగా ఉండండి

సీఎం పేరు చెప్పనందుకే కేసు అని ప్రచారం చేస్తారా?

ఎప్పుడో ఆ స్థాయి దాటాం.. మీరెందుకు ఖండించలేదు?

బౌన్సర్లు పోలీసు అధికారులనూ అడ్డుకుంటున్నారు

అలా అడ్డుకుంటే వారితోపాటు సెలబ్రిటీలపైనా కేసులు

అభిమానులను నియంత్రించే బాధ్యత సెలబ్రిటీలదే

సామాజిక బాధ్యతను సినీ పరిశ్రమ గుర్తుపెట్టుకోవాలి

డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రచారం చేయాలి

నాకు ఎవరిపైనా వ్యక్తిగతంగా ఇష్టాయిష్టాలేవీ లేవు

టాలీవుడ్ ప్రతినిధులతో భేటీలో టీ-సీఎం రేవంత్‌రెడ్డి

మీకు రాజకీయాలతో సంబంధమేంటని ఘాటు వ్యాఖ్య



సినీ ప్రముఖులతో సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు, రాఘవేంద్రరావు, అల్లు అరవింద్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై కొత్త సినిమాల బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. అసెంబ్లీలో ఈమేరకు తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ పెద్దలకు తేల్చిచెప్పారు. అయితే చిత్రపరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, పరిశ్రమ కూడా సామాజిక బాధ్యత నిర్వర్తించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ కేసు

మిగతా 12వ పేజీలో...



టీ-సీఎం రేవంత్ రెడ్డికి నటుడు నాగార్జున సత్కారం



భూముల ధరల పెంపు

వాయిదా

పునరాలోచనలో ప్రభుత్వం

జనవరి 1 నుంచి పెంపు లేనట్టే!

ఈనెల 30న కీలక సమావేశం

అన్నీ చర్చించాకే నిర్ణయం: మంత్రి అనగాని

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల మార్కెట్ ధరలు పెంచాలన్న నిర్ణయంపై సర్కారు పునరాలోచనలో పడింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి భూముల మార్కెట్ ధరలను పెంచాలన్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో...

పాక్ సరిహద్దు దిశగా

తాలిబన్ ఫైటర్లు

2

అత్యాధునిక ఆయుధాలతో 15 వేల మందికి పైగా..

అఫ్ఘాన్‌లో పాక్ వైమానిక దాడులతో పెరిగిన ఉద్రిక్తతలు

ప్రతీకారం తీర్చుకుంటామని తాలిబన్ ప్రభుత్వం హెచ్చరిక

ఇప్పటికే పాకిస్థాన్‌లో తెహ్రీక్ ఎ తాలిబన్‌తో కలకలం

అమరావతిలో

అండర్‌గ్రౌండ్ దందా

భూగర్భ విద్యుత్ లైన్‌కు 'హై' టెండర్లు

ప్రభుత్వానికి రూ. 156 కోట్ల నష్టం

అత్యధిక ధరలకు ట్రాన్స్‌కో టెండర్లు

కూటమి ప్రభుత్వానికి తెలియకుండా మాయ

జగన్ హయాంలోని అధికారుల కుట్ర

తెలంగాణలోని ధరల కంటే చాలా ఎక్కువ

అమరావతిలో వేసేది 1000 స్క్వేర్ ఎంఎం సామర్థ్యం గల కేబుల్. కిలోమీటరు వేయడానికి జీఎస్టీతో సహా ఏపీ ట్రాన్స్‌కో పిలిచిన ధర రూ.1.86 కోట్లు. అదే హైదరాబాద్ గచ్చిబౌలిలో దీనికంటే 20 శాతం ఎక్కువ సామర్థ్యం.. 1,200 స్క్వేర్ ఎంఎం కేబుల్ వేయడానికి కి.మీ.కు జీఎస్టీతో సహా టీజీ ట్రాన్స్‌కో పిలిచిన ధర రూ.1.69 కోట్లు. అంటే.. గచ్చిబౌలిలో కంటే అమరావతిలో తక్కువ సామర్థ్యం కేబుల్ వేసేందుకు అక్కడి కంటే భారీ ధరకు టెండర్ పిలిచారు. అది కూడా ప్రభుత్వానికి తెలియకుండా! దీనిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 14



బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యాం!

టిబెట్‌లో భారత సరిహద్దుకు సమీపంలో..

విద్యుదుత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్.. భారత్‌కు ముప్పే!

నీటిని మళ్లిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో నీటిఎద్దడి

యుద్ధం పరిస్థితులు వస్తే డ్యామ్‌ను చైనా 'వాటర్ బాంబ్'గా వాడే ప్రమాదం?

బీజింగ్, డిసెంబరు 26: చైనా ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్తు డ్యామ్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. త్రీగోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు పెద్దదైన ఈ డ్యామ్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. టిబెట్ ప్రాంతంలో భారత సరిహద్దుకు సమీపంలో ఈ డ్యామ్‌ను నిర్మించనుంది. టిబెట్ తూర్పు అంచులో ఉన్న యార్లంగ్ జాంగ్పో నది దిగువ భాగంలో ఈ జలాశయాన్ని నిర్మించనున్నట్లు చైనా

మిగతా 2వ పేజీలో...

లిక్కర్ మార్కెట్‌లో '99' హవా!

అమ్మకాల్లో 25% వాటా ఆ బ్రాండ్లదే

నెలకు 8 లక్షల కేసుల విక్రయం

తక్కువ ధరతో పెరిగిన డిమాండ్

ప్రభుత్వానికి తగ్గుతున్న ఆదాయం

అయినా హామీ మేరకు అమ్మకాలు

లైసెన్సీల మార్జిన్‌పైనా ప్రభావం

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో క్వార్టర్ రూ.99 రకాల హవా పెరిగిపోతోంది. క్రమంగా లిక్కర్ మార్కెట్‌ను ఆక్రమిస్తోంది. మొత్తం మద్యం అమ్మకాల్లో '99' బ్రాండ్ల వాటానే 25 శాతానికి చేరడం గమనార్హం. దీంతో ఇతర బ్రాండ్లు కూడా రూ.99కు క్వార్టర్ మద్యాన్ని తయారు చేయాలని భావిస్తున్నాయి. మరోవైపు ఈ బ్రాండ్ల అమ్మకాలు భారీగా పెరగడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గిపోతోంది. అలాగే షాపుల లైసెన్సీల ఆదాయమూ తగ్గుతోంది. ఆదాయం తగ్గినా వినియోగదారుల నుంచి డిమాండ్ భారీగా ఉండటంతో

మిగతా 3వ పేజీలో...



నంద్యాల జిల్లా బేతంచర్ల గోడౌన్‌లో అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేశ్ నాయుడు

బుగ్గన బంధువుల గోడౌన్లలో

బియ్యం మాయం

బేతంచర్ల బఫర్ గోదాముల్లో మాయమైన 1300 బస్తాలు

సివిల్ సప్లైస్ అధికారుల తనిఖీలు

ఓ గోదాములో 398 బస్తాలు మాయం

పత్తా లేకుండా పోయిన మరో గోదాం యజమానులు

ఆ గోదాంలో 920 బస్తాలు మాయమైనట్లు అనుమానం

14

ఆర్థిక సంస్కరణలు..

అగ్నిపరీక్షలో పీవీ దన్ను!

భారత్‌ను గట్టెక్కించిన 'ఆర్థిక' బంధం

ఏరికోరి మన్మోహన్‌ను నియమించిన పీవీ

నాడు దేశం దివాలా అంచున ఉంది.. ఆర్థిక పరిస్థితి పూర్తిగా కునారిల్లింది.. రాజకీయంగానూ అస్థిరత.. ఈ స్థితిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. పీవీ నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాలంటే.. ఆర్థిక సంస్కరణలు అవసరం.. వాటిని ముందుకు నడిపేందుకు పీవీ ఏరికోరి మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించుకున్నారు. నాటి నుంచి ప్రారంభమైన బంధం.. పీవీ మరణానంతరం వరకు కొనసాగింది. యాదృచ్ఛికంగా ఆర్థిక మంత్రి అయిన మన్మోహన్‌సింగ్.. 2004లో అంతే యాదృచ్ఛికంగా ప్రధాని అయ్యారు. నాడు పీవీ సంపూర్ణ మద్దతుతో ప్రారంభించిన సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లారు. పీవీతో తనది 'ఆర్థిక' బంధమని అంటుండేవారు. పార్లమెంటు ఉభయసభల్లో మన్మోహన్ సంస్కరణలను ఎవరు ఆక్షేపించినా పీవీ ఆయనకు దన్నుగా నిలిచారు. 1990-91 లో పీవీ-మన్మోహన్ జోడీ వచ్చేనాటికి భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 6 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ద్రవ్య లోటు నానాటికీ క్షీణిస్తుండడం.. ద్రవ్యోల్బణం డబుల్ డిజిట్‌కు చేరడం.. విదేశీ రుణాలు పతాకస్థాయికి చేరడంతో ప్రభుత్వానికి, సామాన్యుడికి కూడా ఊపిరాడని పరిస్థితి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో మన్మోహన్-పీవీ రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇవి.. అంతర్జాతీయ పోటీ మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు అవకాశం దక్కేందుకు రూపాయి విలువ తగ్గింపు, విదేశీ మారక నిల్వలు పెంచుకోవడానికి బంగారం తాకట్టు పెట్టడం. ఈ నిర్ణయాలను కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్, పీవీ కేబినెట్‌లోనే ఉన్న అర్జున్‌సింగ్ గట్టిగా వ్యతిరేకించారు. అయితే బీజేపీ అగ్ర నేత, నాటి ప్రతిపక్ష నేత వాజపేయి మద్దతివ్వడంతో పీవీ-మన్మోహన్ ధైర్యంగా ముందుకెళ్లారు. 1996లో కాంగ్రెస్ ఓటమి తర్వాత పీవీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని, అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవిని కోల్పోయినా.. వారి మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. పీవీ చేపట్టిన సంస్కరణల వల్లే కాంగ్రెస్ నాశనమైందని ఆ పార్టీ సీనియర్లు బహిరంగంగానే విమర్శలు చేసినా ఈయన మాత్రం పట్టించుకోలేదు. తర్వాత్తర్వాత రాజకీయంగా పీవీని కాంగ్రెస్ ఏకాకిని చేసింది. పీవీ పలు కేసులను ఎదుర్కొన్నారు. జేఎంఎం ముడుపుల కేసులో 2000 అక్టోబరులో కోర్టు ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధించినప్పుడు.. ఆయన కేబినెట్‌లో పనిచేసిన ఒక్క కాంగ్రెస్ నేత కూడా పరామర్శించలేదు. అయితే మన్మోహన్ ఒక్కరే ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడి వచ్చారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ గెలిచాక నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ మన్మోహన్‌ను ప్రధానిని చేశారు. ఆ ఏడాది మే 22న ఆయన ప్రధానిగా ప్రమాణం చేశారు. తన రాజకీయ గురువు పీవీ అని పార్లమెంటులోనే ఆయన ప్రకటించడం గమనార్హం. అదే ఏడాది డిసెంబరు 23న పీవీ మరణించినప్పుడు మన్మోహన్ ఎంతో దుఃఖించారు.

\- సెంట్రల్ డెస్క్



యువకుంచిరి శివాజీతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

జీడీపీ వృద్ధిలో ఉరకలు

ఎల్పీజీ సంస్కరణలు సమర్థంగా అమలు

దివాలా స్థాయి నుంచి.. దేశాన్ని గట్టెక్కించిన ఆర్థికవేత్త

ప్రధానిగా తనదైన శైలిలో పథకాలు

ఆర్టీఐ, ఉపాధిహామీ, ఆహార భద్రత వంటి.. కీలకమైన చట్టాల అమలు



న్యూఢిల్లీ, డిసెంబరు 26: అనిశ్చితితో అతలాకుతలమై.. దివాలా అంచులకు చేరుకున్న భారత ఆర్థిక రంగానికి తన సంస్కరణలతో ఊతమిచ్చిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్..! పరిశ్రమల స్థాపనలో 'లైసెన్స్ రాజ్' సంస్కృతికి చరమగీతం పాడి.. సరళీకరణలతో పెట్టుబడులకు దోహదపడ్డ అపర చాణక్యుడాయన..! ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మన్మోహన్ సేవలను ప్రపంచ దేశాలు ఇప్పటికీ గుర్తిస్తాయి..! 90లలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్‌పీజీ) సంస్కరణలతో.. భారత్‌ను ముందుకు తీసుకెళ్లిన మార్గదర్శకుడిగా ఆర్థికరంగంపై ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు. అంతేనా..! ప్రధానిగా భారత స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటును ఉరకలు పెట్టించారు. ఆయన హయాంలో చాలా సందర్భాల్లో జీడీపీ 7.7-8.5 వృద్ధిని నమోదు చేసుకోవడం గమనార్హం..!

1991 వరకు నెలకొన్న అతలాకుతల పరిస్థితులతో స్వతంత్ర భారతదేశంలో తీవ్ర సంక్షోభంతో.. అత్యంత గడ్డు కాలం ఎదురైంది. దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల కోసం ఆందోళనలు.. అయోధ్య వివాదం, బాబ్రీ మసీదు కూల్చివేత, తదనంతర మతోన్మాద అల్లర్లు.. కశ్మీర్ లోయలో ఉగ్రవాద అగ్నికీలల్లో హాహాకారాలు.. పంజాబ్‌లో ఉగ్రవాదుల దారుణాలు.. ఇలా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడ్డాయి. విదేశీ మారక నిల్వలు ఆవిరవుతూ.. దిగుమతులకు మూడువారాలకు సరిపడ నిల్వలే మిగిలాయి..! భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) బంగారు నిల్వలను కుదవ పెట్టినా.. ఎన్ని రోజులు గడుస్తాయో తెలియని పరిస్థితులు..? ఆ సమయంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు అనూహ్యంగా మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు. ఆ నిర్ణయమే.. దేశ ఆర్థిక స్థితి దశ-దిశలను మార్చేశాయి.

1982-85 కాలంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్‌గా.. ఆ తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా భారత ఆర్థిక వ్యవస్థపై తనదైన ముద్ర వేసిన మన్మోహన్.. భారత్‌లో పరిస్థితులను తన సంస్కరణలతో సమర్థంగా గాడిలో పెట్టారు. పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా గొప్ప కార్యక్రమాలను అమలు చేసినా.. సామ్యవాద విధానాలతో పేదరికం, నిరుద్యోగం, ఆకలి కేకలు తగ్గకపోవడంతో.. ఎల్‌పీజీ సంస్కరణల వైపు ఆయన మొగ్గుచూపారు. ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెడితే తప్ప పూటగడవని స్థితిలో.. దివాలా స్థితిలో అపశయ్యపై ఉన్న దేశాన్ని గట్టెక్కించడానికి ఆయన అమలు చేసిన సంస్కరణలు..

- లైసెన్స్ రాజ్‌ను రద్దు చేసి.. 4 రంగాలు మినహా, మిగతా వాటిల్లో పరిశ్రమల ఏర్పాటు విధానాన్ని సరళీకరించారు. ఫలితంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) వరుస కట్టాయి. దేశంలో విదేశీ మారకనిల్వల వృద్ధి మొదలైంది.
- ఎల్‌పీజీ సంస్కరణలతో నిరుద్యోగం కొంతవరకు తగ్గడమే కాకుండా.. పెట్టుబడులు పెరిగాయి.
- మారకం రేటులో దిద్దుబాటు జరిగి.. భారత కరెన్సీ హెచ్చుతగ్గులు నియంత్రణలోకి వచ్చాయి.
- ఉత్పాదక రంగంలో ప్రపంచంతో భారత్ పోటీపడడం మొదలైంది.
- ఈ చర్యలతో 1991 నాటికి 100 కోట్ల డాలర్లు కూడా భారత విదేశీ మారక నిల్వలు.. 1995 నాటికి వెయ్యి కోట్ల డాలర్లకు చేరుకున్నాయి.

మన్మోహన్ హయాంలో వచ్చిన ఇతర కీలక పథకాలు, విధానాలు, చట్టాలు..

- పీఎఫ్ఆర్డీఏ చట్టం; కంపెనీల చట్టం; అటవీ హక్కుల చట్టం ; ప్రత్యక్ష నగదు బదిలీ పథకం(డీబీటీ); జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు; ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణ; జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఆశా); నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్; నేషనల్ హార్టికల్చర్ మిషన్; వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీల సంస్కరణలపై నమూనా చట్టం; నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ అండ్ కార్పొరేషన్; విలువ ఆధారిత పన్ను(వ్యాట్) అమలు.. తదనంతర కాలంలో జీఎస్టీ ప్రతిపాదనలు; సెక్యూరిటీలపై లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్ రద్దు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల డీమ్యూటలైజేషన్; కిరాణా వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ); బొగ్గు గనుల్లో ప్రైవేటుకు అనుమతి; పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీల రద్దు; జెండర్ బడ్జెట్; జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్; పటిష్ఠమైన విదేశాంగ విధానం

ప్రధానిగా చెరగని ముద్ర

- 2004-14 మధ్య కాలంలో మన్మోహన్ రెండు సార్లు వరుసగా ప్రధానిగా పనిచేశారు. ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థికమంత్రిగా పనిచేసిన అనుభవంతో.. ఆయన ప్రధానిగా తన హయాంలో జీడీపీ వృద్ధికి దోహదపడేలా ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వ పథకాలను పరిచయం చేశారు.
- భారత్-అమెరికా మధ్య అణు ఒప్పందం: నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ)లో భారత్ సంతకం చేయకున్నా.. అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకోవడం మన్మోహన్ హయాంలో జరిగిన కీలక విజయం. అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్‌తో కలిసి.. మన్మోహన్ ఈ ఒప్పందంపై ప్రకటన చేశారు. దీని ప్రకారం భారత్ తన అణు కార్యకలాపాలను రెండుగా విభజిస్తుంది. అవి: సైన్య, పౌర సంబంధమైనవి. పౌర సంబంధ అణు కార్యకలాపాలను అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ(ఐఏఈఏ) పరిధిలోకి తీసుకువచ్చారు.
- విద్యా హక్కు చట్టం: 14 ఏళ్ల లోపు బాలలకు నిర్బంధ ఉచిత విద్యను అందించడమే ఈ చట్టం లక్ష్యం. ఇందుకోసం మన్మోహన్ సర్కారు రాజ్యాంగ సవరణ చేసి, ప్రాథమిక హక్కుల్లో విద్యను ఒక హక్కుగా చేర్చారు.
- సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ): మన్మోహన్ సర్కారు తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాల్లో ఆర్టీఐ అత్యంత కీలకమైనది. ఈ చట్టంతో ప్రభుత్వంలో జవాబుదారీ పెరగడమే కాకుండా.. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంటుంది. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అప్పిలేట్ అథారిటీలను ఏర్పాటు చేశారు.
- జాతీయ ఆహార భద్రత చట్టం: 2013లో వచ్చిన ఈ చట్టంతో దేశ జనాభాలో మూడింట రెండొంతుల మందికి సబ్సిడీతో కూడిన నిత్యావసరాలను అందజేయడం ప్రారంభమైంది. విద్యార్థులకు బడుల్లో మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్), ప్రసూతి హక్కులు, అంగన్‌వాడీల ద్వారా మాతాశిశు సంరక్షణకు పౌష్టికాహారాన్ని అందజేయడం వంటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.
- ఉపాధి హామీ పథకం: ఉపాధి హామీ కూడా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఓ చట్ట బద్ధమైన హక్కుగా మారింది. దీని ద్వారా సొంత ఊరిలోనే పౌరులకు 100 రోజుల పని దొరుకుతుంది.
- ఆధార్: పౌరుల గుర్తింపు కోసం అందరూ పాస్‌పోర్టు తీసుకోలేరు. దీంతో.. ఆధార్‌ను పరిచయం చేశారు. యూఐడీఏఐ ద్వారా దేశంలోని ప్రతి పౌరుడికి ఒక విశిష్ట సంఖ్యతో గుర్తింపు కార్డుల జారీని ప్రారంభించారు. తదనంతర కాలంలో ఆధారం చట్టం అమల్లోకి వచ్చింది.
- పంటల బీమా: ఆరుగాలం కష్టించి పండించిన పంట.. అతివృష్టి, అనావృష్టితో దెబ్బతింటే.. రైతన్నలకు తీరని నష్టం వాటిల్లుతుంది. దీంతో.. ఫసల్ బీమా పేరుతో మన్మోహన్ సర్కారు పథకాన్ని ప్రారంభించింది. తదనంతర కాలంలో ఈ బీమాను మరింత మెరుగుపరిచారు.

లోకం తీరు



దేశ గతిని మార్చిన 1991 బడ్జెట్

ఆర్థిక సంస్కరణల అమలుకు బాటలు

కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలతో ప్రవేశపెట్టిన 1991-92 బడ్జెట్ దేశ గతిని మార్చింది. అప్పటి వరకూ దశాబ్దాల తరబడి 3.5శాతంగా కొనసాగుతున్న వృద్ధి రేటును పరుగులు పెట్టించడానికి దోహదపడింది. భారతదేశ కొత్త ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన మైలురాయిగా దీన్ని పేర్కొంటారు. 'సమయం వచ్చినప్పుడు ఒక ఆలోచనను ఈ భూమి మీద ఏ శక్తీ ఆపలేదు' అంటూ ఫ్రెంచ్ తత్వవేత్త విక్టర్ హ్యూగో మాటలను ఆనాటి బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్ ప్రస్తావించారు. భారత్ ప్రపంచ శక్తిగా, ఆర్థిక శక్తిగా మారడానికి సమయం ఆసన్నమైందని, దీన్నెవరూ ఆపలేరని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. 1991 జూలై 24న మన్మోహన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో ఆర్థిక సంస్కరణలకు బాటలు వేసింది. ఓపెన్ ఎకానమీలో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించి, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలని నిర్ణయించడంతో కంపెనీలకు పర్మిట్ రాజ్ నుంచి విముక్తి లభించింది. ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతి లైసెన్స్‌లు సడలించడం లక్ష్యంగా ఆనాటి బడ్జెట్‌లో మన్మోహన్ పలు మార్పులు ప్రకటించారు. ఎగుమతి-దిగుమతి విధానంలో విదేశీ పెట్టుబడులను స్వాగతించారు. 1991 బడ్జెట్‌ను కేవలం నెల రోజుల్లోనే మన్మోహన్ సింగ్ సిద్ధం చేయడం విశేషం. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే ఆర్థిక సంస్కరణల ఫలాలు కనిపించడం మొదలైంది. విదేశీ పెట్టుబడులు వచ్చాయి. లక్షల సంఖ్యలో కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది. కోట్లాది మంది ప్రజలు మొదటిసారిగా దారిద్ర్య రేఖకు ఎగువకు చేరుకున్నారు. ఆధునిక భారతదేశ చరిత్రలో అతిపెద్ద నిర్ణయాలలో ఒకటిగా పరిగణించే ఈ బడ్జెట్ ఘనత మన్మోహన్‌తో పాటు నాటి ప్రధాని పి.వి. నరసింహారావుకు దక్కింది.

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యాం!

(మొదటిపేజీ తరువాయి)

మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్‌ఫ్రా ప్రాజెక్టుగా ఈ డ్యామ్ నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు విద్యుదుత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతి పెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్ అంటే కొత్త డ్యామ్ సామర్థ్యం దానికి మూడు రెట్లు అధికం. హిమాలయాల్లో బ్రహ్మపుత్ర నది పెద్ద యూ టర్న్ తీసుకొని అరుణాచల్‌ప్రదేశ్, అసోం గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. యూ టర్న్ తీసుకునే ప్రాంతంలోని భారీ లోయ వద్ద డ్యామ్‌ను నిర్మించాలని చైనా నిర్ణయించడం గమనార్హం. 137 బిలియన్ డాలర్ల (చైనా కరెన్సీలో ట్రిలియన్ యువాన్లు) ఖర్చుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఖరీదైన, భారీ ప్రాజెక్టుగా నిలవనుంది. యార్లంగ్ జాంగ్బో నదిపై ప్రాజెక్టు నిర్మించతలపెట్టిన ప్రాంతం ప్రపంచంలోనే అత్యధిక జలవిద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే అవకాశం ఉన్నవాటిలో ఒకటి అని చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. జలవిద్యుదుత్పత్తి కోసం బ్రహ్మపుత్ర నదిలోని సగం నీటిని దారి మళ్లించేందుకు 20 కిలోమీటర్ల పొడవైన సొరంగాలను నాలుగు నుంచి ఆరు వరకు తవ్వాలని పేర్కొంది. నమ్చా బార్వా కొండల్లో తవ్వే ఈ సొరంగాల ద్వారా సెకనుకు 2 వేల క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుందని వివరించింది. ఈ ప్రాజెక్టు కేవలం జలవిద్యుత్తు డ్యామ్ మాత్రమే కాదని.. పర్యావరణానికి, చైనా జాతీయ భద్రతకు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, ఇంధనం, అంతర్జాతీయ సహకారానికి సంబంధించిన ప్రాజెక్టు అని చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గత ఛైర్మన్ యాన్ జియాంగ్ పేర్కొనడం గమనార్హం.

బ్రహ్మపుత్ర.. యార్లంగ్ జాంగ్బో

టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది (దీన్ని అక్కడ యార్లంగ్ జాంగ్బోగా పిలుస్తారు) భారత్ గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తోంది. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఇది వరదాయిని. ఈ నదీ జలాల ప్రవాహ తీరు, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనా మధ్య ఒప్పందం ఉంది. వానాకాలంలో ఈ నదికి విపరీతంగా వరదలు వస్తుంటాయి. ఇరుదేశాల మధ్య ఒప్పందం ప్రకారం మే 15 నుంచి అక్టోబరు 15 వరకు బ్రహ్మపుత్ర జలాల సంబంధిత విషయాల్ని చైనా.. భారత్‌తో పంచుకోవాల్సి ఉంది. వరదలొచ్చే అవకాశం ఉన్నప్పుడు నదిలో ప్రవాహ స్థితిగతులను దిగువనున్న దేశాలకు తెలియజేయాలి. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత చైనా ఆ సమాచారాన్ని సరిగా ఇవ్వడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో నాటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరి సారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంకా కొత్త ఒప్పందం జరగలేదు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవడం కలవరపెడుతోంది. చైనా ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్‌కు పక్కలో బల్లెంలా మారే ప్రమాదముంది. బ్రహ్మపుత్ర జలాలపై చైనా నియంత్రణ పెరిగిపోతుంది. ఎండాకాలంలో నీటిని మళ్లించేందుకు చైనాకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒకవేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే.. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి.. చైనా 'వాటర్ బాంబ్'గా ఉపయోగించే ప్రమాదం కూడా ఉంటుంది. అంత ఎత్తు నుంచి నీటిని విడుదల చేస్తే అల్లకల్లోలమే. అసోం, అరుణాచల్ వంటి రాష్ట్రాలు పూర్తిగా జలసమాధి అవయ్యే ప్రమాదం ఉంటుంది. కాగా, ఇరుదేశాల మధ్య ప్రవహించే నదులు సహా పలు అంశాలపై సీమాంతర సహకారం, పరస్పర సమాచార మార్పిడి చేసుకోవాలని ఈ నెల 18న జరిగిన భారత్-చైనా ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో నిర్ణయించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. టిబెట్ ప్రాంతం భూకంప జోన్‌లో ఉందని, అక్కడ తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తుంటాయని.. ఇలాంటి చోట భారీ డ్యామ్ కట్టడం ఆందోళనకరమని పేర్కొంది.

రాజ్యాంగానికి పెనుముప్పు

(మొదటి పేజీ తరువాయి)

వారసత్వాన్ని టార్గెట్ చేసిందని ధ్వజమెత్తింది. ఆ వారసత్వాన్ని కాపాడేందుకు, పరిరక్షించడానికి, వ్యాప్తి చేసేందుకు పునరంకితమవుతామని సంకల్పం తీసుకుంది. రాజ్యాంగంపై దాడి, ధరల పెరుగుదల, అవినీతికి వ్యతిరేకంగా 13 నెలలపాటు పాదయాత్రలు సహా వివిధ రూపాల్లో ఉద్యమించేందుకు కార్యాచరణను ప్రకటించింది. 'నవ సత్యాగ్రహ బైఠక్' పేరిట వర్కింగ్ కమిటీ సమావేశం గురువారం కర్ణాటకలోని బెళగావి(బెల్గాం)లో ప్రారంభమైంది. 1924లో బెల్గాంలోనే జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలో మహాత్మాగాంధీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. ఇది జరిగి వందేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇప్పుడిక్కడ చరిత్రాత్మక భేటీని నిర్వహిస్తున్నారు. తొలుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ తదితరులు గాంధీజీ చిత్రపటాలు చేతబట్టి సమావేశ ప్రాంగణం 'వీరసౌధ'కు ప్రదర్శనగా తరలివచ్చారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి.. బైఠక్‌ను ఖర్గే ప్రారంభించారు. కొత్త ఏడాది 2025లో పార్టీ అనుసరించాల్సిన రోడ్‌మ్యాప్‌పై విస్తృతంగా చర్చించారు. రాజకీయ, ఎన్నికల సవాళ్లను ఎదుర్కొనడానికి కార్యాచరణను కూడా రూపొందించారు. సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానం తాలూకు తప్పును అంగీకరించడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని ఆక్షేపించారు. రాజ్యాంగ రూపశిల్పిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర అవమానకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు. బాబాసాహెబ్ గౌరవం కోసం కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. 'అమిత్‌షా వ్యాఖ్యలపై అభ్యంతరకాలు వ్యక్తంచేశాం. నిరసనలు తెలిపాం. ప్రదర్శనలు నిర్వహించాం. ఇప్పుడు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. అయినా చేసిన తప్పును ఒప్పుకోవడానికి ప్రధాని, ప్రభుత్వం సిద్ధంగా లేవు. షాను క్షమాపణ, రాజీనామా కోరకపోగా.. ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఆయనకు మద్దతుగా ప్రధాని ప్రకటన చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై తప్పుడు కేసు పెట్టారు. రాజ్యాంగం, దాని రూపకర్త పట్ల ప్రస్తుత పాలకుల తీరు ఇలా ఉంది. కానీ మేమెవరికీ భయపడే, తలొగ్గే ప్రసక్తే లేదు. నెహ్రూ-గాంధీ సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడతాం' అని ఖర్గే ప్రకటించారు. రాజ్యాంగ సంస్థలను మోదీ అండ్ కో నియంత్రిస్తున్నారని.. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) దీనికి ఉదాహరణ అని అన్నారు. కమిషన్ నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతుండడంతో ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందని చెప్పారు. 2025ని పార్టీ సంస్థాగత సాధికారతా సంవత్సరంగా అభివర్ణించారు. పార్టీలో అన్ని పదవులనూ భర్తీ చేస్తామని.. ఉదయపూర్ డిక్లరేషన్‌ను సంపూర్తిగా అమలు చేస్తామని తెలిపారు. ఏఐసీసీ నుంచి మండల, బూత్ స్థాయి వరకు ఎన్నికల్లో గెలవడానికి అవసరమైన నైపుణ్యాలన్నీ పార్టీకి సమకూర్చుతామన్నారు. 'భారత్ అనే భావనను పార్టీకి అనుసంధానిస్తాం. సైద్ధాంతిక నిబద్ధత ఉన్నవారిని, కాంగ్రెస్ సిద్ధాంతాలపై విశ్వాసం ఉన్నవారిని, రాజ్యాంగంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నవారిని.. మనం ఎంచుకోవాలి. వారందరినీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలి. సంస్థాగత బాధ్యతల్లో భాగస్వామ్యం కల్పించాలి. కష్టపడి పనిచేయడం ఒక్కటే చాలదు. సకాలంలో నిర్మాణాత్మక వ్యూహం, దిశానిర్దేశం అవసరం. కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలాగే స్థానిక, నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి' అని నొక్కిచెప్పారు. కాంగ్రెస్‌కు సైద్ధాంతిక శక్తి, గాంధీ-నెహ్రూ, ఇతర గొప్ప నేతల వారసత్వం ఉన్నాయని.. నూతన సంకల్పం, కొత్త సందేశంతో బెళగావి నుంచి తిరిగి వస్తామని తెలిపారు. ఇవాళ రాజ్యాంగ పదవిలో ఉన్నవారు మహాత్మాగాంధీ సత్యాగ్రహాన్నే ప్రశ్నిస్తున్నారని, అందుకే వర్కింగ్ కమిటీ సమావేశానికి 'నవ సత్యాగ్రహ బైఠక్' అని పేరుపెట్టామని చెప్పారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు అసత్యాల తోడ్పాటుతో కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారి బండారం బయటపెట్టి.. ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యులు, పీసీసీ సభ్యులు, రాష్ట్రాల సీఎల్పీ నేతలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీసు బేరర్లు, మాజీ ముఖ్యమంత్రులు హాజరయ్యారు.



సీడబ్ల్యూసీ సమావేశం వేదిక వద్దకు ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నేతలు

గాంధీ వారసత్వానికి ముప్పు..

సీడబ్ల్యూసీ భేటీకి సోనియా సందేశం

కేంద్రంలో అధికారంలో ఉన్న వాళ్లు, వారిని పెంచి పోషించిన సిద్ధాంతాలు, సంస్థల వల్ల మహాత్మాగాంధీ వారసత్వానికి ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చీఫ్ సోనియా గాంధీ అన్నారు. ఈ సంస్థలు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నడూ పోరాడలేదని బీజేపీ, ఆరెస్సెస్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గాంధీని తీవ్రంగా వ్యతిరేకించారని, గాంధీ హత్యకు దారితీసేలా ఒక విషపూరిత వాతావరణాన్ని సృష్టించారని పేర్కొన్నారు. పైగా గాంధీ హంతకులను కీర్తిస్తారని విరుచుకుపడ్డారు. బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా సందేశాన్ని చదివి వినిపించారు. స్ఫూర్తికి ఒక ప్రాథమిక వనరుగా ఉన్న మహాత్మాగాంధీ.. భవిష్యత్తులోనూ కొనసాగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం, ఆరెస్సెస్‌పై సోనియా విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న గాంధేయ సంస్థలపై దాడి చేస్తున్నారన్నారు. అందుకే బెళగావి సీడ్ల్యూసీ సమావేశాన్ని 'నవ్ సత్యాగ్రహ బైఠక్' అని పేరు పెట్టడం సముచితమని పేర్కొన్నారు.

క్షీణ దశలో ప్రజాస్వామ్యం

రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ అంబేడ్కర్ ఎంతో శ్రద్ధచూపారని.. ఇబ్బందులు ఎదుర్కొన్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదని జవహర్‌లాల్ నెహ్రూ స్పష్టం చేశారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పేర్కొంది. పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయడంతో పాటు జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. 'రాజ్యాంగం అమల్లోకి వచ్చి మరో నెల రోజుల్లో (జనవరి 26) 75 ఏళ్లు కానుంది. ఈ తరుణంలో దురదృష్టవశాత్తూ రాజ్యాంగం ఇంతకుముందెన్నడూ లేనంత ముప్పును ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యాన్ని క్షీణింపజేస్తుండడం తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కార్యనిర్వాహక ఒత్తిడితో న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిష్, మీడియా వంటి వ్యవస్థలను రాజకీయమయం చేశారు. పార్లమెంటును పక్కనపెట్టేశారు. అధికార పార్టీ సభ్యులే సభ కార్యకలాపాలను అడ్డుకున్న చర్యను ఇటీవలి శీతాకాల సమావేశాల్లో చూశాం. సమాఖ్య వ్యవస్థపై దాడి కొనసాగుతోంది. ఆ క్రమంలోనే ఒక దేశం-ఒకే ఎన్నిక బిల్లు తెచ్చారు. కీలకమైన ఎన్నికల డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులోకి రాకుండా నియంత్రించేందుకు 1961నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనలను కేంద్రం సవరించడం.. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలకు మూలమైన పారదర్శకత, జవాబుదారీతనం అనే విలువలను నాశనం చేయడమే. దీనిని వర్కింగ్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ సవరణలను సుప్రీంకోర్టులో సవాల్ చేశాం. మహారాష్ట్ర, హరియాణాల్లో ఎన్నికల నిర్వహణ తీరు ఎన్నికల ప్రక్రియ సమగ్రతనే దెబ్బతీసింది. ప్రభుత్వ ప్రాయోజిత మత, జాతి విద్వేషాలు పెచ్చరిల్లడం.. ముఖ్యంగా మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను 50% సీలింగ్‌కు మించి పెంచాల్సిన అవసరం ఉంది. సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటు ప్రాతిపదికనే రిజర్వేషన్లు కల్పించాలి' అని తీర్మానంలో పేర్కొన్నారు. గాంధీజీపైనా విడిగా తీర్మానం ఆమోదించారు.

పాక్ సరిహద్దుకు కదిలిన 15 వేల మంది తాలిబన్ ఫైటర్లు

» ఆఫ్ఘన్‌లో పాక్ వైమానిక దాడులతో పెరిగిన ఉద్రిక్తతలు

కాబుల్, డిసెంబరు 26: పాక్-ఆఫ్ఘన్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. సరిహద్దుల్లోని బార్మల్ జిల్లాలో పాక్ జరిపిన వైమానిక దాడులపై ఆఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కన్నెర్ర చేసింది. పాక్ వైమానిక దాడుల్లో 46 మంది ముఖ్యంగా మహిళలు, చిన్నారులు చనిపోవడంతో తాలిబన్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాడులను అనాగరిక చర్యగా పేర్కొనడంతో పాటు పాకిస్థాన్‌పై బదులు తీర్చుకుంటామని తాలిబాన్ ప్రభుత్వం హెచ్చరించింది. ఆఫ్ఘానిస్థాన్‌లోని పాక్ రాయబారిని కూడా పిలిచి తీవ్ర నిరసన తెలిపింది. ఆ వెంటనే సుమారు 15 వేల మంది తాలిబాన్ ఫైటర్లు కాబుల్, కాందహార్, హెరాత్ నుంచి పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉన్న మీర్ అలీ సరిహద్దు వైపు కదులుతున్నారు. అయితే తాలిబాన్ల శిక్షణ శిబిరాలే లక్ష్యంగా దాడులు జరిపామని పాక్ అంటోంది. అసలే సరిహద్దు వెంబడి ఉన్న తెహ్రీక్ ఎ తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ)తో పడలేకపోతున్న పాకిస్థాన్‌కు ఇప్పుడు ఆఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కూడా శత్రువుగా మారింది. దీంతో ఇద్దరు శత్రువులను ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు సవాలేనని అంతర్జాతీయ పరిశీలకులు చెబుతున్నారు. 15 వేల మంది తాలిబాన్ ఫైటర్లతోనూ అలాగే టీటీపీ ఉగ్ర మూకలతోనూ పాక్ తలపడాల్సి ఉంటుంది.

రష్యా కాల్పుల వల్లే విమానం కూలిపోయిందా?

మాస్కో, డిసెంబరు 26: అజర్‌బైజాన్ విమానం కూలిపోవడానికి పక్షుల గుంపును ఢీకొనడం కారణం కాదా? ఉక్రెయిన్ డ్రోన్ అని భావించి రష్యా మిలిటరీ కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. విమానం వెనుక భాగంలో కనిపిస్తున్న రంధ్రాలు తూటాలు దూసుకెళ్లడం వల్ల పడినవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విమానం కూలిపోవడానికి ముందు లోపల ఒకరు తీసిన వీడియోలో ఓ మహిళ కాలికి గాయమైన దృశ్యాలు, క్యాబిన్ వాల్‌పై కనిపించిన రంధ్రాలు కూడా ఈ సందేహాలకు బలం చేకూరుస్తున్నాయి. ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు అజర్‌బైజాన్ ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. కాగా, రష్యా గగనతల రక్షణ వ్యవస్థ పొరపాటున కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందన్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. దర్యాప్తు పూర్తయితే అసలు కారణాలు తెలుస్తాయని, అప్పటి వరకు ఓపిక పట్టాలని క్రెమ్లిన్ ప్రతినిధి సూచించారు. బుధవారం అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం ఆ దేశ రాజధాని బాకూ నుంచి రష్యాలోని గ్రోజ్నీ నగరానికి వెళుతుండగా కజకిస్థాన్‌లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు సహా 38 మంది ప్రయాణికులు మరణించారు. మిగతా 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. విమానం పక్షులను ఢీకొట్టిన తర్వాత అత్యవసర పరిస్థితి తలెత్తిందని, దాంతో కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయంలో దింపే ప్రయత్నంలో కూలిపోయిందనేది ప్రాథమిక సమాచారం.

ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా తొలి తెలుగు శాస్త్రవేత్త

▸▸ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు



డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐఏఆర్ఐ) డైరెక్టర్‌గా తొలి తెలుగు శాస్త్రవేత్త డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లోని జాతీ య వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ(నారమ్) డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాసరావు గురువారం ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా అనిగండ్లపాడులో 1965 అక్టోబరు4న జన్మించిన శ్రీనివాసరావు స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య, జడ్పీ హైస్కూల్‌లో మాధ్యమిక విద్య చదివారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేసి, ఢిల్లీలోని ఐఏఆర్ఐలో పీహెచ్‌డీ చేశారు. వ్యవసాయరంగంలో ఆయన సేవలకు గుర్తింపుగా 2010లో రాష్ట్రపతి, 2015లో ప్రధాని నుంచి అవార్డులు అందుకున్నారు. కాగా.. డాక్టర్ శ్రీనివాసరావుకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

లిక్కర్ మార్కెట్‌లో '99' హవా!

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు తప్పక వాటిని ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి అమ్ముతున్నారు.

పెరుగుతూ వస్తోన్న అమ్మకాల వాటా

రాష్ట్రంలో సగటున నెలకు 30 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడవుతుంది. ఈ సంవత్సరం అక్టోబరు 16 నుంచి ప్రైవేటు మద్యం షాపుల పాలసీ అమల్లోకి రాగా.. ఆ నెలలో 15 రోజుల అమ్మకాల్లో 99 కేటగిరీ మద్యం 5.6 శాతంగా మాత్రమే ఉంది. ఉత్పత్తి తక్కువగా ఉండటంతో డిమాండ్ ఉన్నా అమ్మకాలు కనిపించలేదు. ఆ తర్వాత నవంబరులో 14.85 శాతానికి చేరింది. 4,55,086 కేసులను ఒక్క ఆ నెలలోనే విక్రయించారు. ఈ నెలలో 15వ తేదీ వరకు అమ్మకాలను పరిశీలిస్తే 19.95 శాతానికి పెరిగింది. ఇక ఈ నెలాఖరు వరకు చూస్తే ఆ వాటా 25 శాతానికి చేరినట్లు తెలిసింది. అంటే నెల మొత్తం రాష్ట్రంలో అమ్మే 30 లక్షల కేసుల్లో 99 బ్రాండ్ల మద్యమే దాదాపుగా 8 లక్షలు ఉంది. గతంలో చీప్ లిక్కర్ ఉన్నా అమ్మకాలు ఈ స్థాయిలో ఎప్పుడూ కనిపించలేదు. దీంతో రాబోయే రోజుల్లో 99 మద్యం అమ్మకాలు ఇంకా ఎక్కువ స్థాయికి చేరే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

హామీ ప్రకారం అమల్లోకి..

గత వైసీపీ ప్రభుత్వం మద్యం ధరలను ఇష్టారాజ్యంగా పెంచింది. పేదలకు మద్యం అందుబాటులో లేకుండా ధరలు పెంచుతామన్న ఒక్క మాటను అడ్డుపెట్టుకుని వినియోగదారులను పీల్చి పిప్పి చేసింది. నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచిందా.. అంటే అదీ లేదు!! తమ పార్టీకి కమీషన్లు ఇచ్చే బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజలను అనారోగ్యం పాలు చేసింది. దీంతో తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని తక్కు వ ధరకు అందుబాటులోకి తెస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. చెప్పినట్లుగానే రూ.99కే క్వార్టర్ మద్యం పేరుతో జాతీయ కంపెనీల మద్యాన్ని ప్రవేశపెట్టింది. అయితే అంత తక్కువ ధరకు నాణ్యత ఉండదని మొదట్లో భావించారు. మిగిలిన మద్యం కంపెనీలు కూడా 99 బ్రాండ్ల అమ్మకాలు పెద్దగా ఉండవని భావించాయి. కానీ అనూహ్యంగా వాటి అమ్మకాలు పెరిగాయి.

ప్రభుత్వానికి ఆదాయంపై ప్రభావం

రూ.99 మద్యంతో అటు ప్రభుత్వానికి, ఇటు లైసెన్సీలకు ఆదాయం తగ్గుతోంది. ధర ఎక్కువ ఉన్న మద్యం అమ్మితే అందులో ప్రభుత్వానికి ఎక్కువ పన్నులు వస్తాయి. ఉదాహరణకు రూ.200 ధర ఉన్న సీసా అమ్మినప్పుడు ప్రభుత్వానికి రూ.170 ఆదాయం వస్తే.. రూ.99 సీసా అయితే అందులో సగమే వస్తుంది. మరోవైపు మార్జిన్ తక్కువగా ఉన్నా.. వినియోగదారుల నుంచి డిమాండ్ భారీగా రావడంతో లైసెన్సీలు వ్యాపారం కోసం వాటిపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. దీంతో 99 బ్రాండ్లు కావాలని ఎక్సైజ్ శాఖపై ఒత్తిడి పెరుగుతోంది. మొదట్లో రోజుకు 15 వేల కేసులు సరిపోతాయని అంచనా వేయగా.. ఇప్పుడు రోజుకు 25 వేల కేసులు అవసరం అవుతున్నాయి. అయితే ఆదాయం తగ్గినా ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన మద్యం సరఫరా చేయాలనే హామీకి కట్టుబడి కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.



బలహీనపడిన అల్పపీడనం

▸▸ నేటి నుంచి స్వల్పంగా తగ్గనున్న రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం పూర్తిగా బలహీనపడింది. దీనిపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం మాత్ర ం కొనసాగుతోంది. వారం నుంచి కోస్తాలో వర్షాలు, ముసురుకు కారణమైన అల్పపీడనం బలహీనపడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తీరం వెంబడి గాలుల తీవ్రత కూడా తగ్గింది. గురువారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కావలిలో 70, టంగుటూరులో 63.5, కొత్తపట్నంలో 60.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో ఎగురవేసిన భద్రతా సూచికలు శుక్రవారం ఉపసంహరించనున్నట్టు పేర్కొంది. శుక్రవారం నుంచి రాత్రిపూట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని అంచనా వేసింది.

బాబును కలిసిన పారిశ్రామికవేత్తలు

వందల కోట్లతో పెట్టుబడుల ప్రతిపాదనలు

వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడి



పెట్టుబడిదారులతో కలిసి సీఎం చంద్రబాబుతో భేటీ అయిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తల బృందం గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసింది. పలు పెట్టుబడుల ప్రతిపాదనలపై వారి మధ్య చర్చ జరిగింది. మాజీ మంత్రి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా ముఖ్యమంత్రిని కలిశారు. రాష్ట్రంలో విశాఖపట్నంతోపాటు నెల్లూరు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. సీఎంను కలిసినవారిలో మెడిటాబ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మితేష్ పటేల్, ఎఫ్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఎఫ్‌సీ పటేల్, మోలిక్యులర్ కేటలిస్ట్ కంపెనీ సీఈవో బలగాని వెంకట్, డైరెక్టర్ డాక్టర్ భరత లక్ష్మి ఉన్నారు. 200- 300 ఎకరాల్లో మోలిక్యులర్ కేటలిస్ట్ కంపెనీ తాము ఒక జెనోమిక్స్ జోన్ ఏర్పాటు చేసి రూ.200కోట్ల పెట్టుబడితో ఉన్నత స్థాయి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఇందులో 150మందికి ఉన్నత స్థాయి ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అలాగే, రూ.500 కోట్లతో 600మందికి ఉద్యోగావకాశాలు వచ్చేలా పలు ప్రదేశాల్లో ఆతిథ్య కేంద్రాలు, కన్వెన్షన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రవేగ్ హాస్పటాలిటీ సంస్థ తన ప్రతిపాదనలో పేర్కొంది. రన్‌వే అందుబాటులో ఉంటే రూ.400 కోట్ల పెట్టుబడితో ఏవియేషన్ కార్యకలాపాలు చేపడతామని, 1000 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్కై ఫ్రాంటియర్ సంస్థ తెలిపింది. ఫిలిప్పీన్స్ దేశంలో ప్రస్తుతం ఉన్న తమ కార్యకలాపాలను ఇక్కడికి మారుస్తామని, 50ఎకరాలు ఇవ్వగలిగితే రూ.150 కోట్ల పెట్టుబడితో 1000మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని డోస్‌పాక్ ఆటోమేషన్ సంస్థ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై పరిశీలన జరిపిస్తామని, అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.

అప్పన్న సేవలో జస్టిస్ కిరణ్మయి



కప్ప స్తంభం వద్ద జస్టిస్ కిరణ్మయి

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి గురువారం సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తర్వాత న్యాయమూర్తికి పండితులు ఆశీర్వచనాలీయగా, ఏఈఓ ఎన్.ఆనందకుమార్ ప్రసాదాలు అందజేశారు.

విశాఖలో నేపాల్ కాన్సులేట్!

▸▸ ఏపీలో పర్యాటక అభివృద్ధికి పరస్పర సహకారం

▸▸ నేపాల్ హై కమిషనర్ డాక్టర్ సురేందర్ తాపా వెల్లడి



సమావేశంలో పాల్గొన్న నేపాల్ హైకమిషనర్ సురేందర్ తాపా, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, నేపాల్ మంత్రి తార్నద్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు సాంబశివరావు, ఏపీ ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నరేష్‌కుమార్

మహారాణిపేట(విశాఖపట్నం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యాటక అభివృద్ధిలో నేపాల్, ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకారంతో ముందుకు సాగుతాయని నేపాల్ హై కమిషనర్ డాక్టర్ సురేందర్ తాపా పేర్కొన్నారు. ఇందులో భాగంగా నేపాల్ కాన్సులేట్ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గురువారం ఇక్కడి ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ పర్యాటకంగా ఆకట్టుకుంటోందన్నారు. సాగర తీరంతోపాటు అనేక పర్యాటక ప్రదేశాలు సందర్శించామని, నేపాల్ నుంచి పర్యాటకులను ఇక్కడకు పంపించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, నేపాల్ మంత్రి తార్నద్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు సాంబశివరావు, ఏపీ ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నరేష్‌కుమార్, దసపల్లా గ్రూపు చైర్మన్ రాఘవేంద్రరావు, కన్నెగంటి విజయ్‌మోహన్, పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల వేటలో ఏపీఎండీసీ

▸▸ 5వేల కోట్ల సమీకరణకు ప్రభుత్వ అనుమతి

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) అప్పుల వేటలో పడింది. కొత్త ప్రాజెక్టుల నిర్వహణకు రూ.5వేల కోట్ల నిధుల సమీకరణ(అప్పులే) చేయాలనుకుంటోంది. ఇందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు సలహాదారుగా ఓ మర్చంట్ బ్యాంక్‌ను నియమించేందుకూ అనుమతిస్తూ గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు(జీవో 97) జారీ చేశారు. అప్పులు ఎలా తేవాలి? ఎలా ఖర్చుపెట్టాలి? కొత్తగా ఏ ఏ ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టాలి? తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వడానికి మర్చంట్ బ్యాంకర్ కావాలని ఎండీసీ భావిస్తోంది. ఇందుకోసం టెండర్లు పిలిచి, ఆసక్తి ఉన్న మర్చంట్ బ్యాంకర్ల నుంచి బిడ్‌లను ఎండీసీ స్వీకరించాల్సి ఉంది. ఈ మొత్తం ప్రక్రియ కోసం టెండర్ డాక్యుమెంట్(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) తయారీ, టెండర్ల నిర్వహణ కోసం నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. ఎండీసీ ఎండీ, ఈడీ, గనుల శాఖ డిప్యూటీ సెక్రటరీ, ఎండీసీలో జనరల్ మేనేజర్, పీపీపీ నిపుణుడు షలీమ్‌రాజు, ఎండీసీ ఫైనాన్స్ డీజీఎంలు సభ్యులుగా ఉంటారు. కేవలం ఎండీసీ అవసరాల కోసమే ఈ నిధుల సమీకరణ చేయాలనుకుంటున్నట్టు ఆ ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది. ఈనెల 20వ తేదీన జరిగిన ఎండీసీ బోర్డు సమావేశంలో 5వేల కోట్ల నిధుల సమీకరణ ప్రతిపాదనపై చర్చించి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆధారంగానే ప్రభుత్వం నిధుల సమీకరణకు అనుమతి ఇచ్చింది.

రాయ్‌పూర్ డీఆర్‌ఎంగా సాంబశివరావు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ మధ్య రైల్వే జోన్ పరిధిలోని రాయ్‌పూర్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం)గా కోగంటి సాంబశివరావును నియమించారు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌టీఎస్‌లో పనిచేస్తున్న సాంబశివరావును రాయ్‌పూర్ డీఆర్‌ఎంగా బదిలీ చేస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. కాగా, సాంబశివరావు గతంలో రాష్ట్ర ఫైబర్‌నెట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్థిక ఆర్తిని తీర్చిన మన్మోహనం!

కావాల్సిన వాళ్లు, ప్రేమించిన వాళ్లు, ఆరాధించిన వాళ్లు మరణించినప్పుడు మనసు వికలం అవ్వటం సహజం. వ్యథ చెందటం సహజం. విషాదం వేయిపాయలుగా ప్రవహించటం సహజం. తీర్చలేని లోటు ఏర్పడి కడలిసుడిలా ఉద్వేగం ఉప్పొంగటమూ సహజం. వ్యక్తులే కాదు ఒక ఘననాగరికత కల దేశమూ కొన్ని సందర్భాల్లో అటువంటి విషాద సన్నివేశంలో పడిపోతుంది. పదికాలాలు గుర్తించుకోదగ్గ నాయకుడూ, గర్వించదగ్గ నాయకుడూ, విలువలున్న నాయకుడు మరణిస్తే ఆ సన్నివేశం వద్దన్నా మన హృదయాల్లో గూడుగట్టి మనల్ని విచలితుల్ని చేస్తుంది. ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా, పదేళ్లపాటు దేశ ప్రధానిగా పనిచేసిన మన్మోహన్ మరణంతో ఇప్పుడు భారత్‌కు అదే పరిస్థితి ఎదురైంది. నాయకుడు అన్ని సందర్భాల్లోనూ మహా ధీరోదాత్తుడు అయివుండనక్కర్లేదు. రాజకీయ రంగాన వీరోచిత పాత్రను పోషించాల్సిన అవసరమూ ఉండనక్కర్లేదు. మహాచాకచక్యుడై కౌటిల్యనీతిలో ఘటికుడూ కానక్కర్లేదు. అసాధారణ పరిస్థితుల్లో నమ్రతతో, నవ్యతతో, మర్యాదతో సహజపద్ధతిలో అణగారిన శక్తులను స్వేచ్ఛగా పైకి వచ్చేలా చేయగలిగితే గొప్ప విషయమే. ఆ నాయకుడు గొప్ప నాయకుడే. భారత ఆర్థికవ్యవస్థలో ఎంతోకాలం అణగిమణగి ఉన్న శక్తులను అలా పైకి వచ్చేలా విధానాల నిచ్చెలను ఏర్పరచటంలో మన్మోహన్ పాత్ర అనితర సాధ్యమైంది. ఆర్థికంగా పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని అప్పటి ప్రధాని పీవీ భావించి ఉండొచ్చు. సంస్కరణలు, మార్పులు అనివార్యమని గట్టిగా అనుకుని ఉండొచ్చు. కాదనలేం! కానీ బండిని దారిన పెట్టాలని అనుకోవటం వేరు. ఆ దారిని ఏ కొలతలతో నిర్మించాలి... ఏ పదార్థాలతో పటిష్ఠం చేయాలి... ఎంత బరువు భరించేలా దాన్ని రూపొందించాలి.. అన్నవాటిని నైపుణ్యం ఉన్నవారే నిగ్గుతేల్చగలరు. మన్మోహన్ మౌనముని అయినా ఆ నైపుణ్యం పుష్కలంగా ఉన్న వ్యక్తి. అందుకే భారత్ ఆర్థిక పరివర్తనను అతితక్కువ వ్యవధిలో అతితక్కువ నష్టాలతో సాధించగలిగారు. ఆర్థికసంస్కరణలపై భిన్నాభిప్రాయాలు ఎన్నైనా ఉండొచ్చు. అన్నివర్గాలకూ అవి సమంగా చేరలేదనీ అనొచ్చు. కానీ అవి దేశ ఆర్థిక సామర్థ్యాన్ని, ప్రజల జీవన ప్రమాణాలను అంతకు ముందు పరిస్థితితో పోల్చితే కొంతైనా ముందుకు నడిపించలేదనీ అనలేం. ఎన్ని కొలమానాలు పెట్టుకు చూసినా ఇంతకు భిన్నమైన దృశ్యాన్ని ఊహించలేం.

అనుకున్నవి చేయగలిగినవాళ్లు జీవితాల్లోనే అరుదుగా ఉంటారు. రాజకీయాల్లో అదింకా అరుదు. ఆర్థిక సంస్కరణల విషయంలో అనుకున్న వాటిని సాధించలేదన్న అసంతృప్తి మన్మోహన్‌కూ ఉండేది. సొంతపార్టీకి లోక్‌సభలో బలం అరకొరగా ఉన్నపరిస్థితుల్లో, ఆర్థిక సంస్కరణలతో అన్ని అనర్థాలే కలుగుతాయన్న వాతావరణంలో పరిస్థితులను నెట్టుకురావటం అంత సులభం కాదు. సున్నిత మనస్కుడైన మన్మోహన్‌కు అది మరింత కష్టం. అయినా నెగ్గుకొచ్చారు. భారత రాజకీయాల్లో అదొక వింత.

2004లో ప్రధాని పదవిని చేపట్టి పదేళ్ల పాటు కొనసాగినా ఎక్కువ భాగం ఆయనకు ముళ్లపాన్పుగానే ఉండిపోయింది. ప్రధాని పదవికి ఇవ్వాల్సిన గౌరవాన్ని సొంతపార్టీ నేతలే ఇవ్వని పరిస్థితిని బహుశా ఏ ప్రధాని మన్మోహన్‌లా ఎదుర్కోలేదు. అధికార ఉత్తర్వులను ముఖం ముందే చించివేసినా ఎదిరించలేని అశక్తతనే ప్రదర్శించారు. తన ప్రమేయంలేని, తను ఆశించని, తను ఊహించని అవినీతి పరిణామాలు, ఆరోపణలు తనను కారుమేఘాల్లా కమ్ముకున్నప్పుడూ ఆయన ఆక్రోశాన్నీ ఆవేశాన్నీ ఆవేదననూ వ్యక్తంచేయలేని నిస్సహాయుడిగా మిగిలిపోయారు. ఎవరినో లక్షిస్తూ వేసిన బాణాలకు ఆయన బాధితుడిగా ఉండిపోయారు. ఆయన సారథ్యంలో దేశం అవినీతిలో, కుంభకోణాల్లో కూరుకుపోయిందనీ ఆరోపించినవారు కూడా మన్మోహన్‌కు వాటిల్లో ప్రమేయం లేదనీ తెలుసు. రాజకీయాల కోసం ఎంతటి వారినైనా ఏ స్థాయికైనా దిగజార్చగలగటం మన ఘన ప్రజాస్వామ్యం విశిష్టతేమో!

భారత ప్రధానిగా ఉండే వ్యక్తికి కొన్ని సుగుణాలు ఉండాలని మనం కోరుకుంటాం. మోసం, కపటం, అవినీతి ఉండకూడదనీ ఆశిస్తాం. దయ, కరుణ, సానుభూతితో వ్యవహరించాలని కోరుకుంటాం. మతోన్మత్తత ఏ కణంలోనూ ఉండని గుణసంపన్నుడు కావాలనుకుంటాం. ఇవన్నీ నిండుగా ఉన్న వ్యక్తి మన్మోహన్. రాజకీయాల్లో అరుదైన సందర్భాల్లో అంతే అరుదైన పాత్రను పోషించగలగటం భారత చరిత్ర వింత మలుపులు తిరగగలిగిన శక్తికి నిదర్శనం!

అంబేడ్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ

ఇటీవల కేంద్ర హోంశాఖ మాత్యులు అమిత్ షా మాట్లాడిన మాటల్లో 16 సెకండ్ల వీడియోను కట్ చేసి, దురుద్దేశంతో రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు శివాలెత్తుతున్నాయి. రాజ్యసభలో అమిత్ షా ఒక గంట 32 నిమిషాలు చేసిన ప్రసంగంలో మూడు నిమిషాల 36 సెకండ్లు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ గురించి మాట్లాడారు. అందులోంచి 16 సెకండ్ల వీడియోను బయటికి తీసి చిలువలు పలువలు చేసి అమిత్‌ను, బీజేపీని బోన్‌లో నిలబెట్టే ప్రయత్నం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు కుటిల యత్నం చేస్తున్నాయి. నెహ్రూ కాలం నుంచి రాహుల్‌గాంధీ వరకు అంబేడ్కర్‌తో పాటు ఎందరో దేశభక్తుల త్యాగాలను వాడుకొని గద్దెనెక్కడం తప్ప కాంగ్రెస్ పార్టీకి ఇంకేమీ తెలియదు. ఆ పార్టీ అన్యాయం చేసిన వాళ్లలో సుభాష్ చంద్రబోస్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, అంబేడ్కర్, సర్దార్ వల్లభభాయ్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్ వంటి ఎందరో గొప్ప వ్యక్తులు ఉన్నారు.

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏనాడూ అంబేడ్కర్‌ను సహించలేదు. దళితుల పక్షాన మొదటి న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్‌ను నియమించినా, ఆయనకు సరైన గౌరవం ఇవ్వలేదు. సి. రాజగోపాలాచారి, అంబేడ్కర్ రాజీనామా చేస్తున్నారని నెహ్రూకి తెలిసినపుడు.. రాజాజీ పోవడం వల్ల నాకు కొంత నష్టం కానీ, అంబేడ్కర్ వల్ల ఏ లాభం లేదు, పోతే పోనీ! అన్నారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి చెందిన మీర్జా అజ్మీర్ బేగ్ తన పరిశోధనలో బయటపెట్టిన అంశం ఏమిటంటే– నెహ్రూ మనస్తత్వం వంటపట్టిన కాంగ్రెస్‌వాదులకు అంబేడ్కర్‌ను రాజ్యాంగ సభ సభ్యుడుగా చేయడం కూడా ఇష్టం లేదు. "296 మంది రాజ్యాంగ సభ సభ్యుల్లో కూడా మొదట అంబేడ్కర్ ఉండాలని నెహ్రూ వర్గం కోరుకోలేదు" అని బేగ్ తన రచనల్లో తేల్చి చెప్పాడు. గాంధీని అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ప్రమోట్ చేసేవారు, గాంధీజీ మరణించిన అరు సంవత్సరాల తర్వాత బాబాసాహెబ్ రాజ్యసభలో మాట్లాడుతూ గాంధీజీ గురించి వ్యక్తం చేసిన భావాలను తెలుసుకోవాలి. దళితుల పేరిట రూ.20 కోట్ల స్కీమును ప్రారంభించి, దానికి గాంధీజీ పేరు పెట్టాలని బాబాసాహెబ్ కోరుకున్నాడు. అంటరానితనం పట్ల నెహ్రూ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, 370 ఆర్టికల్ భారత సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పాడు. కానీ ఏనాడూ అంబేడ్కర్ మాటను నెహ్రూ, ఆయన నడిపే కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు, పైగా ఘోర అవమానం చేశారు.



నేటి ఆధునిక యుగంలో ఎవరు ఎటువంటి అబద్ధాలకు, దుష్ప్రచారాలకు పాల్పడినా, వాటిని ఇట్టే బయటపెట్టేస్తోంది సోషల్ మీడియా. అందుకే ఈ యుగంలో కాంగ్రెస్ ఆటలు సాగవని ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.

పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఫోటోలను పెట్టారు. కానీ అంబేడ్కర్ ఫోటోను పెట్టడానికి ఆ పార్టీకి మనస్కరించలేదు. భారతీయ జనతా పార్టీ మద్దతుతో ఏర్పడిన వీపీ సింగ్ ప్రభుత్వం అంబేడ్కర్ ఫోటోను ఆవిష్కరించింది. బతికుండగానే 'భారతరత్న' పురస్కారాలను ప్రకటించుకున్న నెహ్రూ, ఇందిరలు... బాబాసాహెబ్ చనిపోయిన తరువాత కూడా 'భారతరత్న' ప్రకటించడానికి ఇష్టపడలేదు. కాంగ్రెసేతర ప్రభుత్వం బాబాసాహెబ్‌కు భారతరత్న ప్రదానం చేసింది. ఎప్పుడూ బాబాసాహెబ్‌ను కాంగ్రెస్ పార్టీ భారత సమాజం నుంచి దూరం పెట్టాలనే ప్రయత్నమే చేసిందని 'పటేల్ ఏ లైఫ్' అన్న పుస్తకంలో రాజమోహన్ గాంధీ స్పష్టంగా తెలిపారు.

భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించిన అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ కలిసి ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యేటట్లు చేశారు. 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' అన్న పుస్తకంలో ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ 112వ పేజీలో ఈ విషయాలన్నీ వివరించాడు. బాబాసాహెబ్ మొదటిసారి ముస్లిం లీగ్ తరఫున సంయుక్త బెంగాల్‌లో నిలబడితే 1.5 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ ఓడించింది. రెండోసారి 1954లో మహారాష్ట్రలోని బండారా ఉప ఎన్నికలో బాబాసాహెబ్ పోటీకి దిగితే, అంబేడ్కర్ అనుచరుడైన నారాయణ్ కాజ్రోల్‌కర్‌ను ఆయనపై పోటీకి నిలబెట్టి కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో 17,153 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడించారు. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే 1970లో ఇందిరాగాంధీ ప్రభుత్వం కాజ్రోల్‌కర్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. అప్పటివరకు డాక్టర్ బాబాసాహెబ్‌కు ఒక్క అవార్డు కూడా ఇవ్వలేదు.

బాబాసాహెబ్ పట్ల ఇన్ని దురాగతాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ, ఈ రోజు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తోంది. ఆఖరికి బహుజన నాయకుడైన సీతారామ్ కేసరిని పార్టీ అధ్యక్షునిగా నియమించి, చివరికి ఆయనను బాత్రూంలో బంధించి సోనియా గాంధీ పార్టీని స్వాధీనం చేసుకున్నది. దళిత నాయకుడైన బాబు జగ్జీవన్‌రామ్‌ను కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ అనేక అవమానాలకు గురి చేశారు. సిక్కుల్లో దళిత వర్గానికి చెందిన మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు... రాజ్యాంగం ప్రకారం ఆమోదితమైన ఒక చట్టపు కాగితాన్ని ఆయన చేతిలో నుంచి లాక్కొని, ఏ పదవిలో లేని రాహుల్‌గాంధీ మీడియా ముందే చించేశాడు. అటువంటి రాహుల్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఉందా?

బతికున్నప్పుడు అంబేడ్కర్‌ను వేధించిన కాంగ్రెస్, ఇప్పుడూ అదే మార్గంలో నడుస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చేస్తారంటూ రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీపై దుష్ప్రచారం చేసింది. రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలను తన స్వార్థ రాజకీయాల కోసం నిర్దాక్షిణ్యంగా కూలగొట్టిన కాంగ్రెస్ పార్టీని, దేశానికి ఎమర్జెన్సీ విధించి, చీకటి రోజులు తెచ్చిన ఇందిరాగాంధీని ఈ దేశం మరవలేదు. కానీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల్ని దుర్మార్గంగా తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసిన కాంగ్రెస్, ఇప్పుడు రోజూ రాజ్యాంగం గురించి, అంబేడ్కర్ గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉంది. 2000 సంవత్సరానికి ముందు విస్తృత స్థాయిలో మీడియా లేదు. అప్పుడు ప్రభుత్వాలు చెప్పిందే ప్రజలు నమ్మాల్సిన పరిస్థితి. నేడు ఆధునిక యుగం. ఎవరు ఎటువంటి అబద్ధాలకు, దుష్ప్రచారాలకు పాల్పడినా, వాటిని ఇట్టే బయటపెట్టేస్తోంది సోషల్ మీడియా. అందుకే ఈ యుగంలో కాంగ్రెస్ ఆటలు సాగవని, ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.



• ఎం. రఘునందన్‌రావు
పార్లమెంటు సభ్యులు, మెదక్

సేవాదళ్ స్ఫూర్తితో నిర్మాణాత్మక రాజకీయాలు

నన్ను మొదట ఆకట్టుకున్నది వారి గానమే. రాజకీయ సమావేశాలలో పాటలు పాడడం అసాధారణం కదా. గాయకుడు శ్రావ్యంగా పాడుతున్నాడు, మరాఠీ చరణాలను నేను అర్థం చేసుకోలేకపోయినా పాట భావ పూర్ణంగా ఉన్నది. ఆ గాయకుడు సంజీవ్ సానే. అతడొక కార్మిక నాయకుడు, బుద్ధి నైశిత్యమున్న రాజకీయ వ్యూహకర్త. ఆ తరువాత బృందగానం ప్రారంభమయింది. ప్రధాన గాయకుడు సంజయ్ ఎమ్‌జీ. వృత్తిరీత్యా ఇంజనీరింగ్ ప్రొఫెసర్. నిమ్నజాతులకు చెందిన యువజనులకు థానేలో ఒక 'సంస్కార్ శిబిర్'ను నిర్వహించిన వివేకశీలి. ఆయన పేరులోని ఎమ్‌జి అన్న అక్షరాలు 'మంగళ గోపాల్'ను సూచిస్తాయి.. మంగళ తల్లి పేరుకాగా గోపాల్ తండ్రిపేరు. తన పేరులో అమ్మానాన్న పేర్లను చేర్చుకున్న సంస్కారి. నిషా శివుర్కార్ ఏ పాటా పాడలేదు. అయితే ఈ వినమ్రశీలి భర్తలు వదిలివేసిన, గెంటివేసిన 'పరిత్యక్త' మహిళలను సంఘటితం చేసిన సామాజిక కార్యకర్త. ఇది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇక దృఢ సంకల్పుడు అయిన విలాస్ భోంగాడె యువ దళిత క్రియాశీలి. తన చేతల ద్వారానే తాను చెప్పదలుచుకునేది చెప్పే ఉద్యమకారుడు.

సరిగ్గా 30 సంవత్సరాల క్రితం థానేలో సమాజ్‌వాది జనపరిషత్ ప్రారంభ సమావేశంలో వీరందరూ నాకు తటస్థించారు. అదే వారితో నా మొదటి పరిచయం. అంతేకాదు శక్త్యుత్సాహాలు పరిపూర్ణంగా ఉన్న మహారాష్ట్ర ప్రజా జీవితంతో కూడా నాకు అదే మొదటి పరిచయం ఆదర్శవాదం, ప్రగతిశీల భావజాలం, భావచైతన్యం, క్రమశిక్షణ సమ్మిళితమైన ఈ యువ రాజకీయ క్రియాశీలురులో ఏదో ఒక ప్రత్యేకత ఉన్నది, సందేహం లేదు. నాకు సుపరిచితమైన ఉత్తర భారతావని సామాజిక రాజకీయ క్రియాశీల ప్రపంచానికి ఇది పూర్తిగా భిన్నమైనది. వ్యక్తిత్వాలలోను, ప్రతిభా పాటవాల వ్యక్తీకరణలోను విలక్షణులు అయిన ఈ మరాఠీ క్రియాశీలురులో అనేక సామ్యాలు కనిపించాయి. ఏ సంస్థ నుంచి వీరు ప్రభవించారు అని ఆశ్చర్యం కలిగింది. తెలుసుకోవాలన్న ఆసక్తి జనించింది ఎవరో ఒకరు 'సేవాదళ్' అని అన్నారు. అవును వీరంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ సంస్థకు చెందినవారే.

రాష్ట్ర సేవాదళ్ (ఆర్ఎస్‌డి లేదా సేవాదళ్)ను 1941లో సోషలిస్టులు స్థాపించారు. అప్పటికివారు ఇంకా భారత జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా ఉన్నారు. జాతీయవాదం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, హేతువాదంకు నిబద్ధమైన ఒక యువజన స్వచ్ఛంద సంస్థే రాష్ట్ర సేవాదళ్. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు పోటీగా సేవాదళ్ ఏమీ ఏర్పడలేదు (ఆరెస్సెస్‌కు అప్పట్లో అంతగా రాజకీయ ప్రాధాన్యం లేదని మరి చెప్పనవసరం లేదు). సంఘ్, సేవాదళ్ మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. అయినా రెండిటి మధ్య ఒక సామాన్యాంశం ఉన్నది. రోజూ 'శాఖ' సమావేశాల ద్వారా బాలలు, నవ యవ్వన యువకులను సంఘటితం చేయడం ఈ రెండు సంస్థల ప్రధాన కార్యకలాపంగా ఉండేది. ఈ దైనందిన సమావేశాలలో వారు ఆటలు ఆడేవారు, వ్యాయామం చేసేవారు, సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొనేవారు, సైద్ధాంతిక చర్చలు జరిపేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్ఎస్‌డి కాంగ్రెస్ నుంచి నిష్క్రమించింది. సోషలిస్టు పార్టీలకు, ఏ ఒక్క సోషలిస్టు పార్టీకి అనుబంధ సంస్థ కాకుండా వాటితో సన్నిహితంగా పనిచేసేది. సేవాదళ్ అస్తిత్వ మొదటి దశాబ్దంలో దానికి చైతన్యశీల, స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందించిన ధీమంతుడు, దీక్షాదక్షుడు పాండురంగ సదాశివ్ సానే (1899–1950). సానే గురూజీగా మహారాష్ట్రలో ప్రతి ఒక్కరికీ గౌరవనీయుడు. తొలుత ప్రస్తావించిన థానే సమావేశంలో నేను విన్న పాట -ఖరా తో ఏక్చి ధర్మ/ జగాల ప్రేమ్ అర్పావె- సానే గురూజీ విరచితమే. ఆ పాట పాడిన సంజీవ్ సానే పేరు గురూజీ గౌరవార్థం పెట్టిందే.



మన గణతంత్ర రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు తప్పనిసరి అయిన విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలకు ఒక విశిష్ట నమూనాను రాష్ట్ర సేవాదళ్ సమకూర్చింది. దేశ పౌరులను ప్రగతిశీల రాజకీయ విద్యావంతులుగా చేయడం, యువ తరాల వారిలో రాజ్యాంగ విలువలను పాదుకొల్పడం, సమస్యలపై సృజనాత్మకంగా ఆలోచించడం, వాటి పరిష్కారాలకు కొత్త ఆలోచనలతో ఎజెండాలు రూపొందించుకోవడం, నవ భావాలతో పనిచేసే రాజకీయ కార్యకర్తలు, నాయకులను సుశిక్షణతో తయారుచేసుకోవడం లక్ష్యాలుగా కల రాజకీయాలు ఈనాడు మనకు అవసరం.

సానే గురూజీని ఏమనాలి? ఒక సోషలిస్టు నాయకుడు అనవచ్చునా? కేవలం అలా భావించడం ఆయన్ని గౌరవించడం కాబోదని అనుకుంటున్నాను. ఆయన ఒక అజ్ఞాత కార్యకర్త, ఒక నిరుపమాన నిర్మాణదక్షుడు, ఒక నిర్భీక నిరసనకారుడు. ఎటువంటి అన్యాయాన్ని సహించలేని సానే గురూజీ ఒక గాంధేయవాది, ఒక జాతీయవాది, ఒక సామ్యవాది, అదే సమయంలో ఆయన ఒక ఋషి తుల్యుడు. ఆయన ఉద్రేకపూరిత ప్రసంగాలు, ఉత్తేజకర రచనలు మహారాష్ట్ర యువజన ప్రపంచాన్ని చైతన్యపరిచాయి. ముఖ్యంగా ఆయన తన మాతృమూర్తి గురించి రాసిన 'ష్యాంచీ ఆయీ' మహారాష్ట్రలో అనేక తరాల వారి మనస్సులపై చెరగని ముద్ర వేసింది. ఆయన 'భారతీయ సంస్కృతి' మన చిరంతన సంస్కృతిపై ఒక కొత్త అవగాహనను కల్పించింది. మూఢ నమ్మకాలు, మత మౌఢ్యాన్ని ఆయన నిర్ద్వంద్వంగా ఖండించేవారు. తెగ, విశ్వాసం, కులం, జెండర్ ప్రాతిపదికన ఎవరి పట్ల వివక్ష చూపని అద్వైత దర్శనం ఆయనకు స్ఫూర్తి. మరో 82 ఇతర సంస్థలతో కలిసి ఆర్ఎస్‌డి, ప్రస్తుత అధ్యక్షుడు నితిన్ వైద్య నేతృత్వంలో ఒక ఏడాది కాలంగా నిర్వహిస్తున్న 'సానే గురూజీ 125వ జయంత్యుత్సవాలు' ఇటీవలే ముగిసాయి. మహారాష్ట్ర ప్రగతిశీల రాజకీయాలలో సేవాదళ్ అడుగుజాడలను గత మూడు దశాబ్దాలుగా నేను గమనిస్తూ వస్తున్నాను. అది అనేక సంస్థలకు స్ఫూర్తిగా నిలిచింది. ఛాత్ర భారతి, సమాజ్‌వాది మహిళా సభ, ముస్లిం సత్యశోధక్ సమాజ్, సమాజ్‌వాది అధ్యాపక్ సభతో పాటు భారతీయ భాషల మధ్య ఒక మేధో అనుబంధాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన అంతర్ భారతి, నిర్మాణాత్మక కార్యకలాపాలకు ఏర్పడ్డ సేవాపథక్, ఎస్ఎమ్ జోషి సోషలిస్ట్ ఫౌండేషన్, సానే గురూజీ మెమోరియల్ ట్రస్ట్ మొదలైనవి సానే గురూజీ స్ఫూర్తిదాయక వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నాయి.

మహారాష్ట్రలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అందరూ రాష్ట్ర సేవాదళ్‌తో సంబంధమున్నవారే కావడం గమనార్హం. రాజకీయ నాయకులు ఎస్ఎమ్ జోషీ, మృణాల్ గోరే, మధు దండావతే, బాపు కల్దాటె; సామాజిక క్రియాశీలురు సుధా వెర్దె, ప్రమీలా దండావతే, నరేంద్ర దభోల్కర్, హమీద్ దల్వాయి, బాబా అధావ్, మేధా పాట్కర్; సినీ నాటక రంగాలకు చెందిన శ్రీరామ్ లాగూ, నీలూ పూలే, స్మితా పాటిల్; మేధావులు ఆచార్య జావదేకర్, గణేష్ దేవి మొదలైనవారు విశేషంగా ఎన్నదగినవారు.

రాష్ట్ర సేవాదళ్‌కు తన అస్తిత్వ మొదటి రెండు దశాబ్దాలలో ఉన్న శక్తి సామర్థ్యాలు ఇప్పుడు లేవు. అయితే మన రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు తప్పనిసరి అయిన విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలకు ఒక విశిష్ట నమూనాను ఆ సంస్థ సమకూరుస్తుంది. ఒకటి మాత్రం స్పష్టం: మన గణతంత్రరాజ్య వ్యవస్థ కూల్చివేతకు ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలను ఎన్నికలలో బీజేపీకి గట్టి పోటీ నివ్వడం ద్వారా మాత్రమే ఎదుర్కోలేము, నిరోధించలేము. దేశ పౌరులను ప్రగతిశీల రాజకీయ విద్యావంతులుగా చేయడం, యువ తరాల వారిలో రాజ్యాంగ విలువలను పాదుకొల్పడం, సమస్యలపై సృజనాత్మకంగా ఆలోచించడం, వాటి పరిష్కారాలకు కొత్త ఆలోచనలతో ఎజెండాలు రూపొందించుకోవడం, నవ భావాలతో పని చేసే రాజకీయ కార్యకర్తలు, నాయకులను సుశిక్షణతో తయారు చేసుకోవడం భారత్‌గా ఊహించుకున్న సమాజాన్ని పునః సృష్టించుకోవడం లక్ష్యాలుగా కల విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలు ఈనాడు మనకు అవసరం. అటువంటి రాజకీయ సంస్కృతిని ఆనాడు రాష్ట్ర సేవాదళ్ సృష్టించి, పెంపొందించింది. ఆ దార్శనికత, కార్యదక్షతే నేడు మనలో లోపించింది. ఈ కొరతను తీర్చుకోవడానికి మనం వెన్వెంటనే పూనుకోకపోతే మన రిపబ్లిక్ భవిష్యత్తుకు తప్పక ముప్పు వాటిల్లుతుంది. రాష్ట్ర సేవాదళ్ పాఠాలు ఏమిటో గ్రహించడం కష్టమేమీ కాదు. వాటిలో మొదటిది– మనం మన యువజనులనే కాకుండా పాఠశాల బాలలనూ లక్ష్యంగా చేసుకోవల్సిన అవసరమున్నది. రెండోది– క్రీడలు, సాహిత్యం, కళల ద్వారా వ్యక్తిత్వ నిర్మాణ కార్యకలాపాలపై దృష్టి పెట్టడం. మూడోది– రాజ్యాంగ విలువలు, సామ్యవాద, లౌకికవాద గణతంత్ర రాజ్య ఆదర్శాలను పెంపొందించే ఏ ప్రయత్నమైనా వాస్తవిక జాతీయ వాదంగా, సుదృఢమైన ప్రాంతీయ సంస్కృతిగా, మన పురా నవ నాగరికతా స్ఫూర్తిగా అంతస్థగితం కావాలి. నాలుగోది– అన్యాయాల వ్యతిరేక పోరాటాలను నిర్మాణాత్మక కార్యాచరణతో కలిసికట్టుగా నిర్వహించాలి. ఐదోది– ఈ ప్రయోజనకర రాజకీయాలు ఎన్నికల వ్యవహారాలు, రాజ్యాధికారాలలో జోక్యం చేసుకుంటూనే ఏ రాజకీయ పార్టీకి అయినా సరే ఆమడ దూరంలో ఉండి తీరాలి.



▪ యోగేంద్ర యాదవ్

ఇటువంటి విశిష్ట కృషికి ఆదర్శప్రాయమైన నమూనా ఆర్ఎస్‌డి మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా ఎన్నో సంస్థలు ఉన్నాయి: ద్రవిడ కజగం, కేరళ సాహిత్య శాస్త్ర పరిషత్, కర్ణాటక రాజ్య రైతా సంఘ్, దళిత్ సంఘర్ష్ సమితి (కర్ణాటక), ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్, ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా, ఛాత్ర యువ సంఘర్ష్ వాహిని, ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్, జయేష్ (మధ్యప్రదేశ్), సమతా సంఘటన్, బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్. ఈ ప్రస్తావిత సంస్థల సృజనాత్మక జీవితం స్వల్పకాలికమైనదే అయినప్పటికీ వాటిలో అత్యధికం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాల వ్యవస్థీకరణ, సుసాధ్యతలను అవి ధ్రువీకరించాయి.

ఈ తరం యువజనులలో రాజకీయ ప్రక్రియల ద్వారా సమాజ జీవితంలో పాలుపంచుకునే శ్రద్ధాసక్తులు లోపించడం పట్ల విచారగ్రస్తులమయినప్పుడు, వారి రాజకీయ ఉదాసీనతను తప్పుపట్టినప్పుడు, వారి సంకుచిత రాజకీయ వైఖరుల పట్ల దిగ్భ్రాంతి చెందినప్పుడు మనకు మనమే ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవాలి: యువతలో రాజ్యాంగ విలువల పట్ల నిష్ఠా భావాన్ని పెంపొందించేందుకు దోహదం చేసే సంస్థలను మనం నిర్మించామా? విద్వత్ ఆసక్తులను పెంపొందించే స్టడీ సర్కిల్స్ సంప్రదాయం ఏమయిపోయింది? నిర్మాణాత్మక కార్యకలాపాలకు యువతను ప్రోత్సహిస్తున్నది ఎవరు? నిత్య జీవిత సమస్యలను విశాల రాజకీయ కర్తవ్యాలతో సంధానిస్తుంది ఎవరు? సమస్య వారితో లేదు మనతో ఉన్నది. మనకొక దార్శనిక నమూనా ఉన్నది. దాని స్ఫూర్తితో మనం తక్షణమే కార్యాచరణకు పూనుకోవాలి. ఇంకెంత మాత్రం జాప్యం కూడదు. ఇది మనకు ఒక సవాల్. మనం నిర్దేశించుకోవలసిన జీవిత లక్ష్యం. మన కాలం సానే గురూజీల కోసం అవి నిరీక్షిస్తున్నాయి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

జమిలి కాదు, సంస్కరణలు ముఖ్యం

దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడమే సర్వరోగ నివారణి అంటున్నది కేంద్ర ప్రభుత్వం. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుందని, అభివృద్ధిపై దృష్టి సారించవచ్చని, శాంతిభద్రతల సమస్యలు ఉండవని కేంద్ర ప్రభుత్వం వాదన. కానీ జమిలి ఎన్నికలు జరిగినప్పటికీ లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు కావనే గ్యారంటీ ఏమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడితే ఏదైనా సాధ్యమేనని, జమిలి ఎన్నికలు ముఖ్యం కాదు, ఎన్నికల సంస్కరణలు తక్షణావసరం అంటున్నారు. ముందు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమైన, పారదర్శకమైన పాలనకు బాటలు వెయ్యాల్సిన ఎన్నికల విధానాన్ని సంస్కరించాల్సి ఉంది. లెక్కకు మించిన కుంభకోణాలతో కోటానుకోట్లు కొల్లగొట్టిన నేతలు చట్టసభల్లో శాసననిర్మాతలై వెలిగిపోతున్నారు. చట్టసభల్లో నేరచరితగలవారు, నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు 25 నుంచి 50 శాతానికి ఎగబాకినా, ఈ అవ్యవస్థను రూపుమాపాలన్న ఆలోచన ఎవరూ చెయ్యడం లేదు?

నేరస్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకట్ట వేసే శాసనంతోనే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడుతుందని, అటువంటి చట్టాన్ని పట్టాలెక్కించాలని కొన్నేళ్ల క్రితమే పార్లమెంటును సర్వోన్నత న్యాయస్థానం కోరినా, ఆచరించిన దాఖలాలు లేవు. ఏటా ఎన్నికల్లో డబ్బు ప్రమేయం ఎలా పెరిగిపోయిందో చూస్తున్నాం. సామాన్యుడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లే ఇండియాలో ఎన్నికల వేళ నాట్యమాడుతున్నది దాదాగిరి ధనస్వామ్యమే. ఎంత ఖర్చుపెట్టయినా ఎన్నికైతే చాలు అధికార పార్టీలోకి ఫిరాయించి డబ్బు సంపాదించవచ్చు అనే ధోరణి వికృతరూపం దాల్చింది. దీనిని అడ్డుకోవాలంటే ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా పార్టీ మారిన వెంటనే వారి సభ్యత్వం సభాపతి సహా ఎవరి ప్రమేయం లేకుండా తక్షణం రద్దయిపోయేలా చట్టం తేవాలి.

1990లో గోస్వామి కమిటీ నుంచి జస్టిస్ జె.ఎస్ వర్మ సారథ్యంలో ఏర్పాటయిన సంఘాల వరకు ఎన్నికల సంస్కరణలు అత్యావశ్యమని తేల్చి చెప్పాయి. సమాజ శ్రేయాన్ని, దేశాభివృద్ధిని కాంక్షించే వారికి స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థే భరోసాగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగాలంటే ఎన్నికలను నిర్వహించే సమున్నత వ్యవస్థ స్వతంత్రతతో రాజీపడరాదన్న సుప్రీం స్ఫూర్తికి పట్టం కట్టాలి. రాజ్యాంగంలోని 324 అధికరణ ద్వారా తనకి దఖలుపడిన విస్తృత అధికారాలతో ఎన్నికల సంఘం పటిష్ఠ చర్యలు తీసుకొనే విధంగా ఎన్నికల వ్యవస్థని సమూలంగా ప్రక్షాళించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థని కంటికి రెప్పలా సర్వ స్వతంత్రంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే బలమైన అధికారం ఉన్న ఎన్నికల కమిషన్ నేడు కీలుబొమ్మగా మారిందన్న అపప్రథ ఉన్నది. అధికారం ఉన్నవారి ఎదుట ధైర్యంగా నిలబడేవారిని ఎన్నికల కమిషనర్లుగా నియమించాలని సర్వోన్నత న్యాయస్థానం కూడా స్పష్టం చేసింది. కఠినమైన ఎన్నికల సంస్కరణలు అమలు చేసి ప్రజల్లో భారతీయ ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించాలి. ఇప్పటికైనా కేంద్రంలోని ప్రభుత్వం సత్వరం ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టి, రాజకీయాల్లో నేరస్తుల నిర్మూలనపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంది. అనేక ప్రజాస్వామ్య దేశాలు రాజ్యాంగ వ్యవస్థల బలోపేతమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు పటిష్ఠ సంస్కరణలు చేపడుతున్నాయి. కాబట్టి రాజకీయాల్లో విలువలు పెంచే విధంగా అన్ని వైపుల నుంచి కఠినాతి కఠినమైన ఎన్నికల సంస్కరణల అమలుకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలి.

– నీరుకొండ ప్రసాద్

అంతర్రాష్ట్ర జల వివాదాలపై దృష్టి పెట్టాలి!

జగన్మోహన్‌రెడ్డి తన అయిదేళ్ల పరిపాలన కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అటకెక్కించడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలను జటిలం చేసి వెళ్లారు. అటు కర్ణాటక ఇటు తెలంగాణతో నెలకొన్న పరిష్కారం కాని వివాదాలు దురదృష్టం కొద్దీ కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమనే చుట్టుముడుతున్నాయి.

ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణ ట్రిబ్యునల్‌లో సమర్థవంతంగా వాదించేందుకు, అనువైన చర్యలు చేపట్టేందుకు తోడు అంతర్రాష్ట్ర జల వివాదాంశాలపై ఉన్నత స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించడం ఎంతైనా అవసరం. తుంగభద్ర జలాశయం పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని కర్ణాటక ప్రభుత్వం ఎగువ భాగంలో వరసబెట్టి రిజర్వాయర్ల నిర్మాణానికి తలపడుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడిక ఏర్పడి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వాస్తవమైనా దానివల్ల ఒక్క కర్ణాటకే కాకుండా ఆంధ్రప్రదేశ్ వాటాలో కూడా కోత పడుతోంది. ఆంధ్రప్రదేశ్ వాటా 72 టీఎంసీలకు గాను 40 టీఎంసీలు కూడా రావడం లేదు.

జగన్ హయాంలోనే 2022లో 29 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడమే కాకుండా, జాతీయ హోదా కూడా లభ్యమైంది. అప్పర్ భద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా అప్పట్లో రాయలసీమలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. కాని ముఖ్యమంత్రిగా జగన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. కాగా 2020లోనే గంగావతి తాలూకాలో నావళి వద్ద 31 టీఎంసీలతో మరొక ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. ఈ ప్రాజెక్టు కూడా తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందనే పేరుతోనే ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక ప్రవేశపెట్టి ఆమోదించమని కోరింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువకు ఆమోదం కోరినట్లు వార్తలు వచ్చాయి. నావళి ప్రాజెక్టు కూడా నిర్మిస్తే తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో 60 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటక రెండు రిజర్వాయర్లను అదనంగా నిర్మించుకొంటుంది. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఉన్న కేసు ఇప్పుడు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణ సందర్భంగా సమర్థవంతంగా వాదించేందుకు అనుభవమున్న లాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువ వరద జలాల ఆధారంగా కోరబడినా ప్రయోజనం లేదు. కర్ణాటక పైభాగం నుంచి వచ్చే వరద కిందకు రాకుండా ఆ రాష్ట్రం రిజర్వాయర్లు నింపుకొంటుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నావళి ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకించాలి. చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న సాగునీటి రంగ సమీక్ష సమావేశాల్లో ఇంజనీరింగ్ అధికారులు అంతర్రాష్ట్ర జల వివాదాల్లో ముందు వచ్చే ఇబ్బందులను వివరంగా నివేదించవలసి ఉంది.


జగన్ నిర్వాకంతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. కృష్ణ నదీ జలాల వినియోగ చరిత్ర తిరగేస్తే కృష్ణ నదీ పరీవాహక ప్రాంతంలో ఏ రాష్ట్రమూ నదీ జలాలను వినియోగించని రోజుల్లో 1895–1928 సంవత్సరాల్లోనే ప్రప్రథమంగా రాయలసీమలోని కేసీ కెనాల్ రైతులు తమ పొలాలకు తుంగభద్ర నీళ్లు పారించారు. అంతటి చరిత్ర గల కేసీ కెనాల్‌కు కృష్ణ జలాలు ఉపయోగించకూడదని, తిరిగి పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ డిమాండ్ చేస్తే, 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్ మూగనోము పట్టారు. 2020 సెప్టెంబర్‌లో కేంద్ర మంత్రి షెకావత్ అధ్యక్షతన జరిగిన అదే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి జలాల్లో కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాటా తేల్చేందుకు కొత్త ట్రిబ్యునల్ నియామకంపై తీర్మానం చేశారు. కాని తర్వాత కాలంలో గోదావరి జలాలపై ట్రిబ్యునల్ గురించి జగన్ ఏ మాత్రం పట్టించుకోలేదు.

ఈ అంశంలో తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 1480 టీఎంసీల్లో తమ వాటా 957.85 టీఎంసీలని, ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 530 టీఎంసీలేనని తెగేసి చెబుతోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా ప్రయత్నం చేస్తే కేంద్ర ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ కూడా వేసే అవకాశం ఉంది. కాని కూటమి ప్రభుత్వం గోదావరి జలాలు వాటా తేల్చేందుకు కొత్త ట్రిబ్యునల్ కోరడం లేదు. ఈ విషయంలో ట్రిబ్యునల్ ఆవశ్యకతను ఇంజనీరింగ్ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లవలసి ఉంది.

వీటన్నింటికీ మించి వేసవిలో గొంతెండిపోయే రాయలసీమకు కనీసం తాగునీటిని కూడా ఉంచకుండా తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసింది. ఈ ఏడాది వరద ముంచెత్తి 1600 టీఎంసీలు శ్రీశైలం జలాశయం చేరాయి. గేట్లు మూడుమార్లు ఎత్తి వందలాది టీఎంసీలు కిందకు వదిలారు. జలాశయం నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను డిసెంబర్ 22వ తేదీకి కేవలం 114.24 టీఎంసీలు మాత్రమే రిజర్వాయర్‌లో ఉన్నాయి. డిసెంబర్ ఒకటవ తేదీ వరకు తెలంగాణ మొండిగా విద్యుదుత్పత్తి చేస్తూ రోజూ 35వేల క్యూసెక్కులు కిందకు వదిలేసింది. ఈ రోజుకు 33,285 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి. కృష్ణ యాజమాన్య బోర్డు పోస్టాఫీసు మాదిరిగా వ్యవహరిస్తోంది. విషాదమేమంటే మొన్న జూలై నుంచి నవంబర్ ఆఖరు వరకు కృష్ణ బ్యారేజీ నుంచి 845 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయి. ఈ నేపథ్యంలో వేసవిలో తాగునీటికి కటకటలాడవలసి వస్తే రాయలసీమ ప్రజల మనోభావాలు ఎలా ఉంటాయో ఎవరైనా ఊహించగలరు.

మరోవైపు ఏకపక్షంగా టీడీపీకి పట్టం గట్టిన ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రజలు వంశధార, నాగావళి నదుల అనుసంధానికి ఎదురుచూస్తున్నారు. జగన్ ఈ అనుసంధానం విషయంలో కూడా మోయలేని భారం పెట్టి పోయారు. జగన్ హయాంలో 2021లోనే వంశధార ట్రిబ్యునల్... ఆంధ్రప్రదేశ్ నేరడి వద్ద బ్యారేజీ నిర్మించుకొని, కాట్రగడ వద్ద సైడ్‌వేర్ నిర్మించుకోవచ్చని తుది తీర్పు ఇచ్చింది. 2017లో ముసాయిదా తీర్పు వచ్చాక 2019లో ఒడిషా సుప్రీంకోర్టు కెక్కినందున ట్రిబ్యునల్ తీర్పును కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ చేయలేదు. జగన్ తన అయిదేళ్ల కాలంలో ఒడిషాతో సంప్రదింపులు జరపలేదు. ఇప్పుడు ఒడిషాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది.

జగన్మోహన్ రెడ్డి తన అయిదేళ్ల పరిపాలన కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అటకెక్కించడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలను జటిలం చేసి వెళ్లారు. కర్ణాటక, తెలంగాణ, ఒడిషాతో నెలకొన్న పరిష్కారం కాని జల వివాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని మున్ముందు ఇవి జటిలం కాకుండా సంప్రదింపులతో పరిష్కరించవలసి ఉంది.




చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని ఒడిషా ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపితే తప్పకుండా అంగీకరించవచ్చు.

వాస్తవంలో వంశధార జలాలను కూడా ఒడిషా ఉపయోగించుకోవడం లేదు. కాట్రగడ వద్ద సైడ్‌వేర్ నిర్మాణంతో ఒడిషా భూభాగంలో కేవలం 106 ఎకరాలు మాత్రమే ముంపు ఉంటుంది. ఏటా వంద టీఎంసీలకు లోపు నీళ్లు సముద్రం పాలౌతున్నాయి. కాట్రగడ వద్ద సైడ్‌వేర్ నిర్మాణం జరిగితే కేవలం 40 కోట్ల రూపాయల వ్యయంతోనే 35 కిలోమీటర్ల వరద కాలువ వయా హీర మండలం జలాశయం ద్వారా నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టకు నీళ్లు చేరుతాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 19.5 టీఎంసీలు సామర్థ్యంతో హీర మండలం జలాశయం నిర్మాణం జరిగి ఉంది. కాని జగన్ ఆ పని చేపట్టకుండా వంశధారపై గతంలో నిర్మించిన గొట్టా బ్యారేజీ పాండ్ నుంచి 185 కోట్ల రూపాయల వ్యయంతో ఎత్తిపోతల పథకం పనులకు సిద్ధమయ్యారు. ఈ ఎత్తిపోతలు ఏ మాత్రం ఆచరణ యోగ్యం కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని మున్ముందు జటిలం కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలు సంప్రదింపులతో పరిష్కరించవలసి ఉంది.

▪ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



గురువారం నగరంలో పోలీసు తనిఖీలు



శిరసావహించాల్సిందే..

పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెల్మెట్‌ధారణ ఇక తప్పనిసరి



- నిత్యం పోలీసులతో తనిఖీలు
- మొదటిసారి తప్పునకు జరిమానా
- పదేపదే ఉల్లంఘిస్తే వాహనం సీజ్
- పరిస్థితి మారకపోతే లైసెన్స్ సస్పెన్షన్
- సీపీ రాజశేఖరబాబు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హెల్మెట్ నిబంధనను పోలీసులు కఠినం చేశారు. ఇప్పటివరకు కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని భావిస్తున్నారు. ఇక నుంచి నిత్యం వాహనదారులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిరంతరం హెల్మెట్ ధారణకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులను ఇందుకు ఉపయోగించనున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వాహనదారులకు జరిమానా విధించడమే కాకుండా, పదేపదే ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేయాలని నిర్ణయించారు. కొన్ని రోజులుగా చలానాల సంఖ్య పెరుగుతోంది. హైకోర్టు స్పందనకు ముందు రోజుకు 200 నుంచి 300 వరకు కేసులు నమోదు చేసేవారు.

మిగతా 6లో..

ఒక్కరోజు.. 2,567 కేసులు.. రూ.9.91లక్షల జరిమానా

ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 2,657 కేసులు నమోదు చేశారు. తద్వారా రూ.9లక్షల91వేల265 చలానాలు విధించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్‌ధారణ, చలానాల విధింపులపై అవగాహన పెంపునకు ఆటోల్లో మైకులతో ప్రచారం చేయిస్తున్నారు.



చోరీకి గురైన బంగారాన్ని చూపిస్తున్న సీపీ

నగ్నదొంగ అరెస్టు

ఒంటిపై బట్టలు లేకుండా చాకచక్యంగా చోరీలు

- ఖాళీ స్థలాల పక్కన ఉన్న ఇళ్లే టార్గెట్.. పక్కా రెక్కీ
- ఇంట్లో అందరూ ఉన్నా, లేకున్నా తెలివిగా దొంగతనం
- ఒక్క సాక్ష్యాధారం కూడా వదలకుండా బయటకు..
- చోరీల సొమ్ముతో తునిలో భారీ భవన నిర్మాణం
- చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ పోలీసులు
- ఎలా పట్టుకున్నారో చెప్పాలంటూ దొంగ వేడుకోలు
- హైదరాబాద్‌లోనూ దొంగతనాలు
- చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి వస్తుండగా పట్టుకున్న పోలీసులు

8లో

వీడిన వివాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ల్యాంకో టవర్ల మార్పిడి పాత అలైన్‌మెంట్ ప్రకారమే..
- సీఎం నియమించిన ప్రత్యేక కమిటీ నిర్ణయం
- ఫలించిన రైతుల ఉద్యమాలు, ఆంధ్రజ్యోతి కథనాలు
- తాజా నిర్ణయం ద్వారా కేంద్రానికి రూ.100 కోట్ల ఆదా
- దాదాపు 40 ఎకరాల రైతులకు ఊరట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ విద్యుత్ టవర్ల వివాదం చిక్కుముడి వీడింది. రైతుల పోరాటం, 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణకు ఆదేశించటంతో సమస్య దాదాపు పరిష్కారమైంది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే టవర్ల ఎత్తు పెంచి కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వంపై రూ.100 కోట్ల అదనపు భారం తగ్గింది.


సమస్య ఇదీ..

విద్యుత్ టవర్ల రీ లొకేషన్‌కు సంబంధించి గత జూన్ 14న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కీలకమైన ఆదేశాలిచ్చింది. గైడ్‌లైన్-3 ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ విలువ ఎక్కువగా ఉండాలి. మార్కెట్ విలువ ప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించాలి. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్ వెళ్తున్న ప్రాంతాలైన జక్కంపూడి, నైనవరం ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ ఎకరం రూ.80 లక్షలు ఉంది. కమర్షియల్‌గా చూస్తే రూ.5 కోట్లు ఉంది. ఈ లెక్క ప్రకారం రైతులకు పరిహారాన్ని చెల్లించాలి. గైడ్‌లైన్-4లోని టవర్ బేస్ కాంపన్సేషన్ విషయానికొస్తే.. మార్కెట్ రేటుకు 200 శాతం చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలి. ఈ లెక్కన 41 ఎకరాలకు సంబంధించి రైతులకు రూ.60 కోట్ల మేర పరిహారం ఇవ్వాలి. అలాగే, లైన్లు వెళ్లే పొలాలకు కూడా గైడ్‌లైన్-5 ప్రకారం మార్కెట్ రేటులో 30 శాతం అంటే.. రూ.40 కోట్ల మేర పరిహారం చెల్లించాలి. ఈ రెండూ కలిపితే రూ.100 కోట్ల మేర కేంద్ర ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వాలి. రైతుల ఉద్యమం, 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాల ఫలితంగా రూ.100 కోట్ల మేర కేంద్ర ప్రభుత్వానికి ఆదా అయింది.

రైతులకు వరం

నేషనల్ హైవే ఆర్వో కార్యాలయ అధికారులు అనాలోచితంగా, ల్యాంకో సంస్థ ప్రయోజనాల కోసం రూ.32.58 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. తాజాగా ఈ సమస్యకు పరిష్కారం లభించటంతో ఖర్చుపెట్టగా, మిగిలిన మరో రూ.20 కోట్ల మేర కేంద్రానికి ఆదా అవుతుంది. తాజాగా బీదర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా జక్కంపూడి, నైనవరం రైతులకు వరంగా మారాయి. బీదర్‌లో ఇలాంటి అంశంపైనే కేసు విచారణకు రాగా, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆదేశాలను పాటించాలని తీర్పు వెలువడింది. ఇదే తీర్పును తాజాగా రైతులు ఏపీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ కేసుల్లో కోర్టు ఇప్పటికే 11 స్టేలు ఇచ్చింది. తుది తీర్పు రాకముందే సమస్య పరిష్కారం కావటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బెంజిసర్కిల్ వద్ద నడిరోడ్డుపై తాగుతున్న మందుబాబులు







రోడ్డెక్కిన కిక్కు

నగరంలో రోడ్లపైనే యథేచ్ఛగా మద్యపానం

- ప్రధాన రోడ్లనూ వదలని మందుబాబులు
- పార్కుల్లోనూ సిట్టింగ్‌లు.. వివాదాలు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు
- మహిళలు, అమ్మాయిలపై కామెంట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో కీలకమైన ప్రాంతాల్లో బహిరంగ మద్యంపానం శ్రుతివించుతోంది. మద్యం షాపులు తెరవగానే మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో వాలిపోతున్నారు. మద్యం సీసాలు కొని అక్కడే తాగడం మొదలుపెడుతున్నారు. ఇది వాహనదారులకు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులకు ఇబ్బందిగా మారుతోంది. వైసీపీ పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. బార్ అండ్ రెస్టారెంట్లను మాత్రమే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. నాడు షాపులన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండటంలో అమ్మకాలు మాత్రమే ఉండేవి. దీంతో మందుబాబులు షాపుల్లో మద్యం కొని, ఖాళీ ప్రదేశాలకు వెళ్లి తాగడం ప్రారంభిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు లాటరీ విధానంలో కేటాయించింది. ఏ షాపు వద్దా పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వలేదు. తాగుడుకు బానిసలైన వారు షాపులు తెరవడానికి ముందే అక్కడికి చేరుకుంటున్నారు. ఎక్కడ ఖాళీస్థలం కనిపిస్తే అక్కడ సిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

● బెంజిసర్కిల్ వద్ద రెండు సర్వీసు రోడ్లున్నాయి. ఒకవైపు బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. మరో సర్వీసు రోడ్డులో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ దుకాణంలో మద్యం సీసాలను కొన్న వ్యక్తులు అక్కడే ఫ్లైఓవర్ కింద ఉన్న ఖాళీ ప్రదేశంలో బహిరంగంగా మందు తాగేస్తున్నారు. మరికొంతమంది రెండో సర్వీసు రోడ్డుకు అనుబంధంగా ఉన్న నారా చంద్రబాబునాయుడు కాలనీలోకి ప్రవేశిస్తున్నారు. డిస్పోజబుల్ గ్లాసులు, నీళ్ల సీసాలు వెంట తెచ్చుకుని, ఆటోల్లో పార్టీ చేసుకుంటున్నారు. కొంతమంది రోడ్డు పక్కన ఆపిన కార్ల పక్కకు వెళ్లి సిట్టింగ్ వేస్తున్నారు.

● గాంధీనగర్‌లోని ఐలాపురం హోటల్‌కు ఎదురుగా ఉన్న ప్రదేశంలోనూ ఇదే పరిస్థితి. మద్యంషాపు నుంచి సరుకును కొని, అక్కడున్న రోడ్డు డివైడర్‌పై దుకాణం పెడుతున్నారు. ఇక్కడే బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఆ మత్తులో వచ్చీ పోయే వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మహిళలను అసభ్యకరంగా కామెంట్ చేశారు. ప్రశ్నిస్తే తిరగబడుతున్నారు.

పాడైన పార్కుల్లో..

సందర్శకులు లేని, పాడైన పార్కులు మందుబాబులకు కేంద్రాలుగా మారుతున్నాయి. వాటిలో గ్రూపులుగా కూర్చుని మందువిందు చేసుకుంటున్నారు. రాణిగారితోటకు ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పార్కులో చెట్ల కింద సందర్శకులు కూర్చోవడానికి గ్రానైట్‌తో దిమ్మలు నిర్మించారు. కరోనా తర్వాత నుంచి ఈ పార్కును వీఎంసీ పట్టించుకోవడం మానేసింది. ఫలితంగా పార్కులో పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు పాడైపోయాయి. దీంతో ఈ పార్కులోకి సందర్శకులు, వాకర్స్ రావడం క్రమంగా తగ్గిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు బ్యాచ్‌లుగా వచ్చి మద్యం తాగుతున్నారు. అంతేకాకుండా నగరంలోని వివిధ ప్రదేశాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొంతమంది యజమానులు వాటికి ఎలాంటి ప్రహరీలు నిర్మించకపోవడంతో మద్యపానం కోసం ఆ ప్రాంగణాల్లోకి చేరుతున్నారు. రహదారులకు పక్కన, రోడ్డు డివైడర్ల వద్ద మద్యం తాగుతున్న వ్యక్తుల వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, అమ్మాయిలను అసభ్యకరంగా కామెంట్లు చేయడంతో వివాదాలు జరుగుతున్నాయి. యనమలకుదురు-అవనిగడ్డ కరకట్ట మార్గంలో ఒకచోట రెండు బార్ అండ్ రెస్టారెంట్లు, పెదపులిపాక వద్ద మద్యం షాపు ఉంది. ఇక్కడ మద్యం తాగేసిన మందుబాబులు కిక్ ఎక్కువకావడంతో కరకట్టపైకి చేరి వీరంగం చేస్తున్నారు.

అయ్యో పాపం

- చెత్తకుప్పలో పసికందు
- కంచికచర్లలో ఘటన



కంచికచర్ల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాల పెదవుల ఆర్తి ఇంకా తీరలేదు.. అమ్మ పొత్తిళ్లలో వెచ్చదనం పూర్తిగా అందనేలేదు.. ఆ పసికందు కళ్లు తెరవకముందే అనాథగా మారింది. హృదయ విదారకమైన ఈ ఘటన కంచికచర్లలో రాజ్యలక్ష్మీ గ్యాస్ కంపెనీ రోడ్డులో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఏ తల్లికి ఏ కష్టం వచ్చిందో తెలియదు కానీ, అప్పుడే పుట్టిన పసిపాపను ముళ్ల పొదల్లో విసిరేసింది. ఈ రోడ్డులో వెళ్తున్న పాదచారులకు పాప ఏడుపులు వినిపించి అక్కున చేర్చుకున్నారు. అప్పటికే చిన్నారి చేతివేళ్లను చీమలు కుట్టేశాయి. తొలుత ఆ పసికందును వైద్యం నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ మధురిమ మాట్లాడుతూ పసికందుకు వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కాగా, మెరుగైన వైద్యం నిమిత్తం పాపను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుప్పకూలిన వంతెన

- ఈదులమద్దాలి వద్ద చంద్రయ్య కాల్వపై ఒక్కసారిగా కూలిన వంతెన
- 10 గ్రామాలకు రాకపోకలు బంద్
- అధికారుల నిర్లక్ష్యమేనన్న గ్రామస్థులు



6లో

పక్కా ప్లాన్‌తో..

భవానీపురంలో వార్డు ప్లానర్ల అక్రమాలు

- అనధికార నిర్మాణాల్లో కాసుల వేట
- బీపీఎస్‌ను ఎరగా చూపి వసూళ్లు
- ప్లాన్లు లేకుండా జరిగిపోతున్న నిర్మాణాలు
- వీఎంసీ ఆదాయానికి భారీగా గండి

ఓవైపు భవన నిర్మాణాల్లో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామంటూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటనలు చేస్తుంటే, మరోవైపు వార్డు సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీలు భవన అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నారు. వైసీపీ హయాంలో నియమితులైన వీరిని పర్యవేక్షించాల్సిన వీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు సైతం కాసుల మత్తులో తూగుతుండటంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : భవానీపురంలోని పలు ప్రాంతాల్లో స్థానిక వార్డు ప్లానింగ్ సెక్రటరీల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 43వ డివిజన్ పరిధిలోని భవానీపురం మార్బుల్ ఎస్టేట్ ప్రాంతంలో ఓ వ్యాపారి సుమారు 3 వేల గజాల ఖాళీస్థలంలో వ్యాపార అవసరాలకు భారీ రేకుల షెడ్డు నిర్మించారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోవటంతో తొలుత అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ కొద్దిరోజులకే నిర్మాణ పనులు చేపట్టారు. ఈ షెడ్డు సమీపంలో మరో 600 గజాల స్థలంలో మరో మార్బుల్ వ్యాపారి వీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. 41వ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ (మహ్మదీయ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాట్లు)లో భార్యాభర్తలకు వేర్వేరుగా 230 గజాల చొప్పున రెండు ప్లాట్లు ఉన్నాయి. ఈ ప్లాట్లను ప్రతాప్ అనే వ్యక్తి అద్దెకు తీసుకుని అనధికారికంగా భారీ షెడ్డు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లటంతో కార్పొరేషన్ అధికారులు అడ్డుకుని పనులు నిలిపివేశారు. మళ్లీ కొద్దిరోజులకే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు. రెండు ప్లాట్లకు గానూ ఒకే ప్లాన్ తీసుకుని భారీ నిర్మాణం చేపడుతున్నారు. వీటివల్ల కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ వ్యవహారాల్లో ప్లానింగ్ సెక్రటరీలే కీలక పాత్రధారులు. వారి పర్యవేక్షణలోనే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి.



భవానీపురంలోని మార్బుల్ కాంప్లెక్స్‌లో అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలు

వార్డు ప్లానర్లే కీలకం

● 53వ డివిజన్‌లో విధులు నిర్వహించిన వార్డు ప్లానర్ తన అక్రమ సంపాదనతో వన్‌టౌన్ శేషయ్య వీధిలో లక్షలాది రూపాయలతో ఒక ప్లాట్‌ను,

మిగతా 6లో..



● వందేళ్ల అరుణ పతాక

సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని నగరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అరుణ పతాకాన్ని చేతబూని సీపీఐ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ జరిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు ప్రసంగించారు.

నేటి నుంచి కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలు

- మూడు రోజుల వేడుకకు ముస్తాబైన కూచిపూడి గ్రామం
- రోజూ ఉదయం ప్రసంగాలు, సాయంత్రం ప్రదర్శనలు
- ముగింపురోజు 2 వేల మంది కళాకారులతో బృందనాట్యం
- 50 అడుగుల నాట్య పతాక స్థూపం ఆవిష్కరణ

6లో

చివరి గింజ కొనే వరకు అప్రమత్తం

- రైతులను చేయిపట్టి నడిపించండి
- ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించడం ఓ బాధ్యత
- నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంగా పనిచేయండి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

6లో

నేటి నుంచి పతాక నాట్యోత్సవాలు

» ముస్తాబైన కూచిపూడి క్షేత్రం


ఆవిష్కరణకు సిద్ధమైన నాట్య పతాక స్థూపం

కూచిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్దేంద్రయోగి నాట్య కళావేదికపై కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు నాట్యక్షేత్రమైన కూచిపూడి ముస్తాబైంది. వేడుకల్లో భాగంగా ఉదయం ప్రసంగాలు, సాయంత్రం నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ముగింపు రోజైన ఆదివారం రెండు వేలమంది కళాకారులతో బృంద నాట్యం కూచిపూడి ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ, విదేశాల కళాకారులు ఈ వేదికపై ప్రదర్శన ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా 50 అడుగుల నాట్య పతాక స్థూపాన్ని ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి తెలిపారు.

నభూతో నభవిష్యత్ అనేలా కార్యక్రమాలు

- ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి



నభూతో నభవిష్యత్ అనే విధంగా కార్యక్రమాలు రూపకల్పన చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాచీన కూచిపూడి సాంప్రదాయ కళలను భావితరాలకు, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కూచిపూడి ప్రాశస్త్యాన్ని ప్రపంచ నలుమూలల విస్తరించేందుకు అందరి సహకారంతో చేపట్టాం.

కూచిపూడి నాట్యం అజరామరం

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రాచీన కూచిపూడి నాట్య కళ అజరామరం. మూడు రోజుల కూచిపూడి నాట్యోత్సవ వేడుకల విజయవంతానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది. మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తదితరులు పాల్గొంటారు.

స్వర్ణోత్సవాలకు సర్వం సిద్ధం

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



కూచిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాట్యక్షేత్రమైన కూచిపూడిలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాట్యోత్సవాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతోపాటు అమెరికా, రష్యా, కెనడా, జపాన్ దేశాలకు చెందిన కళాకారులు తమ నాట్య ప్రదర్శనల ద్వారా సిద్దేంద్ర యోగికి నాట్య నీరాజనాలు అర్పించనున్నట్టు తెలిపారు. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను కార్మిక శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తోపాటు పలువురు మంత్రులు, శాసనసభ్యులు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు నాట్య శిక్షణా శిబిరం, 9 గంటలకు నాట్య పతాక స్థూప ఆవిష్కరణ, 9.30 నుంచి రాత్రి 11 వరకు నాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ముగింపు రోజైన ఆదివారం 2 వేలమంది కళాకారులతో బృంద నాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. దేశ విదేశాల నుంచి తరలి వచ్చే కళాకారుల ప్రదర్శనలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మధురానుభూతిని మిగిల్చేలా..

మహాశిల్ప సందర్శన

» స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ సామాజిక, న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి మరింత మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి పటిష్ట ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతి వనానికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు, వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, ఫౌంటెయిన్లు, ఆర్వో ప్లాంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితరాలతో పాటు సుస్థిర నిర్వహణ పరంగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, మ్యూజికల్ ఫౌంటెయిన్, కుడ్య చిత్రాలు, అంబేడ్కర్ చైత్య ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తదితరాల సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ పైనా దృష్టిసారించాలన్నారు. డాల్బీ ఆటమ్స్ విహారా మినీ థియేటర్, ప్రదర్శనలు, ఫుడ్‌కోర్టు, వైజ్ఞానిక వినోద కార్యక్రమాల నిర్వహణ తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. జేసీ నిధి మీనా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్డీవో కె.చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శిరోమణి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి కలిసిరండి..

కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమంలో హోటళ్ల యజమానులు కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నగరంలోని వివిధ హోటళ్ల యజమానులు, అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేలా జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకొంటున్నామని, ప్రత్యేక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామన్నారు. జిల్లాలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. ప్రత్యేక ప్యాకేజీతో ట్యాక్సీ, వాహన యజమానులతో పాటు ఆతిథ్యరంగ అభివృద్ధికీ అవకాశముంటుందన్నారు. దీనికోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్టు కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్‌వీ స్వామి, వి.రాఘవేంద్ర, హోటల్ ఐలాపురం ప్రతినిధి రాజా, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గా భక్తి ఛానల్ ప్రారంభం

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానం నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభానికి ముందు ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అశేష భక్తకోటికి కొంగుబంగారం కనకదుర్గమ్మ మహిమలు ఎందరికో అనుభవైకవేద్యమే. దుర్గమ్మ మహిషాసుర సంహారం అనంతరం అదే రూపంలో ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా ఉన్నారని ప్రతీతి. ఈ క్రమంలో అమ్మవారి విశేషాలను ప్రతినిత్యం భక్తజనులకు తెలియపరచటం కోసం ఇప్పటికే పలు ప్రచార మార్గాలు ఉన్నప్పటికీ దేవస్థానం తాజాగా హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ మీడియా సంస్థ సహాయ సహకారాలతో 'కనకదుర్గా భక్తి ఛానల్'ను ప్రారంభిస్తోంది. శుక్రవారం దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఛానల్‌ను ప్రారంభించనున్నారు. కమిషనర్ సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణ చేయనున్నారు.

ఒక్క బిడ్‌తో.. కట్టబెట్టేశారు!

సామూహిక రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)లో భాగంగా ఆకుమర్రు రిజర్వాయర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కోసం పిలిచిన టెండర్లు అవినీతి కంపు కొడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే ఓఅండ్ఎం స్కీములనూ అవినీతి అధికారులు తమకు భోజ్యంగా ఉపయోగించుకుంటున్నారు. సింగిల్ టెండర్ పడినా.. అర్హతలు లేవని తెలిసినా.. నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టేశారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున చేతులు మారాయన్న తీవ్ర ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి.


ఆకుమర్రు రిజర్వాయర్

సీపీడబ్ల్యూఎస్‌లో ఆకుమర్రు రిజర్వాయర్ ఓ అండ్ ఎంకు టెండర్లు!

» అర్హతలు లేకున్నా కొనసాగింపునకు నిర్ణయం
» భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలు
» టెండర్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి ఫిర్యాదు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) నేతృత్వంలో మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని ఆకుమర్రు రిజర్వాయర్ ఓఅండ్ఎం కోసం పిలిచిన టెండర్లలో ఒకే ఒక్క టెండర్ పడింది. అదికూడా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ దానినే కొనసాగించేలా నిర్ణయం తీసుకోవటం వెనుక భారీ ఎత్తున చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● విజయవాడలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంతో పాటు, మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులకు భారీగా చేతులు తడపటం వల్ల నిబంధనలకు విరుద్ధమైనా టెండర్ కట్టబెట్టేశారని తెలుస్తోంది. గతంలో వైసీపీలో క్రియాశీలకంగా ఉన్న వ్యక్తికి టెండర్‌ను కట్టబెట్టడం ఇంకా విమర్శలకు తావిస్తోంది. ఈ టెండర్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై ఆయన విచారణకు ఆదేశించాల్సి ఉంది.

● మచిలీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని ఆకుమర్రు గ్రామంతో పాటు మరో 52 హ్యాబిటేషన్స్‌కు రక్షిత మంచి నీటిని అందించేందుకు స్థానిక రిజర్వాయర్ నిర్వహణ కోసం ఈ నెలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెండర్లు పిలిచారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఆఖరు వరకు ఏడాది కాలానికి టెండర్లు పిలుస్తారు. సవరించిన అంచనాల ప్రకారం ఏడాదికి రూ.1.99 కోట్లు విలువతో ఈ టెండర్‌ను పిలవాల్సి ఉండగా.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మూడునెలల కాలానికి అంటే మార్చి వరకు నిర్వహణకు గాను రూ.60 లక్షలకు టెండర్లు పిలిచారు. మార్చి తర్వాత తిరిగి జడ్పీ అప్రూవల్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అమలవుతున్న ఓఅండ్ఎం స్కీమ్‌లను పరిశీలిస్తే.. మళ్లీ డిసెంబరులో తప్పితే సాధారణంగా జడ్పీ అనుమతులు ఇవ్వటం లేదు. అప్పటి వరకు ఉన్న సంస్థలనే కొనసాగించే పరిస్థితి. అంటే ప్రస్తుతం మూడు నెలలకు పిలిస్తే.. అనుకోకుండా అదే కాంట్రాక్టర్‌ను మరికొంత కాలం కొనసాగిస్తారు.



వైసీపీ వీర విధేయుడికే టెండర్

గతంలో వైసీపీ వీరవిధేయుడిగా ఉన్న ఓ కాంట్రాక్టర్ ఈ ఓఅండ్ఎం కోసం టెండరు వేయగా ఆ ఒక్క టెండర్ మాత్రమే పడింది. సహజంగా సింగిల్ టెండర్ పడితే.. దానిని రద్దుచేసి పోటీ పెంచటానికి మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈపని చేయలేదు. దీంతో పాటు టెండరు నిబంధనల ప్రకారం అనుభవం లేకున్నా కట్టబెట్టడం విశేషం.

నిబంధనలు బేఖాతరు

టెండరు నిబంధనల ప్రకారం ఆకుమర్రు రిజర్వాయర్ ఓఅండ్ఎం కోసం 3,74,821.13 కేఎల్ పరిమాణాన్ని నిర్వహించగలిగిన అనుభవం ఉండాలి. కానీ టెండరు వేసిన వైసీపీ వీరవిధేయుడికి 3,28,258.44 కేఎల్ పరిమాణం నిర్వహణ చేపట్టగలిగిన అనుభవం మాత్రమే ఉంది. కాబట్టి వెంటనే టెండర్‌ను రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలి. కానీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏకంగా టెండర్‌ను కట్టబెట్టేశారు.

కొందరు అవినీతి అధికారుల హస్తం!

విజయవాడలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలోని కొందరు అధికారుల హస్తంతో టెండర్‌ను ఆమోదించినట్టుగా తెలుస్తోంది. భారీఎత్తున చేతులు మారటం వల్లనే ఈ టెండర్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి టెండర్లలో పోటీ ఉంటే.. ఆకుమర్రు ఓ అండ్ఎం నిర్వహణకు 50 శాతం వరకు లెస్ టెండర్లు పడి ఉండేవి. ఎవరినీ ఈ టెండర్లలో పాల్గొనకుండా అధికారులు మేనేజ్ చేశారన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ పడినా అదే కాంట్రాక్టర్‌తో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అగ్రిమెంట్ చేసుకోవటం గమనార్హం.

చివరి గింజ కొనేవరకు అప్రమత్తం

» రైతులను చేయిపట్టి నడిపించండి
» ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలి
» నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంగా పనిచేయండి
» సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో జేసీ నిధి మీనా, ఆర్డీవో తదితరులు

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి రైతు సేవాకేంద్రాల పరిధిలో ఇప్పటివరకు రూ.178.39 కోట్ల విలువైన 77,440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 11,730 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చివరిగింజ కొనుగోలు వరకు అత్యంత అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ పౌర సరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్, సహకార తదితరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, రైతుల ఖాతాల్లో జమచేసిన సొమ్ము, గోనెసంచుల అందుబాటు, మిల్లులకు ధాన్యం రవాణా, వర్షాల నేపథ్యంలో తీసుకున్న ప్రత్యేక చర్యలు తదితరాలపై చర్చించారు. ఏ ఒక్క రైతుకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు హితమే లక్ష్యంగా సమన్వయ శాఖల అధికారులు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందించాలని స్పష్టం చేశారు. కోతలు చివరి దశలో ఉన్నందున ఆయా రైతులతో క్షేత్రస్థాయిలో మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొంటూ పనిచేయాలన్నారు. తేమశాతం, మద్దతు ధర, గన్నీలు, రవాణా సౌకర్యం ప్రతి అంశాన్ని క్షుణంగా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి వీఐఆర్ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకొంటోందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంతృప్తి విషయంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని అందుబాటులో ఉన్న టార్పాలిన్ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పక్కదారి పడితే సహించేది లేదు..

ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించి ఒక్క బియ్యపు గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని, పేదల బియ్యం పక్కదారి పట్టకుండా క్షేత్రస్థాయి అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కస్టమ్ మిల్లెడ్ రైస్ (సీఎంఆర్) కలర్ పరీక్షలపై దృష్టిసారించాలని, పరీక్ష ఫలితాలను డాక్యుమెంట్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు మిల్లులు, పీడీఎస్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీచేసి, నివేదికలు సమర్పించాలన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై కేసుల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆహార భద్రత కల్పించడంలో అత్యంత కీలకమైన పౌర సరఫరాల వ్యవస్థలో ఏ చిన్న అవకతవకలకు ఆస్కారం లేకుండా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.శ్రీనివాస్, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి ఎం.స్వప్న, జిల్లా కో-ఆర్డినేటర్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, మార్కెటింగ్ ఏడీ కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం నిల్వలపై పటిష్ట నిఘా

» బఫర్ గోదాముకు ఇన్‌చార్జిగా డిప్యూటీ తహసీల్దార్

కృష్ణలంక : పేదల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా అమలవుతున్న పీడీఎస్ బియ్యంలో ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించేదిలేదని, పేదల బియ్యం దారిమళ్లకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అవకతవకలకు చెక్ పెట్టేందుకు సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యుసీ) బఫర్ గోదాముకు డిప్యూటీ తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించేందుకు ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రూరల్ మండలం, పూడూరుపాడులో గల


గోదాములో బియ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రైతు సేవా కేంద్రం అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం తేమశాతం నమోదు ప్రక్రియను పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడారు. రాయనపాడులోని సీడబ్ల్యూసీ గోదామును పరిశీలించారు. కస్టమ్ మిల్లోడ్ రైస్ (సీఎంఆర్)లో పీడీఎస్ బియ్యం కలిశాయా? నిర్దేశ ప్రమాణాల ప్రకారమే మిల్లులు సీఎంఆర్ కింద బియ్యం ఇస్తున్నాయా లేదా? అనేదానిని నిర్ధారించేలా పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు తదితరులు వున్నారు.

పక్కా ప్లాన్‌తో..

(5వ పేజీ తరువాయి)

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం నులకపేటలో లక్షలాది రూపాయలతో స్థలాలు కొనుగోలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

● 37వ డివిజన్ పూలబావి వీధిలో 2021లో ఓ వ్యాపారి సుమారు 200 గజాల్లో గ్రౌండ్ ప్లస్ టూ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత అనధికారికంగా మరో అంతస్థు నిర్మించారు. ఈ డివిజన్ వార్డు ప్లానర్‌గా పనిచేసిన ఉద్యోగి ఆ భవన యజమానిని బెదిరించి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భవనానికి గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపులు నిర్మించారు. వార్డు ప్లానర్ రివైజ్డ్ ప్లాన్ పెట్టి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షాపులను పార్కింగ్ ప్రదేశంగా చూపించడం గమనార్హం.

● దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ పాఠశాల వెనుక ఉన్న వీధిలో ఓ వ్యాపారి నిబంధనలకు వ్యతిరేకంగా భారీ భవన నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు రెండు నెలల క్రితం అక్రమంగా నిర్మించిన శ్లాబ్‌కు బెజ్జాలు వేసి పనులు నిలిపివేశారు. అయితే గతంలో ఈ డివిజన్‌లో పనిచేసిన ప్లానింగ్ సెక్రటరీ బిల్డింగ్ యజమాని నుంచి డబ్బు వసూలు చేసి శ్లాబ్ బెజ్జాలను పూడ్చివేసుకోవడానికి అనుమతి ఇప్పించారు.

● 53వ డివిజన్ డ్రెయిన్ వీధిలో ఓ వ్యాపారి సుమారు 200 గజాల ఖాళీ స్థలంలో జీప్లస్‌టూ భవన నిర్మాణం చేపట్టారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్‌లో షట్టర్లు ఏర్పాటుచేసి షాపులు నిర్మించాడు. ఈ వ్యవహారంలో స్థానిక వార్డు ప్లానింగ్ సెక్రటరీ బిల్డింగ్ ఓనర్ నుంచి సుమారు రూ.5 లక్షలు వసూలు చేసినట్లు విమర్శలున్నాయి.

అంతర్జాతీయ చెస్ క్రీడాకారులకు సత్కారం



రేటెడ్ ప్లేయర్స్‌తో గ్లోబల్ చెస్ అకాడమీ కోచ్, అతిథులు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నవీన క్రీడా ఉత్సావ్‌లో భాగంగా ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ టోర్నీలో గ్లోబల్ చెస్ అకాడమీ ప్లేయర్స్ రేటింగ్ సాధించారు. ఈ సందర్భంగా వారిని గురువారం ఘనంగా సత్కరించారు. క్లాసిక్‌లో మహీధర్ 1517, ర్యాపిడ్‌లో 1540, బ్లిజ్‌లో 1433తోను, అర్షద్‌బాబా రాపిడ్‌లో 1515, బ్లిజ్‌లో 1492, గీత శ్రీకృష్ణ చైతన్యకు ర్యాపిడ్‌లో 1461, షేక్ నబీహాకు రాపిడ్‌లో 1458, దుల్కర్ అహ్మద్‌ఖాన్‌కు బ్లిజ్‌లో 1505, చరణ్ సోమేశ్వర్‌కు బ్లిజ్‌లో 1505, అక్షర మాచర్లకు 1437 స్టాండర్డ్‌లో సాధించారు. అభినందన కార్యక్రమంలో గ్లోబల్ చెస్ అకాడమీ చెస్ కోచ్ షేక్ ఖాసీమ్, ఐకాన్ పబ్లిక్ స్కూల్ అకాడమి డైరెక్టర్ కె.రాజేంద్ర, ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

శిరసావహించాల్సిందే..

(5వ పేజీ తరువాయి)

కొద్దిరోజులుగా రోజుకు 1,000 దాటి కేసులు నమోదవుతున్నాయి. జరిమానాలు రూ.లక్షల్లో చెల్లిస్తున్నారు. మార్పు రావాలంటే వాహనాలను సీజ్ చేయడమే మార్గమని పోలీసులు భావించారు. అయినా మార్పు రాకపోతే లైసెన్సులవైపు చూడాలని భావిస్తున్నట్టు సమాచారం. మూడు చలానాలకు మించి ఉంటే డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయించాలని చూస్తున్నారు. ఈ మేరకు రవాణా శాఖాధికారికి లేఖ రాయనున్నారు.

మూడు నెలల్లోపు చలానా చెల్లించాల్సిందే..

- ఏవీఎల్ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

ఒకసారి ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించాక దాన్ని మూడు నెలల్లోపు చెల్లించాలి. లేనిపక్షంలో కచ్చితంగా వాహనాన్ని సీజ్ చేస్తాం. మేం ఇంతకుముందు జరిమానాలు విధించినా ఇప్పటి వరకు చెల్లించని వాహనాలున్నాయి. వాహనాదారులు మాకు ఇంకా సమయం ఉందని సమాధానం చెబుతున్నారు. ఇది సరికాదు. మేం విధించిన చలానాను 90 రోజుల్లో చెల్లించకపోయినా, ఈలోపు కొత్త జరిమానాలు విధించినా కచ్చితంగా వాహనాన్ని సీజ్ చేస్తాం.


చంద్రయ్య కాలువపై కూలిపోయిన వంతెన

కుప్ప కూలిన వంతెన!

» 10 గ్రామాలకు రాకపోకలు బంద్
» అధికారుల నిర్లక్ష్యమే అంటున్న గ్రామస్థులు


ఇరుక్కుపోయిన ట్రాక్టర్ ట్రక్కు

పెదపారుపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈదులమద్దాలి శివారులోని చంద్రయ్య కాలువపై వంతెన గురువారం కూలిపోయింది. దీంతో పెదపారుపూడి నుంచి యలమర్రు మీదుగా విజయవాడ వెళ్లే మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో వంతెనపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అందులో ఇరుక్కుపోయింది. గత రెండేళ్లుగా వంతెన దుస్థితిపై ప్రజలు ఆందోళన చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించారని, కేవలం వారి నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి వచ్చిందని వాహనదారులు వాపోతున్నారు.

గుడివాడ-కంకిపాడు రహదారి అధ్వానంగా ఉండటంతో విజయవాడకు ప్రయాణికులు ఈ మార్గంలోనే వెళుతుంటారు. చుట్టుపక్కల సుమారు 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు ఈ మార్గం ద్వారానే గుడివాడకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రైతులకు సైతం ప్రధాన రహదారిగా ఉంది. వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో పలువురు రైతులు ఏడాది క్రితం నాలుగు చక్రాల వాహనాలు రాకుండా మట్టి దిబ్బలను పోసి ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా జాగ్రత్తలు చేపట్టారు. కాలక్రమేణా మట్టి కరిగిపోగా చివరకు వంతెన కూలిపోయింది. అధికారులు స్పందించి రాకపోకలకు మార్గం ఏర్పాటు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వంతెన కూలిన విషయాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లినట్టు ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే గతంలోనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, రూ.1.50 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆర్ అండ్ బీ అధికారులు కూలిన వంతెనను పరిశీలించినట్టు ఆమె తెలిపారు.

ఎనిమిదో రోజుకు చేరిన లయోలా వాకర్స్ నిరసన

భారతీనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం మొండివైఖరిని వ్యతిరేకిస్తూ, కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ సభ్యులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారంతో ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఉదయం లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆంధ్రా లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ శాంతియుత నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవానీ దీక్ష విరమణలు విజయవంతం

నగర కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు సేవలు అందించి దీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను, సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం అభినందించారు. వీఎంసి అధికారులు, సిబ్బంది సక్రమంగా పనులు నిర్విరామంగా నిర్వహిస్తూ భవానీ దీక్ష విరమణలు విజయవంతం చేశారని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కోన్నారు. వివిధ శాఖల సమన్వయంతో భవానీ దీక్ష విరమణలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. నగరపాలక సంస్థ డ్రోన్లతో ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణ చేశారని, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి అధికారులు పర్యవేక్షించి సిబ్బందిని వైర్లెస్ సెట్‌లో అప్రమత్తం చేసి పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చేశారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు పది లక్షల వాటర్ బాటిల్‌లను, 6లక్షల 50 వేల వాటర్ ప్యాకెట్లను భవానీలకు పంపిణీ చేశారని, 200తాత్కాలిక మరుగుదొడ్లను 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, వాటిని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుందన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది నిత్యం భవానీ భక్తులకు తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్వహణలో ఎటువంటి అంతరాయం తలెత్తకుండా 24గంటలు పని చేశారని తెలిపారు. 1400 మంది పారిశుధ్య కార్మికులు అహర్నిశలు శ్రమించారని, వారిని 104 మంది శానిటరీ అధికారులు, మేస్రీలు పర్యవేక్షించారని, కన్వేయర్ బెల్ట్ సాయంతో భవానీ దుస్తులను తీసివేయటమే కాకుండా వాటిని ఎక్సల్ ప్లాంట్‌కు తరలించారని తెలిపారు. భవాని భక్తుల కోసం ఉచితంగా ఆరు సామాన్లు, చెప్పులు భద్రపరచు క్లోక్ రూములను ఏర్పాటు చేయడమే కాకుండా షైకుల ద్వారా అవి ఎక్కడెక్కడ ఉన్నాయో, వాటికి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలియపరిచారని తెలిపారు. వెటర్నరీ, మలేరియా విభాగం నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాగింగ్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. భవానీ దీక్ష విరమణలు ఈ నెల 21 నుంచి 25 వరకు ఉన్నప్పటికీ ఒకరోజు ముందు, తర్వాత కూడా నగరపాలక సంస్థ విధులు నిర్వహిస్తూ విరమణలు విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేశారని తెలిపారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వీఎంసీ చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



కన్వేయర్ బెల్ట్ సాయంతో భవానీల దుస్తులు తరలిస్తున్న, స్ప్రే చేస్తున్న సిబ్బంది

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



● లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డులో కార్వే కార్యాలయం వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఎవరూ ఈ సమస్యను పరిష్కరించడం లేదు.

బావనారాయణ, తుర్లపాటి కుటుంబరావు వీధి, లబ్బీపేట

● ప్రతిరోజూఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం తమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. బందరు రోడ్డు ప్రధాన ప్రాంతం కావడంతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది.

- రవికుమార్, సీఐ 5వ ట్రాఫిక్

నిరుపయోగంగా ఉన్న బళ్లు తొలగింపు



వాటర్ ట్యాంక్ వద్ద నిరుపయోగంగా ఉన్న బళ్లను తొలగిస్తున్న సిబ్బంది

రాణిగారితోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న చిరు వ్యాపారుల బండ్లను టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారుల గురువారం తొలగించారు. ఫీడర్ రోడ్డులో స్క్యూ బ్రిడ్జి నుంచి శ్మశానం వరకు చిరువ్యాపారాల కోసం అనేక మంది బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వీటిలో చాలా వరకు ఖాళీ ఉండడంతో అక్కడ వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో అనేక ఫిర్యాదుల రావడంతో ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం నుంచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిరుపయోగంగా ఉన్న బండ్లను తొలగించారు. ఇకపై ఈ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని, వ్యాపారాలు చేయకుండా అడ్డదిడ్డంగా తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, బల్లలు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కొంతమంది అద్దెకు ఇస్తున్నట్లు తెలిసిందని అటువంటి వారిపై చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు.

ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరింపులు

ఫీడర్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు వచ్చిన సిబ్బంది పై సంబంధిత వ్యక్తులు ఎమ్మెల్యేతో పాటు స్థానిక చోటా మోటా నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల విషయంలో రాజకీయ నాయకులు ప్రోత్సహించవద్దని వారు కోరుతున్నారు. రోజురోజుకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరుగుతున్నాయని, దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆక్రమణలు ప్రోత్సహించవద్దని కోరుతున్నారు.

24మందికి కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న కోల్ ఇడియా, స్మార్ట్ ఆంధ్ర రోటరీ ప్రతినిధులు

పటమట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోల్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో స్మార్ట్ ఆంధ్ర పర్యవేక్షణలో రోటరీక్లబ్-3020 ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ సమీపంలో వాసవ్యమహిళా మండలి సమావేశ మందిరంలో గురువారం రూ.7.20లక్షలు విలువైన 24 కుట్టు మిషన్‌లను మహిళా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ -3020 జిల్లా మాజీ గవర్నర్ ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం రోటరీ క్లబ్ విద్యా వైద్యరంగాలతో పాటు ప్రతి కుటుంబంలోని మహిళ ఆర్థికంగా నిలబడటం ద్వారా వారి కుటుంబాల్లోని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేలా ప్రయత్నిస్తోందన్నారు. రోటరీ క్లబ్ ప్రోగ్రామ్ చైర్మన్ రావూరి సుబ్బారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె శివశంకరరావు, క్లబ్ అధ్యక్షుడు వై శేషుకుమార్, ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్ మలపాక భాస్కర్, బాయన సునీత, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయం



కాకాని విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న శోభానాద్రీశ్వరరావు, తరుణ్

పటమట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలో విద్య, వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగం అభివృద్ధిలో కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్ర ఉద్యమ సారథి, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పోరాటాలు చేసిన కాకాని వెంకటరత్నం వర్ధంతి సభ బుధవారం బెంజిసర్కిల్‌లో కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ మంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవిలు మాట్లాడుతూ బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకానీ, మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్నబోస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్(న్యూఢిల్లీ)చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు, గోగినేని ధనశేఖర్, కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం సంస్కర్తలు మోతుకూరి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కోడే బాబూరావు, కోనేరు బసవేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణలు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్‌లో క్రిప్టోగ్రఫీ ప్రాముఖ్యతపై సెమినార్

మొగల్రాజపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డేటా సైన్స్, ఏఐ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్‌లో క్రిప్టోగ్రఫీ ప్రాధాన్యత అనే అంశంపై గురువారం సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న విట్ (వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ , ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ స్కూల్)ప్రొఫెసర్ డాక్టర్ చెరుకూరి అశ్వనీ కుమార్ మాట్లాడుతూ క్రిప్టోగ్రఫీ మెషిన్ లెర్నింగ్ అనుసంధానంతో సెక్యూరిటీ, డేటా ప్రొటెక్షన్ ఎలా చేయాలో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూ రావులు మాట్లాడుతూ సాంకేతిక సెమినా ర్‌లలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు, డాక్టర్ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీ మహిళల ఖోఖో జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు క్రీడాకారులతో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన

లబ్బీపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో పాల్గొనే కృష్ణా యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. జట్టులో 15 మంది క్రీడాకారులతో పాటు జట్టు మేనేజర్ అండ్ కోచ్‌గా డా.ఎస్.హేమను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జట్టుకు ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కళాశాల కన్వీనర్ లలితా ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి అభినందనలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాశక్తినగర్ శాఖలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో దీపక్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, సంధ్య కంటి వైద్యశాల, రోహన్ డెంటల్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యులు వైద్య సేవలందిస్తారని, ఈవైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా సీపీఐ పతాక ఆవిష్కరణలు

● శత వార్షికోత్సవ సంబరాలు



9వ డివిజన్‌లో పతకావిష్కరణలో సీపీఐ నేతలు

పటమట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా పటమట ఏరియాలో 9,14,15,16 డివిజన్లలో పతాక ఆవిష్కరణలు ఘనంగా నిర్వ హించామని సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు చెప్పారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చే స్తున్న ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేఆర్ ఆంజనేయులు, నగర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి సూరిబాబు, డివిజన్ కార్యదర్శి లంక ప్రసాద్, సైకం రాము, అన్నే జగన్నాథరావు, శీలం భుజేంద్రనాథ్, లహరి, కనకరావు, చవాకుల సాయి, సోమినాయుడు, లంక శ్రీవికాస్, బసవేశ్వరరావు, కొప్పూరి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి



బెజవాడ బార్ అసోసియేషన్‌లో

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక 20వ డివిజన్‌లోని కల్పన ప్రింట్స్ రోడ్డు సెంటర్‌లో రాధా రంగా మిత్రమండలి నాయకులు కొండే శ్రీను, సాదిఖ్‌లు వంగవీటి రంగా 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాయుడు, పోతిరెడ్డి రమణ, పంచకర్ల హరిబాబు, ఆరెళ్ల శ్రీనివాసరావు, మహ్మద్ గౌస్, కొండేటి వెంకట్రావ్ పాల్గొన్నారు.

● నల్లగేటు సెంటర్‌లో రాధా రంగా మిత్రమండలి నాయకులు కొప్పుల వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అడపా శేషు రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● బెజవాడ బార్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ముందుగా బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాం ప్రసాద్ (రాజా) రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్: స్క్యూ బ్రిడ్జి దగ్గర ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ జనసేన అధ్యక్షులు గాదిరెడ్డి అమ్ములు, పెనేరు దామోదరరావు, సుబ్రహ్మణ్యం, చిన్నం ఈశ్వరరావు, పాల్గొన్నారు.



రింగురోడ్డులో సర్వదర్శన క్యూలైన్

సర్వదర్శనానికి 20 గంటలు

» తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి ఆలయం పరిసరాలతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్నప్రసాదం, బస్టాండ్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగురోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 20 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు ఉన్నవారికి కూడా దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పడుతోంది.

ఇళ్లపై సోలార్ యూనిట్లను ప్రోత్సహించాలి

» 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'పై అవగాహన కల్పించాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌లకు ప్రధాని మోదీ ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇళ్లపై సొంత సోలార్ యూనిట్ పెట్టుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాలకు సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పేరుతో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పథకాన్ని ఇందుకు ఉపయోగించుకోవాలని కోరారు. గురువారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రూ.75,021 కోట్ల వ్యయంతో 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మోదీ వివరించారు. ఈ పథకం కింద డిస్కమ్‌లు తమ ప్రాంతాల్లో రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం కింద రెండు కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్ ధరలో 60 శాతం, మూడు కిలోవాట్ సామర్థ్యం కలిగిన యూనిట్ ధరలో 40 శాతం రాయితీని పొందవచ్చు. సోలార్ ప్యానెళ్లను అమర్చుకునే అవకాశం ఉన్న ఇల్లు ఉన్నవారందరూ ఈ పథకం ద్వారా ప్రయోజనాన్ని అందుకోవచ్చు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొనగా, అమరావతి సచివాలయం నుంచి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరి నిర్ణయం సరికాదు

» చింతకాయల విజయ్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించడానికి పనిచేసిన వారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆ అభ్యర్థులకు తెలియకుండా పార్టీలోకి ఆహ్వానించడం సరైంది కాదని స్పీకర్ అయ్యన్న పాత్రుడు కుమారుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. 'నర్సీపట్నంలో కూటమి అభ్యర్థిని ఓడించడానికి పనిచేసిన వైసీపీ నేతలను ఆ అభ్యర్థికి కనీసం తెలియపర్చకుండా కండువాలు కప్పి పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారు? పురందేశ్వరి రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యురాలిగా పోటీ చేసి గెలిచారు. తన ఓటమికి పనిచేసిన వైసీపీ నేతలను మేం ఆమెకు తెలియకుండా మా పార్టీలోకి ఆహ్వానిస్తే ఆమె మనోభావాలు ఎలా ఉంటాయి? ఆమె ఒకసారి ఆలోచించుకోవాలి. ఒక కూటమిగా ఉన్నప్పుడు ఇలాంటి విషయాల్లో పరస్పర గౌరవం, సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం అత్యంత అవసరం. ఇటీవల జరిగింది మంచి సంప్రదాయం కాదు' అని విజయ్ వ్యాఖ్యానించారు.

పర్యాటక రంగాన్ని పీఎస్ఎల్ కింద చేర్చాలి

» ఆర్బీఐకి రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య లేఖ

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని ప్రయారిటీ సెక్టార్ లెండింగ్ (పీఎస్ఎల్) కింద చేర్చాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ ఛాంబర్స్) భారత రిజర్వ్ బ్యాంకును అభ్యర్థించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు లేఖ రాశారు. పీఎస్ఎల్ ఫ్రేమ్‌వర్క్ కింద పర్యాటకానికి ప్రాధాన్యమివ్వడం వల్ల పెట్టుబడులు పెరిగి ఆర్థిక వృద్ధితో పాటు విస్తృతమైన విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని పేర్కొన్నారు. రవాణా, ఆతిథ్యం, రిటైల్ తదితర అనుబంధ రంగాలలో వృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

'మైనార్టీ' నిర్మాణాలకు 26 కోట్లు: మంత్రి ఫరూక్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన్ వికాస్ పథకం(పీఎంజేవీకే) నిధులను సద్వినియోగ పరచుకుని మైనార్టీ సంస్థల నిర్మాణాల కోసం తొలివిడతగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.26.13 కోట్లను విడుదల చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పీఎంజేవీకే పథకం అమలు అవుతోంది. దీనికింద రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం వివిధ నిర్మాణాలకు రూపకల్పన చేశాం. మైనార్టీల విద్యాభివృద్ధి కోసం బాల, బాలికలకు జూనియర్ కళాశాలల ఏర్పాటు, సంక్షేమ హాస్టళ్లు, కమ్యూనిటీ హాల్స్ తదితర నిర్మాణాలను చేపట్టనున్నాం. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీలు దగాకు గురయ్యారు. ఏ ఒక్క సంక్షేమ పథకానికీ నోచుకోలేదు' అని మంత్రి ఫరూక్ విమర్శించారు.

గుంటుపల్లిలో చోరీకి యత్నం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంట్‌లో చోరీకి యత్నించిన నిందితులను గ్రామ స్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందిగామ రమణ కాలనీకి చెందిన ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు చెత్త పేపర్లు ఏరుకునేందుకు ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలోని కాజీపేట వద్దకు గురువారం వచ్చారు. వీరిలో గంధసిరి నాగరాజు అనే వ్యక్తి అపార్ట్‌మెంట్ బయట ఉన్న స్టోర్ రూమ్‌లో ఉన్న విలువైన స్క్రాబ్‌ను చోరీ చేస్తుండగా గుర్తించిన గ్రామస్తులు అతడ్ని పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనితో పాటు వచ్చిన మరో నలుగుర్ని కూడా పోలీసులు స్టేషన్‌లో ఉంచి విచారణ చేస్తున్నారు.

30, 31, జనవరి 2న దుర్గమ్మ కానుకల లెక్కింపు

వన్‌టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 30, 31, జనవరి 2వ తేదీన హుండీ కానుకల లెక్కింపు జరపనున్నట్లు ఈవో కె.ఎస్.రామారావు గురువారం తెలిపారు. హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మహా మండపంలోని 6వ అంతస్థులో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు అనుమతి తీసుకుని లెక్కింపునకు రావాల్సి ఉంటుందని తెలిపారు.

ధర్నాలు తాత్కాలిక వాయిదా: ఏపీటీఎఫ్

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు, ఆర్థిక బకాయిల పెండింగ్ అంశాలపై శుక్ర, శనివారాల్లో జిల్లా కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన ధర్నాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఏపీటీఎఫ్-1938 తెలిపింది. ఇటీవల మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన సమావేశంలో విద్యా రంగ సమస్యలు పరిష్కరిస్తామని, ఆర్థిక బకాయిలపై రూట్‌మ్యాప్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని అడిగారని ఈ నేపథ్యంలో గతంలో ప్రకటించిన ఈ ధర్నాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామన్నారు.

విజయవాడ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్తున్న బస్సులు ఆగేది అక్కడే. ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు వచ్చే బస్సులు మలుపు తిరిగేది ఇక్కడే. జాతీయ రహదారికి ఇవతలి వైపు నుంచి అవతలి వైపునకు తిరిగే మలుపూ ఇదే. ఒకే వైపునకు మూడు విభిన్న పరిస్థితులు ఉన్న ప్రదేశమది. అదే వారధికి దిగువన ఉన్న ధర్మచక్రం కూడలి. విజయవాడలో ఇబ్రహీంపట్నం తర్వాత అతిపెద్ద కూడలి ఇదే. ఇక్కడంతా గందరగోళమే. వచ్చేపోయే బస్సులను ఎక్కడ ఆపాలన్న దానిపై ఒక స్పష్టత లేకపోవడం, సరిగ్గా మలుపుల వద్దే బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయడం, మలుపుల వరకు ఐలాండ్‌లు ఉండడంతో ఇక్కడ పరిస్థితి అంతా తికమకగా, ప్రమాదకరంగా ఉంటుంది. దీనికి పరిష్కారం చూపించడానికి కొత్త ప్రతిపాదనలను ట్రాఫిక్ పోలీసులు సిద్ధం చేస్తున్నారు.

ట్రాఫిక్ చక్ర వ్యూహం

- వారధి 'ధర్మచక్రం' వద్ద మూడు మలుపులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- గుంటూరు వైపు బస్టాండ్ మార్పుపై సమాలోచనలు



విజయవాడలోని వారధి 'ధర్మచక్రం' వద్ద ట్రాఫిక్ రద్దీ



గుంటూరు వైపు ఉన్న బస్ షెల్టర్

● బందరు కాల్వ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బస్‌బే ఏర్పాటు ● ఇరిగేషన్, ఆర్టీసీ, వీఎంసీ సమన్వయమే ముఖ్యఘట్టం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లే బస్సులు కృష్ణలంక ఆర్వోబీపై నుంచి వచ్చి వారధికి దిగువ ఉన్న ఐలాండ్ కూడలి వద్ద మలుపు తీసుకుని గుంటూరు వైపు రహదారిపైకి ప్రవేశిస్తాయి. ఆర్టీసీ అధికారులు సరిగ్గా ఈ ప్రదేశంలోనే బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లాల్సి ప్రయాణికులు ఇక్కడ వేచి ఉంటున్నారు. మొత్తం ఇక్కడ మూడు మలుపులు ఉన్నాయి. రాణిగారితోట వైపు నుంచి పశువుల ఆస్పత్రి వీధిలోకి వెళ్లాల్సిన వాహనదారులు వారధి కింద మొదటి మలుపులోకి తిరగాల్సి ఉంటుంది. రెండో మలుపు నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాల వైపు వెళ్లే బస్సులు వస్తాయి. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి పీఎన్‌బీఎస్‌కు వచ్చే బస్సులు మూడో మలుపు నుంచి వెళ్తాయి. పీఎన్‌బీఎస్ నుంచి గుంటూరు, ప్రకాశం జిల్లాకు వెళ్లే బస్సులను ఇక్కడ ఉన్న స్టాప్ వద్ద ఆపుతున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు, ఆటోలే కాకుండా కొన్ని లారీలు, ఇతర కంటైనర్లు రావడంతో మొత్తం రహదారి స్తంభించిపోతోంది. ఫలితంగా మొదటి మలుపు నుంచి పశువుల ఆస్పత్రి రోడ్డులోకి వెళ్లాల్సిన వాహనదారులు రూటు తప్పుతున్నారు. వారధికి అందాలను అద్దడానికి ఇక్కడ విశాల ప్రదేశంలో భారీ ఐలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు మలుపులను వేరు చేసేలా ఐలాండ్ నిర్మించారు. దీనివల్ల ఈ కూడలిలో ఉన్న రహదారులు ఇరుకుగా మారాయి. ఏకకాలంలో రెండు బస్సులు పక్కపక్కన వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది.

ఇలా చేస్తే మేలు..

జాతీయ రహదారి వెంబడి నగరం మధ్య నుంచి బందరు కాల్వ ప్రవహిస్తోంది. దీనికి పక్కనే ఖాళీ స్థలం ఉంది. ఈ ప్రదేశాన్ని జనం డంపింగ్ యార్డుగా మార్చకుండా చేసేందుకు జాతీయ రహదారి పొడవున వీఎంసీ ప్రహరీని నిర్మించింది. ఐలాండ్ ఎదురుగా ఈ ప్రహరీ చెంతన ఆటోస్టాండ్ నడుస్తోంది. ఇక్కడ విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు, మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ వైపు వెళ్లాల్సిన బస్సులు ఆగుతున్నాయి. బందరు కాల్వ వెంబడి ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆక్రమణలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో వీఎంసీ కర్మల భవనాలను నిర్మించింది. ఇవి కాకుండా ప్రార్థనా మందిరాలు, ఆలయాలు ఒక్కో ప్రదేశంలో వెలిశాయి. నగరం నుంచి ప్రవహించే కాల్వల్లో జలవనరుల శాఖ పూడికతీత చేసిన దాఖలు ఇప్పటి వరకు కనిపించలేదు. కొన్ని ప్రదేశాల్లో మాత్రం వీఎంసీ సుందరీకరణ కోసం పార్కులు అభివృద్ధి చేసింది. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతోంది. ధర్మచక్రం ఎదురుగా ప్రహరీకి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో భారీ బస్‌బేను నిర్మిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన ట్రాఫిక్ అధికారులకు వచ్చింది. ఈ స్థలం జలవనరుల శాఖ పరిధిలో ఉంది. బాధ్యతలను వీఎంసీ చూస్తోంది. బస్‌బే నిర్మించాల్సిన బాధ్యత ఆర్టీసీది. ట్రాఫిక్ అధికారుల ప్రణాళికలు పట్టాలు ఎక్కాలంటే ఆర్టీసీ, జలవనరుల శాఖ, వీఎంసీ, పోలీసుల శాఖ మధ్య సమన్వయం ఉండాలి.

ప్రతిపాదనలు ఇలా..

- ధర్మచక్రం ఎదురుగా గల ఖాళీ స్థలంలో భారీ బస్‌బేను నిర్మించవచ్చు.
- విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లే బస్సులను ఈ బస్‌బేలో ఆపొచ్చు.
- ప్రస్తుతం ఐల్యాండ్‌కి వెనుక వైపున గుంటూరు మార్గంలో ఉన్న బస్టాప్‌ను ఇక్కడికి మార్చుకోవచ్చు.
- ఈ నిర్ణయం వల్ల ఐల్యాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.
- విశాఖపట్నం, గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులు నేరుగా బస్‌బేలోకి వస్తాయి.
- ఈ బస్సులను ప్రస్తుతం జాతీయ రహదారిపై ఆపుతున్నారు. ఈ బస్సులను బస్‌బేల్లోకి పంపడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బంది ఉండదు.
- గుంటూరు మార్గంలో ఉన్న బస్టాప్ వద్ద రద్దీ చాలా వరకు తగ్గుముఖం పడుతుంది.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు

- బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అత్తులూరి
- అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

లబ్బీపేట, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో పేరుకుపోయిన దాదాపు రూ.2 వేల కోట్ల కాంట్రాక్టర్ల బిల్లులు సకాలంలో చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు అత్తులూరి నాగమల్లేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బందర్ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బీఏఐ 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.800 కోట్ల బకాయిలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంకా రూ.2 వేల కోట్లు వరకు వివిధ శాఖల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్ రెడ్డి, రాష్ట్ర మాజీ చైర్మన్ బి.రాఘవరావు, జాతీయ మాజీ ఉపాధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ అప్రెంటిస్' ధ్రువపత్రాల పరిశీలన షెడ్యూల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల పరిశీలన నిమిత్తం అధికారులు షెడ్యూల్‌ను ప్రకటించారు. నవంబరు 6వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలిస్తామని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ వి.నీలిమ గురువారం తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని డాక్యుమెంట్స్ సరిగా అప్‌లోడ్ చేయని వారు డిసెంబరు 28వ తేదీన ఆర్టీసీ వెబ్‌సైట్‌లో లిస్ట్‌లో పెట్టిన వారు మాత్రమే అదే రోజున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ/స్పోర్ట్స్, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలు ఎవరైనా ఉంటే వారు డిసెంబరు 31వ తేదీన వెరిఫికేషన్‌కు రావాల్సి ఉందని తెలిపారు. మోటార్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, పెయింటర్, మెచినిస్ట్ ట్రేడ్స్‌కు సంబంధించిన వారు జనవరి 2న వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్స్‌కు చెందిన వారు జనవరి 3న, డీజిల్ మెకానిక్ ట్రేడ్స్‌కు చెందిన వారు జనవరి 4, 6 తేదీలలో వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

జనవరి 2, 3, 4 తేదీల్లో రేషన్ షాపులకు ఇంటర్వ్యూలు

కృష్ణలంక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ సర్కిల్ 1,2,3, ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు మండలాల్లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల నియామకంపై ఇంటర్వ్యూలు జనవరి 2,3,4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పై ప్రాంతాలలో రేషన్ దుకాణాల డీలర్ నియామకానికి నిర్వహించు రాత పరీక్ష డిసెంబరు 22న కేబీఎన్ కళాశాలలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్ర, శని వారాల్లో నిర్వహించాల్సి ఇంటర్వ్యూలను 2025 జనవరి 2, 3, 4 తేదీలకు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు పైతెలిపిన తేదీలలో ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

నగ్నదొంగ అరెస్టు

» దుస్తులు లేకుండా చోరీలు

» ఖాళీ స్థలాలకు పక్కన ఉన్న నివాసాలే టార్గెట్

» సీసీఎస్ పోలీసులకు చిక్కిన అంతరాష్ట్ర దొంగ

» రూ.26లక్షల విలువ చేసే బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం



నిందితుడు మోహనరావును మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీస్ అధికారులు

విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగ్నంగా ఇళ్లల్లో చొరబడి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను విజయవాడ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వ రెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావుతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం మీడియాకు వెల్లడించారు.

చిన్నతనం నుంచి దొంగతనాలు

గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన కంచర్ల మోహనరావు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నతనంలోనే దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం మరువాడ గ్రామంలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. గంజాయి, మద్యం తాగడానికి బానిసగా మారాడు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో అక్టోబరు పదో తేదీన ఎంఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోయింది. ఉదయం నిద్ర లేచి చూసే సరికి కిటికీ నుంచి ప్రధాన ద్వారం తలుపు గడియను తీసి లోపలకు ప్రవేశించాడు. కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాడు. దీనితో పాటు ఈ అపార్టుమెంట్‌కు వెనుక వైపు ఉన్న ఇంట్లో తాళాలు పగలుగొట్టి చోరీ చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తును సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ చేపట్టారు. చోరీలు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా అందులో మోహనరావు ముఖం కనిపించింది. మోహనరావు వద్ద నుంచి రూ.26 లక్షల విలువ చేసే 349 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు నుంచి ఎస్.కోట వరకు..

మోహనరావు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులకు ఉప్పందింది. దీనితో సీసీఎస్‌లోని ఒక బృందం అక్కడికి వెళ్లగా పరారయ్యాడు. తర్వాత కొన్ని రోజులకు అతడు విజయవాడలో ఉన్నట్టు సమాచారం తెలిసింది. ఈ సమాచారం అందిన కొద్దిసేపటికి హనుమాన్ జంక్షన్‌లో ఉన్నట్టు మరో సమాచారం లభించింది. దీనితో నిందితుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడని అనుమానించి పీఎన్‌బీఎస్‌కు వెళ్లారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే ఎస్.కోట వెళ్లే బస్సు ఎక్కినట్టు తెలిసింది. దీనితో వెంటనే ఎస్.కోట డిపో మేనేజర్‌తో ఫోన్‌లో టచ్‌లోకి వెళ్లారు. పీఎన్‌బీఎస్ నుంచి ఎస్.కోటకు బయలుదేరిన బస్సుల డ్రైవర్ల నంబర్లను తీసుకున్నారు. వారికి మోహనరావు ఫొటోను వాట్సాప్‌లో పంపగా ఒక బస్సు డ్రైవర్ తన బస్సులో ఉన్నట్టు సమాచారం ఇచ్చాడు. విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో లక్ష్మీనారాయణ టీం బయలుదేరి వెళ్లి రాజమండ్రిలోని దివాన్‌చెరువు వద్ద కాపుగాచి ఎస్.కోట బస్సు అతడ్ని పట్టుకుని విజయవాడకు తీసుకొచ్చి విచారించగా నేరాల చిట్టా వెలుగులోకి వచ్చింది. ఒకసారి చోరీ చేసిన తర్వాత రెండేళ్ల వరకు చిక్కడని పోలీసులకు ఒక నమ్మకం. విజయవాడ పోలీసులకు చిక్కడానికి రెండు నెలల ముందు హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలు నుంచి మోహనరావు విడుదలయ్యాడు.

వంటిపై దుస్తుల్లేకుండా చోరీలు

మోహనరావును విచారించే క్రమంలో పోలీసులకు అనేక కొత్త విషయాలు తెలిశాయి. ముందుగా నేరం చేయాలనుకున్న ప్రదేశంలో రెండు, మూడు రెక్కీలు నిర్వహిస్తాడు. చోరీ చేయాలనుకున్న ఇంటికి పక్కనే ఖాళీ స్థలం ఉంటేనే దాన్ని ఎంచుకుంటాడు. దొంగతనం చేయడానికి బయలు దేరినప్పుడు ఆ ఇంటికి సమీపంలో పాడుబడిన భవనంలోకి గానీ, తుప్పల్లోకి గానీ వెళ్తాడు. అక్కడ మొత్తం దుస్తులను తీసేస్తాడు. ఆ తర్వాత గోడ దూకి ఆ ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అనుకున్న పని సజావుగా జరిగిన తర్వాత మళ్లీ దుస్తులు ధరించి అక్కడి నుంచి వెళ్లిపోతాడు. కొంత దూరం వచ్చిన తర్వాత ఉపయోగించిన ఫోన్, సిమ్‌కార్డులను పడేస్తాడు. రూ.1000 విలువ చేసే ఫోన్లు మాత్రమే ఉపయోగిస్తాడు. ఇలా కాజేసిన సొత్తును రెండు, మూడు చోట్ల విక్రయించేస్తాడు. ఈ సొమ్మును తీసుకుని తునికి వెళ్తాడు. నేరుగా ఇంటికి వెళ్లకుండా తన బావమరిదికి కబురుపెడతాడు. భార్య పిల్లలను ఆ లాడ్జికి రప్పించుకుంటాడు. డబ్బును ఆమెకు ఇస్తాడు. తునికి సమీపంలో రూ.80లక్షలతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు సమాచారం. కంచర్ల మోహనరావుపై రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ అనేక కేసులు ఉన్నాయి. విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, హైదరాబాద్‌లో సుమారుగా 40 కేసులు ఉన్నాయి.

నన్ను ఎలా పట్టుకున్నారో చెప్పండి ప్లీజ్..

ఏదైనా నేరంలో చిక్కినప్పుడు నిందితులను పోలీసులు ప్రశ్నిస్తారు. సీసీఎస్ పోలీసులను మాత్రం నిందితుడు మోహనరావు ప్రశ్నించాడు. తనను ఎలా పట్టుకున్నారో చెప్పాలని పలుమార్లు అడిగాడు. మోహనరావు చోరీ చేసిన తర్వాత పోలీసులకు చిక్కడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. చర్లపల్లి జైలు నుంచి బయటకు రాగానే సీసీఎస్ పోలీసులకు చిక్కడంతో ఈ ప్రశ్న వేసినట్టు తెలిసింది.

ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలి

» మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

» ఘనంగా సంజా ఉత్సవ్ ప్రారంభం



సంజా ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న తేజ్ భరత్

పటమట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనే నినాదంతో సంజా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. గురువారం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో సంజా ఉత్సవ్ ఎన్‌హెచ్‌జీ-2024ను మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, అడిషనల్ కమిషనర్ జనరల్ వీఎంసీ సంస్థ డాక్టర్ డి.చంద్రశేఖర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2.0లో భాగంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారి ఉండాలనే ఉద్దేశంతో సంజా ఉత్సవ్ పేరుతో ఇటువంటి మేళా ఏర్పాటు చేశామన్నారు. వీఎంసీ ప్రాజెక్టు అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ప్రాజెక్టు ఆఫీసర్(యూసీడీ) పి.వెంకట నారాయణ ఫణికుమార్, సుజాత పాల్గొన్నారు.

నేడు పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై విచారణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పొట్లపాలెం శివారు కొత్తపూడిలోని బఫర్ గిడ్డంగిలో బియ్యం మాయమైన కేసులో నిందితురాలు పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు. తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టులో స్పెషల్ పీపీ విజయ తన వాదనను వినిపించనున్నారు.

వీడ్కోలు 2024

వంద కోట్ల వీరులు

ఈ ఏడాది ఎన్నో భారీ బడ్జెట్ చిత్రాలు.. మరెన్నో చిన్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. వాటిలో అంచనాలను అందుకున్నవి కొన్ని. అంచనాలను తలకిందులు చేసినవి మరికొన్ని. ఏ అంచనాలు లేకుండా అనూహ్యంగా విజయం సాధించినవీ ఉన్నాయి. అలా ఈ ఏడాది రూ. వంద కోట్ల వసూళ్లు సాధించిన చిత్రాలివే.



పుష్ప 2: అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప 2' ఈ నెల 5న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం ఇప్పటికే రూ.1700 కోట్ల గ్రాస్ సాధించిందని నిర్మాతలు ప్రకటించారు. నార్త్‌లో ఈ సినిమా రూ.700 కోట్ల గ్రాస్ కలెక్షన్లతో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. లాంగ్‌రన్‌లో ఈ చిత్రం మొత్తం ఎన్ని కోట్ల కలెక్షన్లు సాధిస్తుందనేది తెలియాల్సి ఉంది.

కల్కి 2898 ఏ.డీ: ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ తెరకెక్కించిన ఈ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం జూన్ 27న విడుదలైంది. ఈ సినిమా రూ.1100 కోట్ల పైచిలుకు కలెక్షన్స్ సాధించింది. ఈ సినిమాతో వెయ్యి కోట్ల క్లబ్‌లోకి రెండు సార్లు(బాహుబలి 2, కల్కి 2898 ఏ.డీ) చేరిన తొలి దక్షిణాది హీరోగా ప్రభాస్ నిలిచారు.



దేవర: ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబరు 27న విడుదలైంది. ఇందులో దేవర, వరగా రెండు పాత్రల్లో అభిమానులను ఆకట్టుకున్నారు ఎన్టీఆర్. ఈ సినిమా దాదాపు రూ.450 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. ఈ సినిమాకూ కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని టాక్.



హను-మాన్: తేజసజ్జా, అమృతఅయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.300 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. ఈ దర్శకుడి సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది మొదటి చిత్రం. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం ఉంటుందని ప్రకటించారు.

గుంటూరు కారం: మహేశ్‌బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దాదాపు 15 ఏళ్లకు వచ్చిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. భారీ బడ్జెట్‌తో సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దాదాపు రూ.180 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. మహేశ్, త్రివిక్రమ్ కాంబో నుంచి ఎటువంటి ఎంటర్టైన్‌మెంట్‌ను ఆశిస్తారో సరిగ్గా అలాంటి వినోదాన్నే పంచిన ఈ చిత్రం, మహేశ్ అభిమానులను ఖుషీ చేసింది.

టిల్లు స్క్వేర్: 'డీజే టిల్లు'కి కొనసాగింపుగా వచ్చిన రెండో భాగం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ మార్క్ డైలాగ్స్, మేనరిజమ్స్‌తో పాటు అనుపమ గ్లామర్ ఈ సినిమాకు స్పెషల్ అస్సెట్‌గా నిలిచాయి. ఈ సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ సాధించింది.

సరిపోదా శనివారం: నాని, ప్రియాంక మోహన్ జంటగా వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది.

తమిళ చిత్రాలు



గోట్: తమిళ నటుడు విజయ్ నటించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదలైంది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.460 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. విజయ్ ఇందులో డ్యూయెల్ రోల్‌లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అమరన్: శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన చిత్రం 'అమరన్'. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 31న విడుదలైంది. సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం దాదాపు రూ.320 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది.

వేట్టయాన్: రజనీకాంత్ కథానాయకుడిగా టీజే.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదలైంది. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా దాదాపు రూ.240 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది.

మహరాజ: విజయ్‌సేతుపతి నటించిన ఈ చిత్రం జూన్ 13న విడుదలైంది. ఇటీవలే చైనాలోనూ విడుదలైన ఈ సినిమా దాదాపు రూ.190 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది.

కెప్టెన్ మిల్లర్.. రాయన్: ధనుశ్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' జనవరి 12న తమిళనాట విడుదలై దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. అరుణ్ మాథేశ్వరన్ ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహించారు. 1930లో బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఓ తెగకు నాయకుడిగా ధనుశ్ ఇందులో నటించారు. వంద కోట్ల క్లబ్‌లోకి చేరిన మరో ధనుశ్ చిత్రం 'రాయన్'. ఆయన స్వీయ దర్శకత్వంలో జూలై 26న విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ.150 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది ధనుశ్‌కు 50వ చిత్రం కావడం విశేషం.

అరణ్మనై 4: సుందర్.సి దర్శకత్వంలో తమన్నా భాటియా, రాశీ ఖన్నా నటించిన ఈ చిత్రం మే 3న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద ఈ హారర్ సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది.

మలయాళ చిత్రాలు

మంజుమ్మెల్ బాయ్స్: ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి చిత్రంగా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ సినిమా దాదాపు రూ.240 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది.

ద గోట్ లైఫ్: పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ద గోట్ లైఫ్:ఆడు జీవితం'. మార్చి 29న విడుదలైన ఈ చిత్రానికి బ్లెస్సీ దర్శకత్వం వహించారు. 2008లో రచయిత బెన్యామిన్ రచించిన మలయాళ బెస్ట్ సెల్లర్ 'ఆడుజీవితం' పుస్తకం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.150 కోట్ల గ్రాస్‌ను రాబట్టింది.

ప్రేమలు: గిరీశ్ ఏ.డీ దర్శకత్వంలో నెస్లెన్.కె.గఫూర్, మమితా బైజు నటించిన రొమాంటిక్ కామెడీ 'ప్రేమలు'. ఫిబ్రవరి 9న విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్ టాక్‌ను తెచ్చుకుని దాదాపు రూ.130 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది.

సంక్రాంతి కోసం వెంకీ పాట



వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్న ట్రయాంగులర్ క్రైమ్ కామెడీ 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే, ఈ సినిమాకు ప్రధానాకర్షణగా ఉండే ఓ పాటను వెంకటేశ్ పాడుతున్నారు. సంక్రాంతి స్పెషల్‌గా ఈ పాట ఉండనుందట. వచ్చే ఏడాది జనవరి 14న చిత్రం విడుదల కానుంది. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇదివరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.

రొమాంటిక్ కామెడీ



సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఓ భామా అయ్యో రామ'. అలీ, బబ్లు పృథ్వీరాజ్, ప్రభాస్ శ్రీను, అనిత హస్సనందిని కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో లీడ్ పెయిర్ సుహాస్, మాళవిక మనోజ్ మధ్యనున్న కెమిస్ట్రీ, విజువల్స్, సంభాషణలు ఆకట్టుకున్నాయి. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: ఎస్.మణికందన్, సంగీతం: రథన్.

కుటుంబ చిత్రం



రామ్‌కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'సఃకుటుంబానాం'. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, నవీన్.జీ.పీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఉదయ్‌శర్మ దర్శకత్వంలో మహాదేవ గౌడ, హెచ్.నాగరత్న నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'అది దా సారు' అనే పాటని ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ రచించిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శశాంక్ మౌళి, డీఓపీ: మధు దాసరి.

విడుదలకు సిద్ధం



'జనతా గ్యారేజ్' చిత్రంతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నారు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మార్కో'. యుక్తి తరేజా, కబీర్ దుహన్ సింగ్ కీలక పాత్రలు పోషించారు. హనీఫ్ అదేని దర్శకత్వంలో షరీఫ్ మహమ్మద్ నిర్మించారు. ఇటీవలే మలయాళంలో విడుదలైన ఈ చిత్రం హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలకు సిద్ధమైంది. వచ్చే ఏడాది, జనవరి 1నసినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా ప్రకటించారు.

పవర్‌ఫుల్ రోల్‌లో...




ఆది సాయికుమార్ యుగంధర్ ముని దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'శంబాల'. అర్చన అయ్యర్ కథానాయిక. భారీ బడ్జెట్‌తో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఎవరూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందిన యుగంధర్ ముని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆది పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

పాటలు ప్రత్యేకాకర్షణగా



పృథ్వీ ప్రవీణ్, వైష్ణవి, యాశిక ప్రధాన పాత్రల్లో వై.రమణా రెడ్డి, మధుసూదన్, ఈశ్వర్ నిర్మిస్తున్న చిత్రం 'మహిషా'. ప్రవీణ్ కె.వి. దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, హీరో ప్రవీణ్ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. నటుడిగా, దర్శకుడిగా ఈ చిత్రం నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. తప్పకుండా అందరూ సపోర్ట్ చేయాలని కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత మధుసూదన్‌రావు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాటలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. గోవాలో తీసిన సాంగ్ హైలెట్‌గా నిలుస్తుంది' అని అన్నారు.

నాలుగు పాత్రల మధ్య



పూర్ణ ప్రధాన పాత్రలో నటించగా జి.ఆర్.ఆదిత్య దర్శకత్వంలో సురేశ్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం 'డార్క్ నైట్'. పూర్ణ సరసన త్రిగుణ్(ఆదిత్ అరుణ్) నటించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్ రెడ్డి మాట్లాడుతూ 'పూర్ణ నటన ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది. ఎమోషనల్‌గా సాగే థ్రిల్లర్ కథతో నిర్మించాం. రచయిత, దర్శకుడు జి.ఆర్.ఆదిత్య నాలుగు ప్రధాన పాత్రల మధ్య సంక్లిష్టంగా అల్లిన భావోద్వేగాలతో ఉత్కంఠభరితమైన కథనాన్ని అందించారు. సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగించేలా సన్నివేశాలు ఉంటాయి' అని తెలిపారు.

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 27 డిసెంబరు 2024

ఆసీస్ ఆడేసుకుంది

టాప్-4 బ్యాటర్ల హాఫ్ సెంచరీలు
ఆకట్టుకున్న టీనేజర్ కాన్‌స్టాస్
తొలి ఇన్నింగ్స్ 311/6
బాక్సింగ్ డే టెస్టు


కాన్‌స్టాస్ (60)

మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టును ఆతిథ్య ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. సిరీస్‌లో ఇప్పటిదాకా అంతగా ప్రభావం చూపని టాపార్డర్ మెల్‌బోర్న్ మైదానంలో కలిసికట్టుగా కదం తొక్కింది. లబుషేన్ (72), స్మిత్ (68 బ్యాటింగ్), అరంగేట్ర టీనేజర్ కాన్‌స్టాస్ (60), ఖవాజా (57) ఇలా తొలి నలుగురు బ్యాటర్లు అర్ధసెంచరీలతో బ్యాట్లు ఝుళిపించారు. దీంతో గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 6 వికెట్లకు 311 పరుగులు సాధించింది. క్రీజులో స్మిత్‌తో పాటు కమిన్స్ (8 బ్యాటింగ్) ఉన్నాడు. బుమ్రాకు మూడు వికెట్లు దక్కాయి. ఇక రెండో రోజు శుక్రవారం ఆటలో జోరు మీదున్న స్మిత్‌ను ఆరంభంలోనే కట్టడి చేయడంతో పాటు మిగతా వికెట్లను కూడా వేగంగా తీయాల్సి ఉంటుంది. లేకుంటే ఆసీస్ భారీ స్కోరును అడ్డుకోవడం కష్టమే.

కాన్‌స్టాస్ కేక..

19 ఏళ్లకే టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఓపెనర్ సామ్ కాన్‌స్టాస్ అరంగేట్రం మ్యాచ్‌లో అదరగొట్టాడు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కోగలడా? అనే సందేహాలు వ్యక్తమైనా.. బరిలోకి దిగాక అతడి జోరును చూసి క్రికెట్ పండితులే ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అపార అనుభవజ్ఞుడిలా అతడు ఆడిన షాట్లకు ఎంసీజీలో ప్రేక్షకులు ఫిదా అయ్యారు. తాజా సిరీస్‌లో భారత స్టార్ పేసర్ బుమ్రాను ఎదుర్కొనేందుకు ఆసీస్ బ్యాటర్లు అష్టకష్టాలు పడుతుండగా.. కాన్‌స్టాస్ మాత్రం అతడిని ఓ సాధారణ బౌలర్‌గా మార్చివేశాడు. తాను ఎదుర్కొంటోంది ప్రపంచ అగ్రశ్రేణి బౌలర్ అనే ఒత్తిడి, జంకు ఏమాత్రం లేకుండా స్కూప్, రివర్స్ స్కూప్ షాట్లతో అతనాడిన తీరు భారత జట్టును షాక్‌కు గురిచేసింది. ఇంకా క్రీజులో కుదురుకోకముందే ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో అతడు ఇదే తరహాలో వికెట్ల వెనకాల 4,6,4 బాది అవాక్కయ్యేలా చేశాడు. బుమ్రా మరో ఓవర్‌లోనూ 4,6,4తో వేగంగా పరుగులను రాబట్టాడు. ఈజోరుతో కాన్‌స్టాస్ 52 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ జడేజా అతడి దూకుడును అడ్డుకోవడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. లంచ్ విరామానికి ఆసీస్ 112/1తో నిలిచింది.


బుమ్రా (3 వికెట్లు)

బౌలర్ల కట్టడి

కొత్త బంతితో ప్రభావం చూపని భారత బౌలర్లు రెండో సెషన్‌లో మాత్రం కట్టడి చేయగలిగారు. అర్ధసెంచరీ పూర్తి చేశాక మరో ఓపెనర్ ఖవాజాను బుమ్రా అవుట్ చేశాడు. ఈ సెషన్‌లో ఆసీస్ కోల్పోయిన వికెట్ ఇదొక్కటే. లబుషేన్, స్మిత్ జాగ్రత్తగా ఆడడంతో ఈ సెషన్‌లో ఆసీస్ 23 ఓవర్లలో 64 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే ఆఖరి సెషన్‌లో మాత్రం వికెట్లను పడగొట్టగలిగారు. స్మిత్, లబుషేన్ దీటుగా ఆడుతూ బౌలర్లను విసిగించారు. డ్రింక్స్ విరామం తర్వాత లబుషేన్ స్పిన్నర్ సుందర్ ఓవర్‌లో ఫ్రంట్‌ఫుట్ ఆడే ప్రయత్నంలో విరాట్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ప్రమాదకర హెడ్ (0)తో పాటు మార్ష్ (4)ను బుమ్రా వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో భారత శిబిరంలో జోష్ కనిపించింది. కానీ క్యారీ అండతో స్మిత్ చెలరేగాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 53 రన్స్ జోడించింది. ఆట చివర్లో క్యారీని పేసర్ ఆకాశ్ అవుట్ చేశాడు.

గిల్‌ను అందుకే తప్పించాం..

శుభ్‌మన్ గిల్‌ను నాలుగో టెస్టులో ఆడించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. అతడి స్థానంలో రెండో స్పిన్నర్‌గా సుందర్‌ను ఎంపిక చేశారు. గిల్‌పై వేటు విషయమై బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ స్పందించాడు. 'ఇక్కడి పిచ్‌ను పరిశీలిస్తే బంతి పాతదిగా మారాక సుందర్ వైవిధ్యమైన బౌలింగ్ ప్రయోజకరంగా ఉంటుందని భావించాం. అందుకే జడ్డూతో కలిసి సుందర్‌ను ఆడించాలనుకున్నాం. ఇక రోహిత్ టాపార్డర్‌లో వస్తాడు' అని నాయర్ తెలిపాడు.


లబుషేన్ (72)

ముందుగా అనుకున్నదే..

'బుమ్రా ఓ దిగ్గజ బౌలర్. అతడిని దీటుగా ఎదుర్కొని ఒత్తిడిలో పడేయాలని భావించా. అందుకే ఆరంభంలోనే ర్యాంప్ షాట్లతో ఎదురుదాడికి దిగా. ఆ షాట్లే నా బలం. వాటి కోసం తీవ్రంగా సాధన చేశా. చివరికి అనుకున్నది సాధించా. కెప్టెన్ కమిన్స్ నా సహజశైలిలోనే ఆడాలని సూచించాడు'

- సామ్ కాన్‌స్టాస్

1 భారత్‌పై టెస్టు అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ సాధించిన అతిపిన్న వయస్కుడి (19)గా కాన్‌స్టాస్. అలాగే ఈ ఫార్మాట్‌లో ఆసీస్ తరఫున 50+ స్కోరు సాధించిన రెండో పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఇయాన్ క్రెయిగ్ (17) టాప్‌లో ఉన్నాడు.

4483 బుమ్రా ఓవర్‌లో ఓ బ్యాటర్ సిక్సర్ బాదక మూడేళ్లవుతోంది. తాజాగా బాక్సింగ్ డే టెస్టులో ఆ రికార్డును టీనేజర్ కాన్‌స్టాస్ బ్రేక్ చేశాడు. దీంతో సరిగ్గా బుమ్రా తన 4483 బంతుల తర్వాత టెస్టుల్లో సిక్సర్ సమర్పించుకోవడం గమనార్హం.

స్కోరుబోర్డు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (ఎల్బీ) జడేజా 60; ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లీ (బి) సుందర్ 72; స్మిత్ (బ్యాటింగ్) 68; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; క్యారీ (సి) పంత్ (బి) ఆకాశ్ 31; కమిన్స్ (బ్యాటింగ్) 8; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 86 ఓవర్లలో 311/6. వికెట్ల పతనం:** 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299; **బౌలింగ్:** బుమ్రా 21-7-75-3; సిరాజ్ 15-2-69-0; ఆకాశ్ 19-5-59-1; జడేజా 14-2-54-1; నితీశ్ 5-0-10-0; సుందర్ 12-2-37-1.

ఖలిస్థాన్ వాదులను అడ్డుకున్న ఫ్యాన్స్



బాక్సింగ్ డే టెస్ట్ సందర్భంగా మైదానంలోనే కాదు.. బయట కూడా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. జాతీయ జెండాను అవమానిస్తున్న ఖలిస్థాన్ మద్దతుదార్లతో దేశ అభిమానులు ఘర్షణకు దిగారు. అయితే, పోలీసులు అడ్డుకొని ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపేశారు. స్టేడియం బయట కొందరు ఖలిస్థానీ జెండాలు పట్టుకొని భారత్‌ను కించపరిచే విధంగా మైక్‌లో మాట్లాడుతూ మీడియా దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు.

కోహ్లీ X కాన్‌స్టాస్
విరాట్‌కు జరిమానా

అరంగేట్రం ఆటగాడు కాన్‌స్టాస్‌ను కవ్వించే పయత్నం చేసిన కోహ్లీపై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకొంది. అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా జోడించింది. ఇన్నింగ్స్ 10వ ఓవర్ ముగిశాక బంతి తీసుకొని కోహ్లీ మరో ఎండ్‌కు వస్తున్నాడు. మరోవైపు నాన్‌స్ట్రయికర్‌తో మాట్లాడేందుకు కాన్‌స్టాస్ కూడా ముందుకు వెళ్తున్నాడు. ఈ సమయంలో విరాట్ భుజం కాన్‌స్టాస్‌కు తగిలింది. అయితే, కోహ్లీ చర్యను తప్పుబట్టిన మ్యాచ్ రెఫరీ లెవల్-1 ఉల్లంఘన కింద అతడిపై జరిమానా విధించాడు. ఆసీస్ మాజీ ఆటగాళ్లు కూడా కోహ్లీ తీరును తప్పుబట్టారు. విరాట్ ఉద్దేశపూర్వకంగానే వచ్చి తగిలినట్టుగా వీడియోలో కనిపిస్తోందని పాంటింగ్ అన్నాడు. కింగ్ లాంటి కోహ్లీ.. 19 ఏళ్ల పిల్లాడితో ఇలా వ్యవహరించడం సబబు కాదని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ వ్యాఖ్యానించాడు.





పాకిస్థాన్ 211 ఆలౌట్
దక్షిణాఫ్రికాతో మొదటి టెస్ట్

సెంచూరియన్: పేసర్ డేన్ పాటర్సన్ (5/61) ఐదు వికెట్లతో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో గురువారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ 211 పరుగులకే ఆలౌటైంది. కమ్రాన్ గులామ్ (54) రాణించాడు. మరో పేసర్ కార్బిన్ బాష్ (4/63) నాలుగు వికెట్లు సాధించాడు. అనంతరం దక్షిణాఫ్రికా ఆట ఆఖరికి మూడు వికెట్లకు 82 పరుగులు చేసింది. కాగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ క్రికెట్ మూడు ఫార్మాట్లలో నాలుగు వేలకుపైగా పరుగులు సాధించిన మూడో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈక్రమంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ సరసన చేరాడు

సెమీస్‌కు బెంగాల్

హైదరాబాద్: బెంగాల్ జట్టు సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో బెంగాల్ 3-1తో ఒడిశాను ఓడించింది. నరోహరి శ్రేష్ఠ (45వ), రోబీ హన్స్‌దా (77వ), మనోటోస్ మాజీ (90వ) నిమిషాల్లో గోల్స్ చేయగా.. ఒడిశా తరఫున రాకేస్ ఓరమ్ (25వ) ఏకైక గోల్ సాధించాడు.



కాలినడకన తిరుమలకు సింధు దంపతులు

తిరుమల (ఆంధ్రజ్యోతి): కొత్త జంట పీవీ సింధు, దత్తసాయి గురువారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి మెట్ల మార్గంద్వారా వీరు కొండపైకి వెళ్లారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

భారత్ X వెస్టిండీస్
అమ్మాయిల మూడో వన్డే నేడు

ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో

వడోదర: తొలి రెండు వన్డేలలో వెస్టిండీస్‌ను చిత్తుచేసిన భారత అమ్మాయిలు మూడో వన్డేలోనూ నెగ్గి.. 3-0తో సిరీస్ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ఈ క్రమంలో వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగే ఆఖరిపోరుకు భారత్ సిద్ధమైంది.

ఆంధ్ర ఘన విజయం

ముంబై: విజయ్ హజారే వన్డే ట్రోఫీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 8 వికెట్లతో సిక్కింను చిత్తు చేసింది. తొలుత సిక్కిం 32.2 ఓవర్లలో 119 పరుగులకు కుప్పకూలింది. సత్యనారాయణ రాజు 3, స్టీఫెన్, రాహుల్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో ఆంధ్ర 20.4 ఓవర్లలో 123/2 స్కోరు చేసి నెగ్గింది. రికీ భుయ్ (41 నాటౌట్) రాణించాడు. కాగా అహ్మదాబాద్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు సౌరాష్ట్ర చేతిలో పరాజయం పాలైంది. ఇక దేశవాళీ క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఉత్తరప్రదేశ్ అండర్-23 జట్టు రికార్డులకెక్కింది. అండర్-23 స్టేట్-ఎ వన్డే ట్రోఫీలో గురువారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ నిర్దేశించిన 407 పరుగుల లక్ష్యాన్ని యూపీ 41.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

సెమీస్‌లో యూపీ, పట్నా

పుణె: ప్రొ.కబడ్డీ తాజా సీజన్ తుది అంకానికి వచ్చేసింది. సెమీఫైనల్లో తలపడే జట్లేవో తేలిపోయింది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో హరియాణా స్టీలర్స్-యూపీ యోధా, రెండో సెమీఫైనల్లో దబాంగ్ ఢిల్లీ కేసీ-పట్నా పైరేట్స్ ఢీకొంటాయి. గురువారం ఏకపక్షంగా జరిగిన ఎలిమినేటర్-1లో యూపీ యోధాస్ 46-18తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను చిత్తు చేసింది. భవానీ రాజ్‌పుత్ 12 పాయింట్లతో యూపీ విజయంలో కీలక భూమిక పోషించాడు. హితేష్ హై-5తో మెరిశాడు. ఎలిమినేటర్-2లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ 31-23తో యు ముంబాపై గెలుపొందింది.


యూపీ-జైపూర్ మ్యాచ్ దృశ్యం



చిన్న షేరు.. తళుక్కు!

ఈ ఏడాది 28.45% పెరిగిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ

» మిడ్‌క్యాప్ ఇండెక్స్ 25.61% అప్

» వచ్చే ఏడాదీ కొనసాగనున్న జోరు!?

ఈ ఏడాదీ దలాల్ స్ట్రీట్‌లో చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లే తళుక్కుమన్నాయి. ప్రధాన కంపెనీల స్టాక్స్ కంటే ఆకర్షణీయ ప్రతిఫలాలు పంచాయి. మార్కెట్లో ఆశావహ ట్రెండ్‌తో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడింది. 2024లో ఈక్విటీ సూచీలు వరుస రికార్డుల మోత మోగించాయి. మ్యూచువల్ ఫండ్ల ద్వారా, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో మార్కెట్లోకి ద్రవ్య ప్రవాహం భారీగా పెరగడంతోపాటు బలమైన ఆర్థిక మూలాలు, విధానపరమైన సానుకూలత తోడ్పడ్డాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానపరమైన చర్యలు, సానుకూల పరిస్థితులతో లబ్ధి పొందిన రియల్టీ, మౌలికం, హెల్త్‌కేర్, పునరుత్పాదక ఇంధనం రంగాలు మెరుగైన పనితీరు కనబరచడం ఈ ఏడాది స్మాల్, మిడ్ క్యాప్ సూచీల వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆరోరా చోప్రా అన్నారు. దేశంలో వినియోగం పుంజుకోవడంతో పాటు సాంకేతిక పురోగతి, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) వంటి పథకాలతో చిన్న కంపెనీల పనితీరు మెరుగైందన్నారు.

వచ్చే ఏడాదిలోనూ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్స్ హవా కొనసాగనుందని వారు భావిస్తున్నారు. దేశీయంగా బలమైన వినియోగం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా వెచ్చిస్తుండటం ఇందుకు కలిసిరానున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అయితే, స్మాల్, మిడ్‌క్యాప్ విభాగాల్లో ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుడటంతో పాటు కొన్ని రంగాల వృద్ధి మందగించిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడుల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకర్షణీయ ధరకు లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ప్రతిఫలాలు అందుకునే వీలుంటుందన్నారు.

● ఈ ఏడాదిలో ఇప్పటివరకు (ఈ నెల 23 నాటికి) బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 12,144.15 పాయింట్లు (28.45 శాతం) వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 9,435.09 పాయింట్లు (25.61 శాతం) ఎగబాకింది. కాగా, ప్రధాన కంపెనీల ప్రాతినిధ్య సూచీ బీఎస్ఈ సెన్సెక్స్ మాత్రం 6,299.91 పాయింట్లు (8.72 శాతం) పెరిగింది.

● ఈ నెల 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్ల వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేయగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ సెప్టెంబరు 24న 49,701.15 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని రికార్డు చేసింది. కాగా, సెన్సెక్స్ రికార్డు గరిష్ఠం సెప్టెంబరు 27న 85,978.25 వద్ద నమోదైంది.

● 2023లో సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు (18.73 శాతం) వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ సూచీ 13,746.97 పాయింట్లు (47.52 శాతం), మిడ్‌క్యాప్ 11,524.72 పాయింట్లు (45.52 శాతం) ఎగబాకాయి.

● 2022లో మాత్రం స్మాల్‌క్యాప్ 1.80 శాతం, మిడ్‌క్యాప్ 1.37 శాతం వృద్ధికి పరిమితం కాగా.. సెన్సెక్స్ 4.44 శాతం పెరిగింది.



2025లో రూ.2 లక్షల కోట్లపైనే!

ఐపీఓ ద్వారా నిధుల సమీకరణపై పాంటోమత్ గ్రూప్ అంచనా

అత్యధిక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వస్తున్న దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం. ఈ ఏడాది అమెరికాతో పోలిస్తే రెండింతలు, యూరప్ కంటే 2.5 రెట్ల కంపెనీలు భారత్‌లో పబ్లిక్ ఇష్యూకు వచ్చాయని పాంటోమత్ గ్రూప్ అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో నవంబరుతో ముగిసిన 11 నెలల్లో 76 కంపెనీలు ఐపీఓల ద్వారా మొత్తం రూ.1.3 లక్షల కోట్లు సమీకరించాయి. వచ్చే ఏడాది ఐపీఓ నిధుల సమీకరణ రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటవచ్చని పాంటోమత్ గ్రూప్ అంచనా వేసింది. వచ్చే ఏడాదిలో ఆఫర్‌ను ప్రారంభించేందుకు వీలుగా 34 కంపెనీలు ఇప్పటికే సెబీ అనుమతి పొందాయని.. వాటి మొత్తం నిధుల సమీకరణ లక్ష్యం రూ.41,462 కోట్లుగా ఉందని రిపోర్టులో వెల్లడించింది. మరో రూ.98,672 కోట్ల విలువైన 55 కంపెనీల ఐపీఓలు సెబీ అనుమతి కోసం వేచి చూస్తున్నాయని.. వచ్చే ఏడాదిలో వీటికి గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలున్నాయంది.

బిజినెస్

సంస్కరణాద్యుడా.. సెలవిక..

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల సంతాపం తెలిపిన పారిశ్రామిక ప్రముఖులు



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు పారిశ్రామిక ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశంలో తొలి తరం ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, ఆధునిక ఆర్థిక భారత నిర్మాతగా మన్మోహన్ సింగ్‌ను కొనియాడారు.

భారత్ రూపు మార్చిన, ప్రపంచానికి మన తలుపులు తెరిచిన 1991 ఆర్థిక సంస్కరణల రూపకల్పనలో ఆయన పోషించిన కీలకపాత్రను చరిత్ర ఎప్పటికీ గౌరవిస్తుంది. మృదువుగా మాట్లాడినప్పటికీ తన చర్యల ద్వారా చిరస్మరణీయ పురోగతిని సాధించిన అరుదైన నాయకుడు ఆయన. నాయకత్వం, వినయం, దేశ సేవలో డాక్టర్ మన్మోహన్ సింగ్ జీవితం ఆదర్శదాయకం, భావితరాలకు స్ఫూర్తిదాయకం.

- గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్

డాక్టర్ మన్మోహన్ సింగ్ నిజమైన రాజనీతిజ్ఞుడు. ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. తన మేధస్సు, దయ, సమగ్రతతో భారత్‌ను ఆధునిక ఆర్థిక దేశంగా తీర్చిదిద్దారు. ఆయన మాటల కంటే చేతల్లో చూపించారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక.

- హర్ష్ గోయెంకా, ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు వీడ్కోలు. మీరు ఈ దేశాన్ని ప్రేమించారు. దేశానికి మీరు అందించిన సేవలు సుదీర్ఘకాలం గుర్తుండిపోతాయి.

- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్

మన్మోహన్ సింగ్ వివేకవంతమైన ఆర్థికవేత్త. గొప్ప సమగ్రత కలిగిన వ్యక్తి. తన సంస్కరణలతో భారత్‌ను తిరిగి ప్రగతిబాట పట్టించినందుకు గాను మేమెప్పుడూ మీకు రుణపడి ఉంటాం.

- కిరణ్ మజుందార్ షా, బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్

మన్మోహన్ సింగ్ గొప్ప శ్రోత. ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. కానీ, ఆయన మాట్లాడినప్పుడల్లా సారాంశం మాత్రమే మాట్లాడేవారు.

- దువ్వూరి సుబ్బారావు, ఆర్‌బీఐ మాజీ గవర్నర్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,730 ▲	71,250 ▲	1,00,000 ▲
విజయవాడ	78,500 ▼	73,000 ▲	92,000 ▲
విశాఖపట్నం	76,890 ▲	70,480 ▲	89,740 ▲
రాజమండ్రి	77,730 ▲	71,250 ▲	90,500 ▲
ప్రొద్దుటూరు	78,500 ▲	72,690 ▲	90,500 ▲
ముంబై	76,336 ▲	69,924 ▲	88,040 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	109
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	96
కర్నూలు	103	నెల్లూరు	96
విశాఖపట్నం	108	అనంతపురం	96
గోదావరి	109		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




27వ తేదీ

హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

6 నెలలు.. రూ.21,367 కోట్లు

2024-25 ప్రథమార్ధంలో బ్యాంకుల్లో 8 రెట్లు పెరిగిన మోసాలు.. ఆర్‌బీఐ నివేదిక వెల్లడి



ముంబై: ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బ్యాంకుల్లో మోసాలు మాత్రం తగ్గడం లేదు. ఏదోలా మాయ చేసి కేటుగాళ్లు దర్జాగా బ్యాంకుల నుంచి కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లోనే దేశంలోని బ్యాంకుల్లో 18,461 మోసపూరిత కేసులు నమోదయ్యాయి. ఈ మోసాలతో కొట్టేసిన సొమ్ము రూ.21,367 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2023 -24) ఇదే కాలంలో నమోదైన రూ.2,623 కోట్లతో పోలిస్తే ఇది ఎనిమిదింతలు ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం దీనికి సంబంధించి 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఈ మోసాలతో బ్యాంకింగ్ వ్యవస్థ పేరు ప్రతిష్ఠలతో పాటు నిర్వహణ, వ్యాపారపరమైన ఇబ్బందులు, వాటి ఆర్థిక స్థిరత్వం, ఖాతాదారుల నమ్మకానికి సవాల్‌గా మారాయని తెలిపింది.

పీఎస్‌బీల వాటానే ఎక్కువ

గత ఆర్థిక సంవత్సరం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నమోదైన ఇంటర్నెట్, కార్డు మోసాల్లో 67.1 శాతం ప్రైవేట్ బ్యాంకుల్లో నమోదయ్యాయని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. అయితే నష్టపోయిన సొమ్ము పరంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లే అత్యధికంగా నష్టపోయాయి. ఇటీవల కొన్ని డిజిటల్ లెండింగ్ సంస్థలు ఆర్‌బీఐ నియంత్రణలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల అనుబంధ సంస్థలమని చెప్పుకుని మోసం చేయడమూ పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది. దీంతో ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ మోసాలకు పాల్పడే డిజిటల్ లెండిగ్ యాప్స్ పేర్ల తో ఒక జాబితా రూపొందించేందుకు సిద్ధమవుతోంది.

రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు

మోసాలు పెరిగి పోతున్నా దేశంలోని వాణిజ్య బ్యాంకులు వరుసగా ఆరో సంవత్సరంలోనూ లాభాలు నమోదు చేయడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో బ్యాంకులు రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు నమోదు చేశాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది రూ.87,000 కోట్లు ఎక్కువ. మళ్లీ ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) వాటానే రూ.1.46 లక్షల కోట్లుగా ఉంది.

ఆరంభ లాభాలు ఆవిరి


ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం మిశ్రమంగా ముగిశాయి. మార్కెట్‌ను ముందుకు నడిపించే అంశాలేమీ లేకపోవడంతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ఇందుకు కారణమైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 425 పాయింట్ల వరకు ఎగిసిన సెన్సెక్స్.. తొలి గంటలోనే లాభాలను పూర్తిగా కోల్పోయింది. ఆ తర్వాత అతి స్వల్ప లాభ, నష్టాల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 0.39 పాయింట్ల నష్టంతో 78,472.48 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22.55 పాయింట్ల పెరుగుదలతో 23,750.20 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోయాయి. అందులో టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ఒక శాతానికి పైగా క్షీణించాయి. మార్కెట్ స్తబ్దుగా కొనసాగినప్పటికీ, అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5 శాతానికి పైగా పుంజుకుంది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.24 శాతం తగ్గగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.11 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్ 1.80 శాతం ఎగబాకగా.. ఆటో 0.81 శాతం పెరిగింది. కమోడిటీ, ఇండస్ట్రియల్స్, టెలికాం, మెటల్, ఐటీ, బ్యాంకింగ్ సూచీలు మాత్రం నష్టపోయాయి.

అయ్యో.. రూపాయి!

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు క్షీణించి రూ.85.27 వద్ద ముగిసింది. రూపీ బలహీనపడటం వరుసగా ఇది మూడో రోజు. అంతర్జాతీయంగా డాలర్ మరింత బలపడటంతో పాటు బ్రెంట్ ముడిచమురు ధర మళ్లీ 74 డాలర్లకు ఎగబాకడం ఇందుకు ప్రధాన కారణాలు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డన హెచ్చరికల నేపథ్యంలో దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరిగిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రత్యేకం

కాలం అవిచ్ఛిన్నంగా ప్రవహించే ఒక మహా ప్రవాహం. ఒక సంవత్సరం... దానిలో చిన్న నీటి బిందువుకన్నా తక్కువే. కానీ ప్రతి క్షణం ఎంతో విలువైన మానవ జీవితంలో... ఒక ఏడాది కాలానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్న వేళ... గడచిన రోజులను, ఆ రోజుల్లో చవిచూసిన సాఫల్య, వైఫల్యాలను పునశ్చరణ చేసుకొని, ఏవైనా పొరపాట్లు జరిగితే రాబోయే కాలంలో సరిదిద్దుకోవడానికి, జీవితాన్ని మరింత ఫలప్రదంగా మార్చుకోవడానికి ఒక సంకల్పం చేసుకోవడం అవసరం.



సంకల్పం చేసుకుందాం... కొత్తగా!

భక్తికన్నా భయమే ఎక్కువ

చాలామంది కొత్త ఏడాదిలో అనుసరించాల్సిన ప్రణాళిక గురించి తీర్మానాలు చేసుకుంటూ ఉంటారు. వాటిలో ఆధ్యాత్మికమైనవి కూడా ఉంటాయి. కానీ వాటిని అమలు చేసేవారు అతి తక్కువ. మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మనల్ని ఊరించే ప్రలోభాలు ఎన్నో ఉంటాయి. వాటిని తట్టుకోవాలంటే జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలి. దాని కోసం భగవంతుడి మీద అచంచలమైన భక్తి కావాలి. ఎక్కువమందిలో దేవుడి పట్ల భక్తి కన్నా... ఇలా చేస్తే దేవుడు ఏ శిక్ష విధిస్తాడో అనే భయమే ఎక్కువగా ఉంటుంది. కానీ దేవుడు మన తప్పొప్పుల పట్టిక రాసే గుమాస్తా కాదు. మనం ఎప్పుడు తప్పు చేస్తామా? ఎలాంటి శిక్ష వేయాలా? అని కాచుకొని కూర్చోడు. మనం పొరపాట్లు చేసినా ఆయన మన్నిస్తాడు. ఆయన మీదే మన మనస్సు లగ్నమైతే... మన లోపాలను సరిదిద్దుతాడు. పాఠాలు నేర్పుతాడు. అనుక్షణం భగవన్నామస్మరణ చేస్తూ, దైవ చింతనలో ఉండేవారికి సన్మార్గాన్ని చూపిస్తాడు.

పిచ్చుక-సముద్రుడు కథ

గట్టి సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని, అలాంటివారికి సాయం చెయ్యడానికి దేవుడు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడనీ పెద్దలు చెబుతారు. దానికి ఈ కథ ఉదాహరణ:

పూర్వం ఒక పిచ్చుక సముద్ర తీరంలో గుడ్లు పెట్టింది. సముద్రుడు తన కెరటాలతో ఆ గుడ్లను లోపలికి లాక్కుపోయాడు. ఆవేదన చెందిన పిచ్చుక... తన గుడ్లను తిరిగి ఇవ్వాలని సముద్రుణ్ణి కోరింది. కానీ సముద్రుడు అంగీకరించలేదు. దాంతో కడలిలో నీరు లేకుండా చేయాలని పిచ్చుక నిశ్చయించుకుంది. తన ముక్కుతో



నీటిని పీల్చి దూరంగా పొయ్యడం మొదలుపెట్టింది. ఆ సమాచారం లోకం అంతటికీ తెలిసింది. అసాధ్యమైన పని చేయాలని పంతం పట్టిన ఆ పిచ్చుక పిచ్చిదని జీవరాశులన్నీ నవ్వుకున్నాయి. మహా విష్ణువు వాహనమైన పక్షిరాజు గరుత్మంతుడు ఈ సంగతి విన్నాడు. పిచ్చుక బాధ, అది చేస్తున్న పనిలోని దృఢసంకల్పం ఆయనకు అర్థమయ్యాయి. వెంటనే ఆ సముద్ర తీరానికి చేరుకున్నాడు. పిచ్చుకకు దాని గుడ్లను తిరిగి ఇవ్వకపోతే... పిచ్చుక చేసే పని తను చేయాల్సి వస్తుందని హెచ్చరించాడు. గరుత్మంతుడి శక్తి ఎంతటిదో బాగా తెలిసిన సముద్రుడు భయపడింది. ఆయనకు దండం పెట్టి, పిచ్చుకకు దాని గుడ్లను తిరిగి ఇచ్చేశాడు.

ఇదొక గొప్ప అవకాశం

ఆధ్యాత్మికంగా కొన్ని విషయాలు అసాధ్యమైనవని అనిపించవచ్చు. కానీ ప్రయత్నం ప్రారంభిస్తే... భగవదనుగ్రహంతో కాలక్రమేణా అవి సానుకూలమవుతాయి. కాబట్టి ఆ దిశగా పయనించడానికి కొత్త సంవత్సర ఆరంభాన్ని ఒక గొప్ప అవకాశంగా భావించాలి. "చేయవలసింది చేయండి, వాటి నుంచి ప్రతిఫలాన్ని ఆశించకండి, అన్నీ నాకు వదిలిపెట్టండి, మిమ్మల్ని నేను కాపాడతాను" అన్నాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణపరమాత్మ. కాబట్టి భారాన్ని భగవంతుడిపైనే వేసి... మంచి పనులే చేస్తామనీ, ఇతరులకు హాని కలిగించబోమనీ సంకల్పం తీసుకోవాలి. మంచి పనులు చేయాలంటే మంచి ఆలోచనలు ఉండాలి. ఎవరినీ ద్వేషించకూడదు, ఎవరిపట్లా అసూయ చెందకూడదు. సహానుభూతి, కృతజ్ఞత, దయ, పరోపకారం... ఇవన్నీ దైవీ గుణాలు. ఈ గుణాలు దేవుడికి ప్రీతి కలిగిస్తాయి. కనుక ఆ లక్షణాలను జీవితంలో భాగం చేసుకోవాలి. వీలైనప్పుడల్లా దైవ మందిరాలను సందర్శించాలి. దేవుడిపై విశ్వాసాన్ని మరింత బలపరుచుకోవాలి. తోటివారికి, ప్రధానంగా బీదసాదలకు సాయం చేయాలి. మంచి ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి, వాటి సారాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. సద్గురువులను ఆశ్రయించాలి, వారి బోధలు వినాలి. రోజువారీ కార్యకలాపాల్లో ఉత్తమమైన అలవాట్లను భాగం చేసుకోవాలి. యోగ, ధ్యానం మనిషిని ఆధ్యాత్మికంగా బలోపేతం చేస్తాయి. శరీరాన్ని, మనసును నిర్మలంగా మార్చుకోవడానికి దోహదం చేస్తాయి. ఇలాంటి విషయాల్లో సంకల్పాలు చేసుకొని... జీవిత సాఫల్యం కోసం ఆధ్యాత్మిక ప్రయాణానికి నూతన సంవత్సరంలో కొత్తగా శ్రీకారం చుడదాం.

సద్బోధ

దృశ్యం ఒకటే... దృష్టే వేరు



అది సూర్యోదయ సమయం. వాతావరణం నిర్మలంగా ఉంది, ఒక పర్వతం పైభాగంలో సాధువు ఒకరు ఏకాంతంగా, ప్రశాంతంగా... కళ్ళు మూసుకొని నిలబడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు ఆ సాధువును చూశారు. ఆయన గురించి వారిలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క అభిప్రాయం కలిగింది.

మొదటి వ్యక్తి "ఆ సాధువు నాకు బాగా తెలుసు. ఎప్పుడైనా అతని ఆవుల్లో ఒకటి తప్పిపోతే... దాన్ని వెతుకుతూ అటూ ఇటూ వెళ్తాడు. ఎక్కడో ఒక చోట ఇలా నిలబడి చూస్తూ ఉంటాడు" అన్నాడు.

రెండో వ్యక్తి "అదేం కాదు! ఆయన ఆవుకోసం వెతుకుతున్నట్టు కనిపించడం లేదు. తన మిత్రుడి కోసం, తోటి సాధువు కోసం ఎదురుచూస్తున్నట్టున్నాడు. ఇద్దరూ కలిసి ఉదయం కాలినడకకు వెళ్తారేమో!" అన్నాడు.

"ఆయనను చూస్తూ ఉంటే తప్పిపోయిన ఆవు కోసం వెతుకుతున్నట్టు కానీ, ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టు కానీ లేదు. ప్రార్థనో, ధ్యానమో చేస్తున్నట్టున్నాడు. అటూ ఇటూ చూడడం లేదు. కళ్ళు మూసుకొని నిశ్చలంగా ఉన్నాడు" అన్నాడు మూడో వ్యక్తి.

అసలు విషయం సాధువునే అడిగి తెలుసుకుందామని వారు అనుకున్నారు. నేరుగా ఆయన దగ్గరకు వెళ్ళి "అయ్యా! మీరు ఈ వేళలో ఇక్కడ ఎందుకిలా నిలబడ్డారు? ఏం చేస్తున్నారు? దయచేసి చెప్పండి" అని అడిగారు. సాధువు సమాధానం ఇవ్వలేదు.

అప్పుడు మొదటి వ్యక్తి "మీరు తప్పిపోయిన మీ ఆవు కోసం వెతుకుతున్నారు కదూ!" అన్నాడు.

"నాకు 'నాది' అనేది ఏదీ లేదు. ఇక ఆవు తప్పిపోవడం, దానికోసం వెతుకుతూ ఉండడం ఎలా సంభవం?" అన్నాడు సాధువు.

"మీరు రోజూ వాహ్యాళికి కలిసి వెళ్ళే మీ తోటి సాధువు కోసం ఎదురు చూస్తున్నారు కదా?" అని అడిగాడు రెండో వ్యక్తి.

"నాకు మిత్రులు కానీ, శత్రువులు కానీ ఎవరూ, ఎప్పుడూ లేరు. నేను రోజూ వాహ్యాళికి ఒంటరిగానే వెళతాను" అని చెప్పాడు సాధువు.

అప్పుడు మూడో వ్యక్తి "నేను అనుకున్నదే సరైన కారణం అనిపిస్తోంది. మీరు ప్రార్థన చేస్తున్నారు, అవునా?" అన్నాడు.

"అలాంటిదేం లేదు. ప్రార్థన ఎవరికి చెయ్యాలో, ఎలా చెయ్యాలో నాకు అస్సలు తెలీదు" అని బదులిచ్చాడు సాధువు.

"మరి ఇక్కడ మీరేం చేస్తున్నారు?" అని ఆ ముగ్గురూ ఒకేసారి ప్రశ్నించారు.

నేను ఊరకే నిలబడి ఉన్నానంతే. ఏదీ చేయడం లేదు, దేన్నీ చూడడం లేదు అన్నాడు సాధువు.

ఆ ముగ్గురు వ్యక్తులు చూసిన దృశ్యం ఒకటే. కానీ ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కోలా ఉంది. అలాగే సత్యం ఒక్కటే. ఒక్కొక్కరు ఒక్కో విధంగా వీక్షిస్తారు, బోధిస్తారు. అందుకే 'ఏకం సత్ విప్రా బహుదా వదన్తి' అన్నారు పూర్వులు. మనకు ఉన్న అభిప్రాయంతో దేన్ని చూసినా... దాని అసలైన స్వరూపాన్ని మనం గ్రహించలేం. మనకు గోచరించేది పాక్షికమైన సత్యమే కాని పూర్ణ సత్యం కాదు, మూల సత్యం కాదు. ఎలాంటి అభిప్రాయాలు, ఆలోచనలు, ఆశయాలు, ఆశలు లేనప్పుడే... సత్యం తాలూకు అసలైన స్వరూపం అవగతం అవుతుంది.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన

హింస పుట్టేది అక్కడే...

వేలాది సంవత్సరాల మానవ నాగరికత మనిషిలోని పశుత్వాన్ని కాస్తయినా అదుపులోకి తేలేకపోయింది. దారుణమైన హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు... ద్వేషంతో మనిషిని చంపి ముక్కలు ముక్కలుగా ఖండించే హంతకులు, అమాయక ప్రజలను తమ పశుత్వానికి బలి తీసుకొనే శత్రు సైన్యాలు... ఇలా ప్రపంచంలో ప్రతి చోటా హింస, దాని ప్రతిరూపమైన కోపం తాండవిస్తున్నాయి. ఈ రెండూ నిత్యజీవితంలో మనకు వివిధ రూపాల్లో తారసిల్లుతాయి. ఈ విషయంలో రాతియుగం నాటి మనుషులకు, ఈనాటి మనుషులకు మధ్య ఏమాత్రం భేదం లేదు. వృద్ధిలోకి వస్తున్న ఎదుటివాణ్ణి చూసినప్పుడు మనిషిలో పుట్టే అసూయ... హింసకు ఒక రూపం. తనను ఇతరులతో పోల్చుకొని... తనలో లేమిని గుర్తించినప్పుడు మనసులో ఏర్పడే అసంతృప్తి, ఇతరుల స్థాయిని అందుకోవడానికి పడే శ్రమ, వాళ్ళతో పడే పోటీ, వాళ్ళను మించిపోవాలనే పట్టుదల... ఇవన్నీ హింస ప్రతిరూపాలే. తమ అభిప్రాయం చెల్లుబాటు కోసం చేసే వాదోపవాదాల్లో హింస ఉంటుంది. పనుల ఒత్తిడి వల్ల మనం ఇతరులను నిరాకరించడానికి ఉపయోగించే పదాల్లో, ప్రదర్శించే భంగిమలలో కూడా హింస ప్రచ్ఛన్నంగా ఉంటుంది. "అంతా పిల్లల మేలు కోసమే అనే ఆదర్శవంతులైన తల్లితండ్రుల పెంపకంలో ఎంతో హింస ఉంటుంది. తల్లితండ్రులు పిల్లల జీవితాలను నాశనం చేస్తారు" అని జిడ్డు కృష్ణమూర్తి ఆరోపిస్తారు. "హింస మన నిత్య జీవితంలో, మన సంబంధ బాంధవ్యాల్లో సర్వత్రా ఉంది. ఈ దైనందిన హింసల బృహత్ స్వరూపమే దేశాల మధ్య ఏర్పడే యుద్ధాలు" అనేది కృష్ణమూర్తి ప్రతిపాదన. హింస నైజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోకుండా... ప్రపంచ శాంతికోసం పడే ప్రయాస విఫలమై తీరుతుంది.



హింస పుట్టుపూర్వోత్తరాలు

జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతం ప్రకారం... వేలాది ఏళ్ళ నుంచి మన సమాజ నిర్మాణం విభజన మీద ఆధారపడి ఉంది. జాతీయ, ప్రాంతీ, మత, రాజకీయ, కుల, ఆర్థిక భేదాలు మనుషుల్ని విభజిస్తాయి. మనం తోటి మనిషిలో అతడి జాతీయతను, ప్రాంతీయతను, అతని రాజకీయ పార్టీని, కులాన్ని, అతను తినే ఆహారాన్ని చూస్తాం. ఈ విభజనల వల్ల మన మనసులో ఎదుటి వ్యక్తి పట్ల ఒక ఫొటో లాంటి అభిప్రాయ చిత్రం ఏర్పడుతుంది. మనం ఎదుటివాడిలో ఈ అభిప్రాయ చిత్రాన్నే చూస్తాం కానీ అసలు మనిషిని చూడం. ఇది ఇంకొక విధమైన విభజన. సజీవమైన మనిషి నిరంతరం మారుతూ ఉంటాడు. మన మనస్సులో ఉన్న అభిప్రాయ చిత్రం నిర్జీవమైనది. ఈ రెండిటికీ మధ్య ఉండే భేదం ఆశాభంగానికి, ఘర్షణకు, చివరకు హింసకు దారి తీస్తుంది. తమ పిల్లల తెలివితేటలమీద అచంచలమైన నమ్మకం ఉన్న తల్లితండ్రులు, వారి ఆశలను భంగపరిచే పిల్లలు... మనం తరచుగా వినే వార్తల్లో ఆత్మహత్యలు. అంతేకాదు, "మన మనసు స్వరూపంలో కూడా నిరంతరం 'నేను-నువ్వు', 'నేను-ఇతరులు', 'నేను-బహిఃప్రపంచం' అనే ద్వైతం, విభజన ప్రచ్ఛన్నంగా ఉంటుంది. ఎక్కడ విభజన ఉంటుందో అక్కడ హింస ఉండి తీరుతుంది" అని కృష్ణమూర్తి నొక్కి చెప్పారు.

> భారతీయ తత్త్వశాస్త్రానికి 'దర్శనం' అని పేరు. అంటే సత్యాన్వేషణలో ఆలోచనకన్నా చూడడానికి, అంటే దర్శించడానికి తత్త్వశాస్త్రం ఎక్కువ విలువ ఇచ్చింది.

ఆలోచన... దర్శనం

హింసను తిరస్కరించి, అహింసను ఒక నైతిక విలువగా, ఒక ఆధ్యాత్మిక సాధనగా నిత్య జీవితంలో అనుసరించడం నిరర్థకం. వివిధ మతాలే కాకుండా అనేక రకాల ఇజాలు కూడా అహింసను ఆరాధిస్తాయి, కానీ మనుషులను ఏమాత్రం మార్చలేకపోయాయి. ఇవన్నీ హింసను, దాని పుట్టుకను సమగ్రంగా అర్థం చేసుకొనే బదులు... ఏదో ఒక కోణం లోంచి ఒక భాగాన్ని మాత్రమే చూస్తాయి. లేదా దాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తాయి. అందువల్ల విఫలమవుతాయి. "మనలో ఉండే విభజనల వల్ల జన్మిస్తున్న హింసను సమర్థించకుండా, గర్హించకుండా... పదదాలలాంటి మన అనుభవాలను, సిద్ధాంతాలను, నియమాలను, అభిప్రాయ చిత్రాలను... అంటే ఆలోచనలను, అసలు ఆలోచించే ప్రక్రియను సంపూర్ణంగా పక్కకు తోసేసి... హింసను ప్రత్యక్షంగా చూడగలమా?' అన్నదే ప్రశ్న. అటువంటి దృష్టికి ఉండే శక్తి వల్ల మనం హింసను అధిగమించగలుగుతాం" అంటారు కృష్ణమూర్తి. అంటే హింసను అధిగమించడం ఒక దర్శించే ప్రక్రియ. భారతీయ తత్త్వశాస్త్రానికి 'దర్శనం' అని పేరు. అంటే సత్యాన్వేషణలో ఆలోచనకన్నా చూడడానికి, అంటే దర్శించడానికి తత్త్వశాస్త్రం ఎక్కువ విలువ ఇచ్చింది. 'దర్శనం' అనే సంస్కృత పదంతో యూరోపియన్ భాషల్లోని 'థియరీ' (నిర్వచనం), 'థియేటర్' (నాటక రంగస్థలం) ముడిపడి ఉన్నాయి. ఈ రెండు పదాలకు 'దర్శనం, చూడడం' అని అర్థం. జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతంలో 'చూచుట' అంటే 'దర్శించుట' అనేది ఒక కీలకమైన ప్రక్రియ

- గుంటూరు వనమాలి www.gunturu.de

(డిసెంబర్ 29న హైదరాబాద్‌లోని ఐఎఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో గుంటూరు వనమాలి రచించిన 'నేను నా గురువు - అనుభవాల సుడిగుండంలో భగవంతుడి ప్రతిబింబం" అనే పుస్తకావిష్కరణ జరుగుతుంది)

గీతాసారం

మరణం ఒక భ్రమ

య ఏనం వేత్తి హంతారమ్ యశ్చైనం మన్యతే హతం
ఉభౌ తౌ న విజానీతో, నాయం హంతి, న హన్యతే...
న జాయతే, మ్రియతే వా కదాచి.. న్నాయం భూత్వా భవితా వా న భూయః
అజో నిత్య శ్శాశ్వతోయం పురాణో... న హన్యతే హన్యమానే శరీరే...



భగవద్గీతలోని రెండవ అధ్యాయమైన 'సాంఖ్యయోగం'లోని ఈ శ్లోకాల్లో ఆత్మ గురించి శ్రీకృష్ణుడు వివరించాడు. "ఆత్మ దేన్నీ చంపదు, దేనివల్లా మరణించదు. అజ్ఞానులు మాత్రమే అందుకు భిన్నంగా ఆలోచిస్తారు. ఆత్మ పుట్టుకలేనిది, శాశ్వతమైనది, మార్పులేనిది, పురాతనమైనది. మనం చిరిగిపోయిన, పాతవి అయిన వస్త్రాలను వదిలేసి, కొత్తవి ధరించినట్టే... భౌతిక దేహాలను ఆత్మ మారుస్తుంది" అని ఆయన చెప్పాడు.

సాంకేతిక భాషలో దీన్ని 'శక్తి పరిరక్షణ సూత్రం' (లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ), ద్రవ్యరాశి, శక్తి తాలూకు 'పరస్పర మార్పిడి సూత్రం' (ప్రిన్సిపల్ ఆఫ్ ఇంటర్-కన్వర్టబిలిటీ ఆఫ్ మాస్ అండ్ ఎనర్జీ)ల ద్వారా బాగా అర్థం చేసుకోవచ్చు. ఆత్మను శక్తితో పోల్చి పరిశీలించినప్పుడు... శ్రీకృష్ణ భగవానుడి మాటలు మరింత స్పష్టమవుతాయి. శక్తి పరిరక్షణ సూత్రం ప్రకారం... శక్తిని సృష్టించలేం. నాశనం చేయలేం. కానీ ఒక రూపం నుంచి మరొక రూపానికి మార్చగలం. ఉదాహరణకు ఉష్ణ శక్తి కేంద్రాలు (థర్మల్ పవర్ స్టేషన్లు) ఉష్ణ శక్తిని విద్యుత్ శక్తిగా మారుస్తాయి. ఒక బల్బు విద్యుత్ శక్తిని కాంతిగా మారుస్తుంది. కాబట్టి అక్కడ కేవలం శక్తి మార్పిడి చెందుతోంది తప్ప నాశనం కావడం లేదు. బల్బు జీవితకాలం పరిమితం. అది కాలిపోతే కొత్త బల్బును పెడతాం. కానీ విద్యుత్ అలాగే ఉంటుంది. ఇది జీర్ణమైన వస్త్రాలను విడిచిపెట్టి, కొత్తవాటిని తొడుక్కోవడం లాంటిది.

మనకు మరణం ఒక అనుమానం మాత్రమే తప్ప అనుభవం కాదు. అంటే ఇతరులు చనిపోవడం చూసినప్పుడు... మనందరం కూడా ఏదో ఒక రోజు మరణిస్తామని అనుమానిస్తాం. చావు గురించి మనకు తెలిసింది, మనం అర్థం చేసుకున్నది... దేహం కదలకపోవడం, ఇంద్రియాలు పనిచేయకపోవడం మాత్రమే. మన భౌతిక మరణం గురించి తెలుసుకొనే అవకాశం కానీ, దాన్ని అనుభూతి చెందే మార్గం కానీ మనకు తెలీదు. మనందరికీ మరణం తథ్యమని అనుకుంటాం. మన జీవితాలు మరణం చుట్టూ, దానికి సంబంధించిన భయాల చుట్టూ తిరుగుతాయి. అయితే "ఏదైనా సాధ్యమే కానీ మరణం సాధ్యం కాదు. ఎందుకంటే అది ఒక భ్రమ" అంటాడు శ్రీకృష్ణుడు. వస్త్రాలు చిరిగిపోయినప్పుడు అవి మనల్ని పరిసరాల నుంచి రక్షించలేవు. అందుకే కొత్తవాటిని వేసుకుంటాం. అలాగే మన భౌతిక దేహం దాని ధర్మాలను నిర్వహించలేనప్పుడు... మార్పునకు గురవుతుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సమాచారం



చతురాయతన సహిత శత చండీయాగం

తెలంగాణలోని యాదాద్రి జిల్లాలోని కొలనుపాక గ్రామంలో దేశీయ గోవుల సంరక్షణ కోసం కృషి చేస్తున్న శ్రీ మాతా పితృ గోక్షేత్రంలో 'చతురానన సహిత శత చండీ యాగం' వచ్చేనెల (జనవరి) ఎనిమిది నుంచి 12వ తేదీ వరకు జరుగుతుంది. ఈ యాగాన్ని హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి ప్రారంభిస్తారు. ప్రతిరోజూ ఉదయం గోపూజ, వేదస్వస్తితో మొదలయ్యే కార్యక్రమాలు రాత్రి వరకూ జరుగుతాయి. రెండో రోజైన 9వ తేదీన శ్రీలక్ష్మీనారసింహ, సుదర్శన హోమం, పవమాన హోమం నిర్వహిస్తారు. కాకినాడ శ్రీపీఠానికి చెందిన శ్రీ పరిపూర్ణానందస్వామి అనుగ్రహభాషణం చేస్తారు. మూడోరోజైన 10వ తేదీన అరుణ హోమం జరుగుతుంది. ఆదిలాబాద్ శ్రీ గోపాలకృష్ణ మఠానికి చెందిన యోగానంద సరస్వతి స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తారు. నాలుగో రోజైన 11వ తేదీన రుద్ర హోమాన్ని నిర్వహిస్తారు. చివరిరోజైన 12వ తేదీన పూర్ణాహుతి తదితరాలతో ముగిసే కార్యక్రమానికి తెలంగాణ ముఖ్య కార్యదర్శి ఎం.శాంతికుమారి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. వీటితోపాటు నిత్యం శ్రీగోపాలకృష్ణస్వామికి అభిషేకాలు, శ్రీలలితాదేవి లక్ష కుంకుమార్చన లాంటి కార్యక్రమాలు ఉంటాయి. ఈ యాగానికి పులి సీతారామశర్మ ఆధ్వర్యం వహిస్తారు. యాగంలో పాల్గొనాలనుకొనేవారు 7569634125 ఫోన్‌నెంబర్‌లో నిర్వాహకులను సంప్రదించవచ్చు.

ముత్యాల ముగ్గు


మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

15 చుక్కలు
వరుస వచ్చేవరకు
15x1x1



పూజారి విజయ, నల్లగొండ

వ్యక్తిత్వ వికాసమార్గం... భక్తి

వికాసం

మానవ ప్రయత్నంతోపాటు దైవానుగ్రహం కూడా కలిసివస్తేనే మనుషులు ఏదైనా సాధించగలరు. దేవాలయాలు భక్తి, వైరాగ్య భావనలకు ప్రతీకలు. శ్రీకృష్ణ దేవరాయల అష్ట దిగ్గజాలలో ధూర్జటి ఒక ప్రధాన కవి. ఆయన 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం', 'శ్రీకాళహస్తీశ్వర శతకం' అనే రెండు మహోన్నత రచనలు చేశాడు. శివనామ స్మరణ వల్లనే సర్వం స్వాధీనమవుతాయని నమ్మిన భక్త మహాకవి ధూర్జటి. భక్తిమార్గం ద్వారా వ్యక్తిత్వ వికాసం కూడా సాధ్యమవుతుందని అతను విశ్వసించాడు.

యోగ పంచాక్షరి

'నమఃశ్శివాయ'... ఇది పంచాక్షరి మంత్రంగా ప్రసిద్ధి చెందింది. జల, వాయు, శబ్ద కాలుష్యాల మాదిరిగానే... కన్ను, చెవి, నాలుక, ముక్కు, చర్మం ద్వారా హానికరమైనవి కొన్ని లోపలికి ప్రవేశించి, మనసు కలుషితమవుతుంది. ఏకాగ్రతకు భంగం కలుగుతుంది. ఇటువంటి సందర్భాలలో ఇంద్రియ కాలుష్యానికి విరుగుడుగా... శివ పంచాక్షరిని 'యోగ పంచాక్షరి'గా రమణ మహర్షి ప్రతిపాదించారు. అంటే ఇంద్రియాలను జయించినవారికి పరమేశ్వరునితో అనుసంధాన యోగం సిద్ధిస్తుంది. కాబట్టే శివ పంచాక్షరిని యోగ పంచాక్షరిగా సూత్రీకరించారు. మరొక విరుగుడు శివానందలహరి. ఎంతో ఏకాగ్రతను సాధించగలిగే మధుర, మనోహర శివస్తుతే కాకుండా... ఇది పరమ శివుడి జటాఝూటం పైనుంచి భక్తుల హృదయ సరోవరానికి చేరే గంగానది.



బలి వృత్తాంతం

ఈ లోకంలో ఎవరూ శాశ్వతంగా ఉండిపోరు. సంపదలు, పదవులు శాశ్వతం కాదు. దురాశ వదిలి, ఉన్నదానితో సంతృప్తి చెంది... కీర్తి ప్రతిష్ఠలు పెంచుకోవాలి. శక్తిమేరకు దానధర్మాలు చేయాలి. రాక్షస రాజైన బలి చక్రవర్తి పూర్వం నర్మదానదీ తీరంలోని భృగుకచ్ఛం అనే ప్రాంతంలో తపస్సు చేస్తూ ఉండగా... అది తెలుసుకున్న వామనుడు ఆ ప్రదేశానికి వెళ్ళాడు. దివ్యమైన తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ వామన బ్రహ్మచారికి బలి చక్రవర్తి ఎంతో వినయ విధేయతలతో స్వాగతం పలికాడు. సముచితమైన ఆసనం మీద కూర్చోబెట్టి "ఏం కావాలో కోరుకోండి. దానంగా ఇస్తాను" అని చెప్పాడు. దానికి సమాధానంగా వామనుడు మూడు అడుగుల నేలను మాత్రమే దానంగా ఇమ్మని కోరుకున్నాడు. తాను తలచుకుంటే ఈ భూమండలాన్నే దానంగా ఇవ్వగలనని బలి చక్రవర్తి చెప్పగా... వామనుడు మందహాస వదనంతో తాను నిలవడానికి మూడు అడుగుల నేల చాలు, అదే ఇవ్వాలని అడిగాడు. చేసేదే లేక "సరే" అని బలిచక్రవర్తి వాగ్దానం చేశాడు. దానవ గురువైన శుక్రాచార్యుడు ఇదంతా గ్రహించి, బలిచక్రవర్తిని వద్దని వారించాడు. తను చేసిన వాగ్దానాన్ని ప్రాణం పోయినా తప్పనని చెప్పి... భూమిని దానం చెయ్యడానికి బలి సంసిద్ధుడయ్యాడు. ఆ వెంటనే వామనుడు త్రివిక్రముడిగా భూమండలం అంతా వ్యాపించి ఒక పాదం మోపాడు. రెండో పాదంతో స్వర్గమంతా ఆక్రమించాడు. మూడో పాదాన్ని బలి చక్రవర్తి తలపై పెట్టి అణగదొక్కాడు. కాబట్టి శక్తిని మించి ఏ పనీ చేయరాదని దీని ద్వారా మనకు తెలుస్తోంది.

శరణాగతితో దైవానుగ్రహం

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సత్యహరిశ్చంద్రుడు, హనుమంతుడు, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి... వీరి జీవితాలు మనకు ఆదర్శప్రాయమే కాదు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదం చేస్తాయి. భగవద్గీత కూడా ఒక వ్యక్తిత్వ వికాస శిక్షణ గ్రంథం. అలాగే 1893 సెప్టెంబరులో షికాగో నగరంలో వివేకానందుడు చేసిన ఉపన్యాసం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక చింతనకు దర్పణంగా నిలిచింది. జాతి మొత్తాన్ని ఉత్తేజపరచిన చారిత్రాత్మక మహోపన్యాసంగా చెరగని ముద్ర వేసింది. గజేంద్రుడి మొర ఆలకించి... మహా విష్ణువు వైకుంఠం నుంచి తరలి వచ్చి, మొసలిని మట్టుపెట్టిన సందర్భం ద్వారా, శరణాగతి కోరిన ద్రౌపదిని శ్రీకృష్ణ భగవానుడు రక్షించిన సంఘటన ద్వారా దైవానుగ్రహం ఎంతటిదో నిరూపితమవుతోంది. మనల్ని అన్ని రకాల కష్టాలనుంచి రక్షించే దైవం ఉన్నాడనే భావన, నమ్మకం, మన పనిలో నిబద్ధత, దురాశ లేకుండా ఉండడం... ఇవన్నీ మనకు ఎంతో ధైర్యాన్ని కలుగజేస్తాయి. కష్టాలు ఎదురై, విపత్కర పరిస్థితిలో ఉన్నప్పుడు... దైవాన్ని శరణు వేడి ప్రార్థిస్తే... మనకు లభించే ధైర్యమే విజయానికి సోపానం. అదే మనకు శ్రీరామరక్ష.

• శ్రీగిరి గోపాలకృష్ణ

రాష్ట్రంపై వైసీపీ మోపిన విద్యుత్ భారం 1.30 లక్షల కోట్లు

- ఏసు శిలువ మోసినట్లు జగన్ పాపాల భారాన్ని బాబు మోస్తున్నారు: టీడీపీ

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంపై మోపిన విద్యుత్ భారం రూ.1.30 లక్షల కోట్లని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. ఏసు శిలువ మోసినట్లు జగన్ పాపాల భారాన్ని చంద్రబాబు మోస్తున్నారని ఆ పార్టీ వ్యాఖ్యానించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య గురువారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ చేతగాని పాలన వల్ల వినియోగదారులపై పడిన విద్యుత్ చార్జీల భారం రూ.32 వేల కోట్లు. విద్యుత్ సంస్థల పేరుతో జగన్ సర్కారు తెచ్చి ఇతరత్రా అవసరాలకు వాడుకొన్న అప్పులు రూ.50 వేల కోట్లు. విజయవాడ, కృష్ణపట్నం థర్మల్ కేంద్రాల విస్తరణ పనులు కావాలని జాప్యం చేయడం వల్ల అంచనాలు పెరిగి ప్రజలపై పడిన భారం రూ.12 వేల కోట్లు. పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం వల్ల పడిన భారం రూ.5,000 కోట్లు. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లను ఎడాపెడా చేయడం వల్ల కలిగిన నష్టం రూ.3,000 కోట్లు. అధిక ధరలకు సెకీ నుంచి సౌర విద్యుత్ కొనుగోలు చేయడానికి కుదుర్చుకొన్న ఒప్పందం వల్ల ఒకో ఏడాదికి పడే భారం రూ.3,850 కోట్లు. ఈ ఒప్పందంలో జగన్ రెడ్డి రూ.1700 కోట్లు కొట్టేశారని అమెరికా కోర్టులో కేసు నడుస్తోంది. విద్యుత్ రంగంలో తెచ్చిన అడ్డగోలు అప్పులకు పడిన వడ్డీ భారం రూ.11 వేల కోట్లు. చేతగాని నిర్వహణతో విద్యుత్ సంస్థలకు వచ్చిన నష్టం రూ.10 వేల కోట్లు. బయట విద్యుత్‌ను కొనడం కోసం జెన్ కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం వల్ల కలిగిన నష్టం రూ.3,000 కోట్లు. విజయసాయి రెడ్డి బంధువుల కంపెనీ నుంచి నాసిరకం బొగ్గును కొనుగోలు చేయడం వల్ల జెన్‌కోకు కొన్ని రూ.వందల కోట్ల నష్టం వచ్చింది. ఇవన్నీ కలిపి రూ.1.30 లక్షల కోట్లు అవుతున్నాయి. జగన్ చేసిన పాపాల వల్ల రాష్ట్రంపై పడిన భారం ఇది. వీటన్నింటిపైనా విచారణ జరుగుతోంది. త్వరలోనే జగన్ బండారం బయటపడుతుంది. 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.6,000 కోట్లు, 23- 24 సంవత్సరానికి సంబంధించి రూ.9,500 కోట్ల మేర జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచింది. అవే ఇప్పుడు కరెంటు బిల్లుల్లో వస్తున్నాయి' అని వర్ల అన్నారు.

జగన్ అవినీతి వల్లే విద్యుత్ చార్జీల భారం

- దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి: అచ్చెన్నాయుడు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత సీఎం జగన్మోహన్‌రెడ్డి అడ్డగోలుగా అవినీతికి పాల్పడటం వల్లే రాష్ట్రంలో ప్రజల నడుం విరిగేలా విద్యుత్ చార్జీలు పెరిగాయని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. దీనిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన వైసీపీకి సవాల్ విసిరారు. గురువారం ఆయన ఇక్కడ ఒక ప్రకటన చేశారు. 'ఐదేళ్లపాటు ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని చార్జీలపై ధర్నాలు, ర్యాలీలకు పిలుపు ఇస్తున్నారు? ఐదేళ్లపాటు సీఎం పదవిలో కూర్చుని అవినీతి సంపాదనకు అలవాటు పడిన జగన్ ఆ సంపాదన లేకుండా ఐదు నెలలు కూడా ఉండలేకపోతున్నారు. ఆ అక్కసుతోనే తమ కేడర్‌తో నిరసన కార్యక్రమాలు చేయిస్తున్నారు. 2022-24 మధ్య కాలంలో విద్యుత్ వాడకానికి సంబంధించి కరెంటు చార్జీలు పెంచాలని ఆయన ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపి ఆమోదం తీసుకొంది. రెగ్యులేటరీ కమిషన్ ఆమోదించడం వల్లే పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. అవే ఇప్పుడు బిల్లుల్లో వస్తున్నాయి. చార్జీలు తాను పెంచి వాటికి వ్యతిరేకంగా తానే ధర్నాలు చేయడం ఒక్క జగన్‌కే చెల్లింది. విద్యుత్ చార్జీలు ఎవరు పెంచారో ప్రజల సమక్షంలోనే చర్చించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. వైసీపీ నేతలకు చేతనైతే ముందుకు రావాలి' అని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.



చల్లగా చూడమ్మ గంగమ్మతల్లీ

సునామీల్లాంటి విపత్తులు సంభవించకుండా చల్లగా చూడమ్మా గంగమ్మతల్లీ అని మత్స్యకారులు వేడుకున్నారు. 2004 డిసెంబరు 26న సంభవించిన సునామీ లక్షలాది కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. అలాంటి విపత్తు మరోసారి రాకుండా చూడాలంటూ ఆ మరుసటి ఏడాది నుంచి డిసెంబరు 26న నగరంలో మత్స్యకార మహిళలు తీరానికి చేరుకుని సంద్రానికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం మత్స్యకార మహిళలు పాలు, పసుపు నీటిని నింపిన కలశాలను శిరస్సున మోస్తూ.. పెదజాలారిపేట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఊరేగింపుగా తీరానికి చేరుకున్నారు. కలశాల్లోని నీరు, పాలతో సంద్రానికి అభిషేకించి, పూజలు చేశారు. - పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి



ఆయుష్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు

- మొన్న మందులు మాయమైనట్టు గుర్తింపు
- తాజాగా.. కెమికల్స్ కొనుగోలులో చేతివాటం
- జీవో 53తో ఎస్సీ, ఎస్టీ వైద్యుల హక్కులకు తూట్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆగమేఘాల మీద జీవో జారీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆయుష్ విభాగంలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ శాఖలో అక్రమాలపై ఇప్పటికే జరుగుతున్న విచారణలో రూ.3 కోట్ల విలువైన మందులు మాయమైనట్లు తేలింది. తాజాగా డిస్పెన్సరీలకు అవసరమైన వస్తువులు, కెమికల్స్ కొనుగోలులో కూడా మాజీ అధికారి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై కూడా ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. వీటికి తోడు జీవో 53పై కూడా విచారణ చేయాలని ఆయుష్ విభాగంలో వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశాఖ అధికారులు ఆయుష్, యునాని విభాగంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టులను సరెండర్ చేసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులుగా మార్పు చేశారు. అది కూడా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజునే వైసీపీ సర్కారు ఆగమేఘాల మీద ఈ నిర్ణయం తీసుకుని జీవో జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పోస్టులు సరెండర్ చేయడం సాధ్యం కాదని మార్చి 14న ఆన్‌లైన్ కేబినెట్‌లో పెట్టి ఈ ఫైల్‌కు ఆమోదం తెలిపారు. అనంతరం మార్చి 16న ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యుల పోస్టులను ఆగమేఘాల మీద సరెండర్ చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ఆయుష్ విభాగంలో డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 74 డిస్పెన్సరీల్లో 30 మంది వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. జీవో 53 ద్వారా 28 పోస్టులను ప్రభుత్వానికి సరెండర్ చేసేసి, వాటి స్థానంలో అడ్మినిస్ట్రేటివ్ పోస్టులను తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఈ జీవో ద్వారా క్షేత్రస్థాయిలో రోగులకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు ఎస్సీ, ఎస్టీ వైద్యులు తమ రిజర్వేషన్ కోల్పోతున్నారు. ముఖ్యంగా ఆయుష్ విభాగంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టు చాలా కీలకం. ఈ కేడర్‌కు చెందినవి దాదాపు ఆరుపోస్టులున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఒకే కేడర్‌కు చెందినవి ఐదు పోస్టులకుపైగా ఉంటే రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలులోకి వస్తుంది. ఆయుష్ అధికారులు ఈ విషయాన్ని విస్మరించి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కేడర్‌లో ఉన్న ఆరు పోస్టుల్లో ఒక దాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో ఆ కేడర్ పోస్టుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండాపోయింది. దీంతో ఆయుష్ విభాగం వైద్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ అన్యాయం జరుగుతోంది. మరోవైపు ఆయుష్ విభాగంలో ఒక ఉన్నతాధికారికి, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారి అండదండలు అందించడంతో ఆయుష్‌లో ఏం జరిగినా గత ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరించింది. చివరికి వైద్యులకు తీవ్ర నష్టం జరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. దీనిపై విచారణ చేయాలని, జీవోను రద్దు చేయాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

నియామకాలపైనా ఆరోపణలు..

ఆయుష్ విభాగంలో వైద్యుల పోస్టుల భర్తీకి గత ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆయుర్వేదలో 72, హోమియోలో 60 వైద్యుల పోస్టుల భర్తీకి 2021లో నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పటి నుంచి కోర్టు కేసుల వల్ల భర్తీ ప్రక్రియ ఆలస్యమైంది. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. ఈ నెల 30, 31వ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభిస్తారు. ఈ నియామకాలపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా ఎంపికైన అభ్యర్థి దగ్గర నుంచి ఆయుష్ అధికారులు వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా ఆరోగ్యశాఖలో కొంత మంది అధికారులు ఆయుష్‌ను అవినీతి విభాగంగా మార్చేశారు. కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టి ఈ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.



మంత్రి టీజీ భరత్ కుమార్తె పెళ్లిలో వధూవరులతో సీఎం చంద్రబాబు



వ్యాపారవేత్త లింగమనేని రమేశ్ కుమారుడి పెళ్లిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్

బీసీల స్వయం ఉపాధి పథకాలు

మహిళలకు టైలరింగ్ శిక్షణ

- కుట్టు మిషన్ల పంపిణీకి ఏర్పాట్లు.. అర్హులైన బీసీ, ఈబీసీలకు జనరిక్ షాపులకు ఆర్థిక సాయం

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీల స్వయం ఉపాధి పథకాలను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే పలు పథకాల అమలుకు ప్రణాళికలు రూపొందించి అనుమతి కోసం ముఖ్యమంత్రికి పంపించిన బీసీ సంక్షేమ శాఖ మొదటగా ఒకటి రెండు స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. సుమారు 80 వేల మంది బీసీ, ఈబీసీ మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని మండల కేంద్రాల్లోను, నగరాల్లోను, పట్టణాల్లోను డిమాండ్ ఉన్న చోట జనరిక్ షాపులను నడిపేందుకు యువతకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. స్వయం ఉపాధి రుణాలకు సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసేందుకు ఓబీఎంఎస్ వెబ్‌సైట్‌నూ సిద్ధం చేస్తున్నారు. మరోవైపు శిక్షణ ఇచ్చేందుకు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు. ఒక్కో బీసీ, ఈబీసీ మహిళకు రోజుకు 4 గంటల చొప్పున 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం మండల కేంద్రాల్లో శిక్షణ ఏర్పాట్లు చేయనున్నారు. శిక్షణ అనంతరం వారికి రూ.24,000 విలువ చేసే కుట్టు మిషన్లు అందించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక జనరిక్ షాపును ఏర్పాటు చేయడం ద్వారా స్వయం ఉపాధి కల్పించవచ్చని భావిస్తున్నారు. డీ ఫార్మా, బీ ఫార్మసీ కోర్సు సర్టిఫికెట్ కలిగిన బీసీ, ఈబీసీ యువతను ప్రోత్సహించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక్కో షాపు అభివృద్ధి కోసం బీసీ సంక్షేమ ఆర్థిక సంస్థ రూ.8 లక్షలు అందించనుంది. అందులో రూ.4 లక్షలు సబ్సిడీగా ఇచ్చి, మిగిలిన రూ.4 లక్షలు రుణంగా ఇప్పించాలని నిర్ణయించారు. ఉపాధి పథకాల అమలు చేయాల్సిన పద్ధతులపై మంత్రి సవిత, డైరక్టర్ మల్లికార్జున్, ముఖ్య కార్యదర్శి పోలా భాస్కర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఇప్పటికే పలు దఫాలు సమావేశమై చర్చించారు.

నో బెనిఫిట్!



సినీ ప్రముఖుల సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు, సురేశ్‌బాబు, త్రివిక్రమ్, రాఘవేంద్రరావు, అల్లు అరవింద్ తదితరులు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని ప్రస్తావించిన సీఎం.. బన్నీ తన పేరును మర్చిపోవడం వలనే కేసు పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేశారని, తాను ఆ స్థాయిని ఎప్పుడో దాటివచ్చేశానని పేర్కొన్నారు. "ఆ తప్పుడు ప్రచారాన్ని మీరెందుకు ఖండించలేదు?" అని ఇండస్ట్రీ పెద్దలను రేవంత్ సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తున్నామని.. పరిశ్రమ తరఫున కూడా ఒక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో పలువురు సినిమా ప్రముఖులు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉన్నారు. పరిశ్రమ సమస్యలతోపాటు పలు అంశాలపై సినీ ప్రముఖులు తమ అభిప్రాయాలను రేవంత్‌కు తెలిపారు. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి.. తమ ప్రభుత్వం పరిశ్రమకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సినిమా స్టూడియోలకు స్థలాలు, పరిశ్రమవారికి నివాస స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలను గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే అందించాయని గుర్తుచేశారు. అదే సహకారాన్ని, ఆ వారసత్వాన్ని తాము కూడా కొనసాగిస్తామని భరోసానిచ్చారు. తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, పరిశ్రమ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలు ఎంత ముఖ్యమో.. సినీ రంగం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని తెలిపారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ప్రభుత్వం తరఫున అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి 'గద్దర్' పేరిట అవార్డులను ఇచ్చేలా కొత్త ఒరవడిని తీసుకొచ్చామని.. ప్రభుత్వానికి, పరిశ్రమకు అనుసంధానకర్తగా ఉండేందుకు దిల్‌రాజును ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తుచేశారు. దేశంలోని కాస్మోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ ఉత్తమమైనదని.. ఇక నుంచి హాలీవుడ్, బాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు చేపడుతామని చెప్పారు. ఇందుకోసం త్వరలో హైదరాబాద్‌లో పెద్ద సదస్సు ఏర్పాటుచేసి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని.. గంజాయి, డ్రగ్స్ నిరోధంతో పాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని సూచించారు. "సినిమా వాళ్లు ఫంక్షన్లు చేసుకోవచ్చు మాకు ఏమీ అభ్యంతరం లేదు, అన్ని అనుమతులూ ఇస్తాం. కానీ అభిమానులను నియంత్రించే వ్యవహారాన్ని నిర్వాహకులు, సెలబ్రిటీలే చూసుకోవాలి. బౌన్సర్లు పోలీసు అధికారులనే అడ్డుకుంటున్నారు. దానిని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అలా అడ్డుకుంటే బౌన్సర్లతో పాటు.. సెలబ్రిటీలపైనా కేసులు పెడతాం" అని కూడా సీఎం అన్నట్టు సమాచారం.

అది నా బాధ్యత

సినీ పరిశ్రమ అభివృద్ధికి మొదటి తరంలో నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో చంద్రబాబు, వైఎస్ సహకరించారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూడో తరంలో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సినీ కార్మికుల సంక్షేమానికి ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో చిరంజీవి కష్టపడి కిందిస్థాయి నుంచి ఎదుగుతూ మెగాస్టార్ స్థాయికి చేరారని, తాను కూడా కింది స్థాయి నుంచి సీఎం స్థాయి వరకు ఎదిగానని అన్నారు. సినిమా వారికి రాజకీయాలతో సంబంధంలేదని, ఆ సంగతి తాము చూసుకుంటామని సీఎం ఒక దశలో కొంత ఘాటుగా చెప్పినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత తనపై ఉందని.. అందరినీ సమానంగా చూడడమే తప్ప, ఎవరిపైనా తనకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవని ఈ భేటీలో ఆయన స్పష్టం చేశారు. ఒక్క తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికీ ఇక్కడ అవకాశం ఉండేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సినీ పరిశ్రమకు పిలుపునిచ్చారు.

ఆ ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దు

అల్లు అర్జున్, రామ్‌చరణ్, రానా చిన్నప్పటి నుంచి తనకు తెలుసని.. ఇప్పుడు సూపర్‌స్టార్లుగా ఎదిగిన ఆ ముగ్గుర్నీ చూస్తుంటే సంతోషంతోపాటు గర్వంగా కూడా ఉందని సీఎం పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 8 సినిమాలకు ప్రత్యేక జీవోలు ఇచ్చిందని, 'పుష్ప' సినిమాకు పోలీసు భద్రత ఇచ్చామని గుర్తుచేశారు. అయినా.. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోందని.. అలాంటి ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. కాగా.. సినిమాలకు పెద్దగా లాభాలు లేకపోయినా నిర్మాతలు ఇండస్ట్రీపై ప్రేమతో చిత్రాలు తీస్తున్నారని, రాష్ట్రంలో 300కు పైగా సింగిల్ థియేటర్లు మూతపడ్డాయని సినీ ప్రముఖులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పెద్ద మనసు చేసుకోవాలి

వేల కోట్ల రూపాయలు వెచ్చించి సినిమాలు తీస్తున్నారు.. కాబట్టి, పెద్ద సినిమాల విషయంలో మీరు కొంచెం పెద్ద మనసు చేసుకోవాలి. మొదటి వారం కొంచెం వెసులుబాటు కల్పించాలి. సంధ్య థియేటర్ దగ్గర చోటుచేసుకున్న ఘటన ఎంతగానో కలచివేసింది. - మురళీమోహన్, నిర్మాత

మళ్లీ జరగకుండా చూసుకుంటాం

'పుష్ప-2' విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర అనుకోని ఘటన జరిగింది. అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సినిమాలకు హైదరాబాద్ వాతావరణం బాగుంటుంది. ముంబై నుంచి కూడా ఇక్కడకు వస్తున్నారు. దీన్ని మరింత బలోపేతం చేసేలా చూస్తాం. - అల్లు అరవింద్, నిర్మాత

స్టూడియోల్లో పెద్దగా లాభాలు లేవు

నిర్మాతలు బాగుంటేనే మేం బాగుంటాం. స్టూడియోల్లో పెద్దగా లాభాలు రావట్లేదు. అక్కినేని నాగేశ్వరావు హయాంలో ఇక్కడ స్టూడియోలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు ప్రపంచ సినిమా రంగానికి హైదరాబాద్ రాజధాని కావాలనేదే మా కోరిక.

- నాగార్జున, నటుడు

బాలల చిత్రోత్సవం నిర్వహించాలి

తెలంగాణలో సినిమా చిత్రీకరణకు అవకాశాలు బాగున్నాయి. గత సీఎంలందరూ పరిశ్రమను బాగా చూసుకున్నారు. ప్రస్తుత సర్కారూ మాకు ప్రోత్సాహాన్నిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా బాలల చిత్రోత్సవాన్ని నిర్వహించాలని కోరుతున్నాం.

- రాఘవేంద్రరావు, దర్శకుడు

అమెజాన్, నెట్‌ఫ్లిక్స్‌కు కేరాఫ్‌గా...

సినీపరిశ్రమ.. రాజకీయాలకు చాలా దూరంగా ఉంటోంది. గత ప్రభుత్వాల సహాయంతోనే అప్పట్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయస్థాయిలో చిత్రాలకు గమ్యస్థానంగా చేయాలన్నదే మా లక్ష్యం. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ లాంటి చాలా ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ చిరునామాగా మారాలి.

- డి.సురేష్‌బాబు, నిర్మాత

మరింత బలోపేతం అవుతాం..

గతంలో సీఎంగా వ్యవహరించిన మర్రి చెన్నారెడ్డి సహా ఆ సమయంలో ఎంతో మంది అందించిన సహకారం వలనే చెన్నై నుంచి సినీ ఇండస్ట్రీ హైదరాబాద్‌కు వచ్చింది. ఇక్కడ అవకాశాలు బాగున్నాయి. ముంబై నుంచి బాలీవుడ్ వాళ్లు కూడా వస్తున్నారు. పరిశ్రమను మరింత బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తాం.

- త్రివిక్రమ్, దర్శకుడు

ఐటీ, ఫార్మాలానే సినీ పరిశ్రమకూ సీఎం సహకరిస్తామన్నారు: దిల్ రాజు

హైదరాబాద్: బెనిఫిట్ షోలు, టిక్కెట్ ధరల పెంపు అనేది చిన్న విషయం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమాను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ ఎజెండా అని టాలీవుడ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్ రాజు మీడియాతో అన్నారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయిలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి చిత్ర పరిశ్రమ, ప్రభుత్వం కలసి పని చేయాలని సీఎం సూచించారని తెలిపారు. హైదరాబాద్‌లో తెలుగుతోపాటు బాలీవుడ్, తమిళ్, కన్నడ, ఇతర భాషా చిత్రాల షూటింగ్‌లు కూడా జరుగుతున్నాయి, భారతీయ సినిమాలే కాదు హాలీవుడ్ చిత్రాలు కూడా ఇక్కడ షూటింగ్ చేసేలా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఇండస్ట్రీ నుంచి సలహాలు ఇవ్వాలని సీఎం కోరినట్లు ఆయన చెప్పారు. చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను ఒక ఇంటర్నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని దిల్ రాజు అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో, ప్రభుత్వ అభివృద్ధి ప్రచారాల్లో ఇండస్ట్రీ నుంచి భాగస్వామం కావాలని సీఎం అడిగారని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు మా నుంచి సహకారం ఉంటుందని చెప్పామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ఐటీ ఫార్మా రంగాలు ఎంత కీలకమో సినీ పరిశ్రమ కూడా అంతే కీలకమని సీఎం అన్నారని పేర్కొన్నారు. ఈ మధ్య జరిగిన అనుకోని సంఘటన వల్ల సినీ ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య కొంత గ్యాప్ పెరిగిందనే అపోహ తలెత్తిందని చెప్పారు.

తేడా వస్తే కేసులే: డీజీపీ జితేందర్



సినిమా వాళ్లు నిర్వహించుకునే ఫంక్షన్లకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని తెలంగాణ డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. అయితే బౌన్సర్ల సంస్కృతి సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తేడా వస్తే బౌన్సర్లపైనే కాక నిర్వాహకులపైనా కేసులు, చర్యలు ఉంటాయని డీజీపీ హెచ్చరించారు.

ఐదు రోజులుగా శ్రీ తేజ్‌కు జ్వరం

హైదరాబాద్ సిటీ/బోయిన్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఐదు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నాడని వైద్యులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై గురువారం కిమ్స్ వైద్యులు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. జ్వరం మినహా బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వెంటిలేటర్ సాయం లేకుండా శ్వాస తీసుకుంటున్నాడని వారు వివరించారు. శ్రీతేజ్ నాడి సంబంధిత సమస్యను ఎదుర్కొంటున్నాడని వైద్యులు తెలిపారు.

రేవంత్ ప్రభుత్వం టాలీవుడ్‌ను టార్గెట్ చేసింది

- బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ

న్యూఢిల్లీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలుగు చలన చిత్ర పరిశ్రమ(టాలీవుడ్)ను టార్గెట్ చేసిందని బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ ఆరోపించారు. టాలీవుడ్ నటులు, నిర్మాతలను నియంత్రించేందుకు, వారి నుంచి బలవంతంగా డబ్బును వసూలు చేసేందుకు సీఎం రేవంత్ చేసిన ప్రయత్నాలను వారు అడ్డుకోవడంతోనే రాష్ట్రప్రభుత్వం వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందని అన్నారు. నాగార్జునకు చెందిన కన్వెన్షన్ కూల్చివేతతో ఈ వివాదం మొదలైందని, ఆయన మాజీ కోడలు, నటి సమంతపై ఓ మహిళా మంత్రి వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని, మోహన్‌బాబు కుమారుడిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారనే ప్రచారం జరిగిందని తెలిపారు. తాజాగా నటుడు అల్లు అర్జున్ చిక్కుల్లో పడ్డారని అన్నారు. టాలీవుడ్ సినీ ముఖ్యులు, ఫైనాన్సియర్లు సీఎంను కలవడానికి సిద్ధపడటంతో ఆయన ఒత్తిడి ఫలించినట్లు సంకేతాలు అందుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా చెప్పుకోదగ్గ విజయాలేమీ సాధించని రేవంత్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని అమిత్ మాలవీయ విమర్శించారు. ప్రత్యామ్నాయంగా బీజేపీ సమాయత్తమవుతున్న నేపథ్యంలో తెలంగాణలో కొత్త అధ్యాయానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోందన్నారు.



భారీ జెండాతో విజయవాడలో సీపీఐ కార్యకర్తల ర్యాలీ

సమ సమాజ స్థాపనకు ఉద్యమించాలి

- సీపీఐ శత వార్షికోత్సవంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమ సమాజ స్థాపనకు... త్యాగాలు, పోరాటాలకు తిరిగి సమాయత్తం కావాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు గాంధీపార్కు వద్ద గురువారం జరిగిన సీపీఐ శత వార్షికోత్సవ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'బీజేపీ ప్రభుత్వానికి స్వాతంత్ర్య సమరయోధులపై గౌరవం లేదు. రాజ్యాంగంపై విశ్వాసం లేదు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతుంది. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నాం. స్వాతంత్ర్యపోరాటంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉంది. దేశంలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీలుగా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఘనత సాధించాయి' అని రామకృష్ణ అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ... 'దేశంలో నేడు పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతుంది. లక్షల కోట్ల సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోతుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు సీపీఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు.

మన్మోహన్ మరణంపై ప్రముఖుల సంతాప సందేశాలు

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. దేశ ఆర్థికవ్యవస్థను సంస్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, రాజకీయ జీవితం, వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయి

- ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చారు. ఆర్థిక సరళీకరణ రూపశిల్పి. కఠిన నిర్ణయాలతో దేశం ముందుకు సాగేలా చేశారు.

- జగదీప్ ధన్‌ఖడ్, ఉపరాష్ట్రపతి

మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగారు. దేశ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఆయన విశేష కృషి చేశారు

- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

గురువును, మార్గదర్శకుడిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో ఆయన దేశాన్ని నడిపించారు

- రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

దేశం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి.

- మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ చీఫ్

దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులు. ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరత అందరికీ ఆదర్శం

- వెంకయ్య నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి

మన్మోహన్ సింగ్ నిజాయితీ మాకు నిరంతర స్ఫూర్తి. ప్రత్యర్థుల నుంచి వ్యక్తిగత దాడులు జరుగుతున్నా ఆయన దేశ సేవలో అంకితభావంతో నిమగ్నమయ్యారు.

- ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ఎంపీ

1991 నుంచి 2014 వరకు మన్మోహన్ సింగ్ చేసిన సేవలు దేశ చరిత్రలో స్వర్ణ యుగమే. ఆయన వినయవిధేయతలున్న వ్యక్తిని నేను ఇప్పటివరకు కలవలేదు. లభించిన విజయాలు తన వల్లే అని ఆయన ఏనాడూ చెప్పుకోలేదు

- చిదంబరం, మాజీ ఆర్థిక మంత్రి

దేశానికి తీరని లోటు: బాబు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. జ్ఞానం, వినయం, సమగ్రత మూర్తీభవించిన మన్మోహన్‌సింగ్ గొప్ప మేధావి, రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన కుటుంబానికి, అభిమానులకు, ఆత్మీయులకు గురువారం రాత్రి 'ఎక్స్' వేదికగా ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే, మన్మోహన్‌సింగ్ మరణం పట్ల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

పవన్ దిగ్భ్రాంతి

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణల ఆద్యులలో మన్మోహన్ ఒకరు. డాక్టర్ మన్మోహన్ అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా'నని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అనంతలో మన్మోహన్ జ్ఞాపకాలు

» దేశంలో తొలిసారి బండ్లపల్లిలో 'ఉపాధి' ప్రారంభోత్సవం



దేశంలో తొలి జాబ్ కార్డు పొందిన చీమల పెద్దక్క (ఫైల్)

నార్పల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో 2006, ఫిబ్రవరి 2న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దేశంలో తొలిసారిగా ప్రారంభించారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ-1 ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి సీఎం వైఎస్సార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యంత దుర్భిక్ష ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు, కూలీల వలసల నివారణ కోసం ఈ పథకాన్ని దేశంలో మొదటిసారిగా ప్రారంభించారు. మన్మోహన్ మృతితో జిల్లావాసులు ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు కరువుపై పోరాటం చేసేందుకు మద్దతుగా ఉపాధి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు అప్పట్లో ప్రకటించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగం, కూలీలు కరువును జయించడానికి ఎంతగానో తోడ్పడిన పథకం ఇది. యూపీఏ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తరువాత కూడా మాజీ ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ మరోమారు అనంతపురం జిల్లాకు వచ్చారు. ఉపాధి పథకాన్ని ప్రారంభించి పదేళ్ల అయిన సందర్భంగా బండ్లపల్లి గ్రామంలో 2016, ఫిబ్రవరి 2న మరోమారు సభను నిర్వహించారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కాగా, దేశంలోనే మొదటి సారిగా బండ్లపల్లి గ్రామానికి చెందిన చీమల పెద్దక్క అనే మహిళకు తొలి జాబ్‌కార్డును ఉపాధి పథకం ప్రారంభ సభలో నాటి ప్రధాని మన్మోహన్ అందజేశారు. ఈ సభకు బండ్లపల్లి సర్పంచ్ వేల్పుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన చేతనే ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభింపజేశారు. సర్పంచ్‌తో కలిసి రాయలసీమ రాగి సంగటిని మన్మోహన్, సోనియా తిన్నారు.

ఆర్థిక మార్గదర్శి

అస్తమయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన్ను ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు ఆయనను కాపాడడానికి ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని... రాత్రి 9:51 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారని ఎయిమ్స్ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. మన్మోహన్‌సింగ్‌కు భార్య గురుచరణ్, ముగ్గురు కుమార్తెలు ఉపీందర్, అమృత్, దమన్ ఉన్నారు. మన్మోహన్‌ను ఆస్పత్రిలో చేర్పించారన్నవార్త తెలిసిన వెంటనే.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ హుటాహుటిన ఎయిమ్స్‌కు చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇక.. కర్ణాటకలోని బెలగావీలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ.. మన్మోహన్ మరణవార్త తెలియగానే ఢిల్లీకి పయనమయ్యారు. ఆయన గౌరవార్థం.. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సహా వచ్చే ఏడు రోజులపాటు నిర్వహించతలపెట్టిన అన్ని కార్యక్రమాలనూ రద్దు చేసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 2025 జనవరి 3న పార్టీ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమవుతాయని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పటిదాకా పార్టీ జెండాను అవనతం చేస్తామని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా.. మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని గురువారం రాత్రే ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తరలించారు. మన్మోహన్ మృతిపట్ల సంతాపం తెలిపిన ప్రధాని మోదీ.. ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ ఏర్పాట్లపై చర్చించేందుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. కాగా.. ఆయన గౌరవార్థం కేంద్రం ఏడురోజులు జాతీయ సంతాపదినాలుగా ప్రకటించింది.

మోహనా.. మోహనా..

నెహ్రూ అంతటి వ్యక్తే స్వయంగా పిలిచినా.. 'నేను పాఠాలు చెప్పుకొంటాను తప్ప, రాజకీయాల్లోకి రాను' అన్న మన్మోహన్.. ప్రస్తుత పాకిస్థాన్‌లోని గహ్‌లో 1932 సెప్టెంబరు 26న గురుముఖ్ సింగ్ కోహ్లీ, అమృత్‌కౌర్ దంపతులకు జన్మించారు. చిన్నవయసులోనే తల్లి చనిపోవడంతో.. మన్మోహన్ తన అమ్మమ్మ జమ్నాదేవి వద్దే పెరిగారు. చిన్నతనంలో అందరూ ఆయనను ముద్దుగా మోహనా.. మోహనా అని పిలిచేవారు. ఆయన పెరిగిన ఊళ్లో స్కూలు కూడా లేదు. రోజూ స్నేహితుడితో కలిసి 5 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నారు. పదో ఏడు వచ్చేదాకా ఆయన విద్యాభ్యాసం ఉర్దూ మాధ్యమంలోనే జరిగింది. అందుకే.. ఆయన జీవితమంతా తన హిందీ ప్రసంగాలను కూడా ఉర్దూలోనే రాసుకుని చదివేవారు (కొన్నికొన్ని సార్లు తన మాతృభాష అయిన పంజాబీలో రాయడానికి గురుముఖి లిపిని వాడేవారు). దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్థాన్ నుంచి ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరానికి వచ్చింది. ఆ తర్వాత ఏడాదికే.. అంటే 1948లో అమృత్‌సర్‌కు వెళ్లి అక్కడ స్థిరపడింది. మన్మోహన్ అక్కడే హిందూ కాలేజీలో చేరారు. పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ (1952లో), పీజీ (1954లో) పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జి వర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ఆనర్స్ పూర్తిచేశారు. పాఠశాల స్థాయి నుంచి కేంబ్రిడ్జి దాకా.. చదువులో ఆయన ఎప్పుడూ టాపరే. స్కాలర్‌షిప్స్‌తోనే ఆయన చదువులన్నీ సాగాయి. డాక్టరేట్ చేసిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. మానవ జీవితాలను రాజకీయాలు ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని తాను కేంబ్రిడ్జి వర్సిటీలో ఉన్న రోజుల్లోనే తెలుసుకున్నానని మన్మోహన్ 2005లో ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కేంబ్రిడ్జిలో ఉన్నత విద్య పూర్తిచేసుకున్న అనంతరం భారతదేశానికి తిరిగివచ్చిన ఆయన.. పంజాబ్ వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మళ్లీ 1960లో ఇంగ్లండ్‌కు వెళ్లి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో డీఫిల్ చేశారు. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ పెర్ఫార్మెన్స్, 1951-1960, ఎక్స్‌పోర్ట్ ప్రాస్పెక్ట్స్ అండ్ పాలసీ ఇంప్లికేషన్స్' అనే అంశంపై డాక్టొరల్ థీసిస్ రాశారు. దరిమిలా ఆ థీసిస్ ఆధారంగానే.. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టెయిన్డ్ గ్రోత్' అనే పుస్తకం రాశారు. డీఫిల్ పూర్తయ్యాక మళ్లీ ఇండియాకు తిరిగొచ్చి పంజాబ్ వర్సిటీలో రీడర్‌గా పనిచేశారు. 1963 నుంచి 1965 దాకా ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా వ్యవహరించారు. 1966 నుంచి 1969 దాకా 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్'కు పనిచేశారు. ఆర్థికవేత్తగా ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ఎంపీ లలిత్‌నారాయణ్ మిశ్రా.. ఆయన్ను విదేశీ వాణిజ్య శాఖలో సలహాదారుగా నియమించారు. బ్యూరోక్రాట్‌గా మన్మోహన్ ప్రస్థానం అలా ప్రారంభమైంది. 1969 నుంచి 1971 దాకా 'ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో ప్రొఫెసర్‌గా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన పాఠాలు బోధించారాయన.




ప్రభుత్వంలోకి..

1972లో ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారుగా.. 1976లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980-1982 నడుమ ప్రణాళిక సంఘంలో పనిచేసిన మన్మోహన్‌ను.. 1982లో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమించారు. 1985 దాకా ఆయన ఆ పదవిలో కొనసాగారు. 1985-87 నడుమ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1987 నుంచి 1990 దాకా జెనీవాలోని ఎకనమిక్ పాలసీ థింక్ ట్యాంక్ 'సౌత్ కమిషన్'కు సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించారు. 1990 నవంబరులో భారత్‌కు తిరిగొచ్చి.. అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 1991లో ప్రభుత్వం ఆయన్ను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. 1991 జూన్‌లో.. మైనారిటీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు దేశాన్ని సంస్కరణల పథంలో నడపాలంటే మన్మోహన్ వంటి ఆర్థికవేత్త అవసరమని భావించి ఆయనకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు! తొలుత ఆ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా మన్మోహన్‌కు పీవీ తెలియపరచగా.. ఆయన దాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. దాంతో పీవీ.. వెంటనే చక్కగా తయారై రాష్ట్రపతి భవన్‌కు రావాలంటూ మన్మోహన్‌ను ఆదేశించారు. అలా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన మన్మోహన్‌తో మంత్రిగా ప్రమాణం చేయించి.. ఆర్థిక శాఖను అప్పజెప్పారు! ఆయన ఆర్థిక శాఖ పగ్గాలు చేపట్టేనాటికి మన దేశ ద్రవ్యలోటు జీడీపీలో 8.5 శాతానికి.. కరెంటు ఖాతా లోటు 3.5శాతానికి దగ్గర్లో ఉన్నాయి. మన విదేశీ మారక నిల్వలు కేవలం 2వారాల దిగుమతులకు సరిపడా మాత్రమే (దాదాపు 100 కోట్ల డాలర్లు) ఉన్నాయి!! అలాంటి ఆర్థిక వ్యవస్థను ఆయన.. ప్రధాని పీవీ సహకారంతో సంస్కరణల పథంలో నడిపించి గాడిన పెట్టారు. పర్మిట్‌రాజ్‌కు చుక్క పెట్టి.. ఆర్థికవ్యవస్థను సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్‌పీజీ) బాట పట్టించి దేశ ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చేశారు. 2009లో ప్రధానిగా ఆయన తొలి పదవీకాలం పూర్తిచేసే సమయానికి మన విదేశీ మారక నిల్వలు ఏకంగా 600 బిలియన్ డాలర్లకు చేరాయంటే.. నాడు ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలే అందుకు పునాదిరాళ్లనడంలో సందేహం లేదు.

డాక్టర్‌గా వద్దనుకొని.. ఆర్థికవేత్తగా మారి!

ప్రధానిగా, ఆర్థిక శాఖ మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెచ్చిన మన్మోహన్ సింగ్.. తొలుత తండ్రి కోరిక మేరకు డాక్టర్ కావాలని ప్రీ-మెడికల్ కోర్సులో చేరారు. అయితే ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఈ విషయాన్ని మన్మోహన్ కూతురు దమన్ సింగ్ తన పుస్తకమైన 'స్ట్రిక్ట్‌లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గురుశరణ్'లో వెల్లడించారు.



ప్రధానిగా..

అనూహ్య పరిస్థితుల్లో 2004 మే 22న ప్రధాన మంత్రిగా పగ్గాలు చేపట్టిన మన్మోహన్ సింగ్.. 2014 దాకా ఆ పదవిలో కొనసాగారు. ఆర్థిక మంత్రి హోదాలో కొనసాగించిన పాత ఒరవడినే అందిపుచ్చుకుని సంస్కరణల పథంలో ముందుకు సాగారు. దీంతో అనతికాలంలోనే మన ఆర్థిక వృద్ధిరేటు పెరగడం ప్రారంభించి.. 2007లో అత్యధికంగా 9% మైలురాయిని దాటింది. ఆయన హయాంలో వచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం దేశచరిత్రలోనే కొత్త అధ్యాయలను లిఖించాయి! వాజపేయి హయాంలో ప్రారంభించిన స్వర్ణ చతుర్భుజి వంటి కార్యక్రమాలను మన్మోహన్ సర్కారు కొనసాగించడంతో అభివృద్ధి ఎక్కడా కుంటుపడలేదు. 2009లో ఆయన హయాంలోనే విద్యాహక్కుచట్టం అమల్లోకి వచ్చింది. ఏపీ (ఉమ్మడి), బిహార్, గుజరాత్, ఒడిశా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 8 ఐఐటీ విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. అలా పదేళ్లపాటు ప్రధానిగా దేశాన్ని ప్రగతిపథంలో నడిపిన మన్మోహన్ సింగ్ పదవీకాలం 2014 మే 17న ముగిసింది. 1991 అక్టోబరు 1 నుంచి 2024 దాకా 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం.. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీతో ముగిసింది. దేశ తొలి సిక్కు ప్రధానిగా.. నెహ్రూ తర్వాత ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ ప్రధాని పదవి చేపట్టిన తొలి నేతగా.. నెహ్రూ, ఇందిరాగాంధీ, మోదీ తర్వాత ఎక్కువకాలం ప్రధాని పదవిలో ఉన్న నాయకుడిగా.. ఎన్నో ఘనతలు సాధించిన ఆయన దేశ ప్రజల మనోయవనికలపై తనదైన చెరగని ముద్ర వేశారు!

కేంబ్రిడ్జ్‌లో తమాషా

కేంబ్రిడ్జిలో చదువుకునే రోజుల్లో కూడా మన్మోహన్ చాలా సిగ్గరిగా ఉండేవారు. అక్కడ ఉన్నంతకాలం ఆ చలిలో కూడా చన్నీళ్ల స్నానమే చేసేవాడినని ఆయన ఒకసారి బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. "సర్దార్జీని కావడంతో నాకు పొడవాటి జుట్టు ఉండేది. వేడినీళ్ల వస్తున్నప్పుడు అందరూ స్నానాలు చేసేవారు. నేను వారితో కలిసి స్నానం చేయడానికి మొహమాటపడేవాడిని. తలపాగా తీస్తే నా పొడవాటి జుట్టు చూసి హేళన చేస్తారని వాళ్లంతా వెళ్లాక చన్నీళ్లతోనే స్నానం ముగించేవాడిని" అని మన్మోహన్ చెప్పుకొన్నారు.

నిజాయతీకి నిలువెత్తురూపం

నిజాయతీకి, నిబద్ధతకు మన్మోహన్ నిలువెత్తు ప్రతిరూపం అంటారు ప్రముఖ రచయిత కుష్వంత్ సింగ్. "1999లో ఆయన ఒకేసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల్లో పోటీ అంటే మాటలు కాదు. అంతకాలంగా పెద్ద ఉద్యోగాల్లో ఉన్నా ఆయన వద్ద డబ్బు ఉండేది కాదు. ఎన్నికల ఖర్చు కోసం రెండు లక్షలు కావాలని అడిగారు. ఆయన అల్లుడికి ఇచ్చి డబ్బు పంపాను. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఆ మరుసటి రోజే నాకు ఫోన్ చేసి మా ఇంటికి వచ్చారు. డబ్బు నా చేతిలో పెట్టి.. "ఖర్చు కాలేదు. అలానే ఉంది. తీసుకోండి.. థ్యాంక్స్" అని వెళ్లిపోయారు.. అలాంటి మనుషులు అరుదుగా ఉంటారు" అన్నారు కుష్వంత్ సింగ్.

మారుతి 800 రెండు ఫ్లాట్లు

దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉన్నత ఉద్యోగిగా, ఆర్థిక మంత్రిగా, పదేళ్ల ప్రధానిగా ఉన్నా ఆయన సాదాసీదా జీవితం గడిపేందుకే ఇష్టపడేవారు. పాత మారుతి 800 కారు, ఢిల్లీ, చండీఘర్‌లలో రెండు అపార్ట్‌మెంట్లు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిపాజిట్లు.. ఇవే ఆయన సంపాదించుకున్న ఆస్తిపాస్తులు!



మన్మోహన్‌కు మొహం చాటేసిన అధికారులు

బెల్లం చుట్టూ ఈగలు.. అధికారంలో ఉన్న నేతల చుట్టూ అనుచరగణాలు మూగడం నిత్యసత్యం. అదే అధికారం పోయాక.. అప్పటిదాకా చుట్టూ తిరిగినవారే క్షణాల్లో ముఖం చాటేస్తారు. అంతకుముందు వరకూ సెల్యూట్ చేసినవారే.. ఎదురుపడినా చూసీచూడనట్టు వెళ్లిపోతుంటారు. మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కూ అలాంటి అనుభవం ఒకటి ఎదురైంది. బొగ్గు కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొనే సమయంలో.. దానికి సంబంధించిన వివరాల కోసం ఆయన తన హయాంలో పీఎంవోలో పనిచేసిన ఓ కీలక అధికారికి ఫోన్ చేశారు. కానీ, సదరు అధికారి మన్మోహన్ సింగ్ ఫోన్‌కాల్‌కు స్పందించలేదు. పోనీ.. అప్పుడు ఆయన ఏదో బిజీగా ఉండి ఉంటాడని సరిపెట్టుకున్నా.. కనీసం తిరిగి కాల్ కూడా చేయలేదు. దీంతో మన్మోహన్ చాలా బాధపడ్డారు. తనను తాను రక్షించుకోవడానికే ఆ అధికారి మొహం చాటేశారని ఆయన భావించారు. ఇటువంటి సంఘటనలతో ఆయన మనోధైర్యం సడలిందని ఆయన సన్నిహితులు చెబుతారు.

తామరాకుపై నీటిబొట్టు..!

33 ఏళ్లపాటు మన్మోహన్ సచ్ఛీల రాజకీయాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనూహ్యంగా ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టినా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్నే మార్చేశారు! నాటి ప్రధాని పీవీ నరసింహారావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ.. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని గాడిలో పెట్టారు! 'యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' అని.. 'కీలుబొమ్మ' అని రకరకాలుగా విమర్శలు చేసినా పట్టించుకోకుండా.. ప్రధాన మంత్రిగా పదేళ్లపాటు దేశాన్ని సమర్థంగా నడిపించారు. ఆయనే మన్మోహన్‌సింగ్. దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన ఆయన.. 33 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉన్నారు. కానీ, ఏనాడూ ఆ బురదను అంటించుకోలేదు. తామరాకుపై నీటిబొట్టులా.. చాకచక్యంగా వ్యవహరించారు. ఆర్థిక మంత్రి, ప్రధాన మంత్రి, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా.. ఇలా ఏ హోదాలో ఉన్నా తనదైన ముద్ర వేశారు. "1991 జూన్ 21న భారత ప్రధాని పీవీ నరసింహారావు నుంచి ఫోన్ వచ్చింది. మన్మోహన్‌జీ మీరెక్కడున్నారు? అని పీవీ అడిగారు. నేను యూజీసీలో ఉన్నానని చెప్పా. మీకు అలెగ్జాండర్ ఏమీ చెప్పలేదా? అని పీవీ అడిగారు. చెప్పారు కానీ, నేను సీరియస్‌గా తీసుకోలేదని అన్నాను. 'లేదు.. ఇది చాలా సీరియస్, మీరు ఇంటికి వెళ్లి డ్రెస్ చేసుకుని ప్రమాణ స్వీకారానికి రండి' అని పీవీ చెప్పారు" అని తాను ఆర్థిక మంత్రిని ఎలా అయ్యానన్న విషయాన్ని స్వయంగా మన్మోహన్ సింగే వెల్లడించారు. 2018 డిసెంబరులో తన పుస్తకం 'చేంజింగ్ ఇండియా' ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. యూజీసీ ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తుండగా ప్రధాని పీవీ ఫోన్ చేయడంతో వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని మన్మోహన్ చెప్పగా.. సభలో నవ్వులు విరిశాయి. అలా 1991లో అనూహ్యంగా ఆర్థిక మంత్రి అయిన మన్మోహన్ ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ను ఒప్పించి భారత్‌ను ఆర్థిక సుడిగుండం నుంచి బయటపడేశారు. పీవీ ఇచ్చిన మనోధైర్యం వల్లే తాను ఆర్థిక సంస్కరణలను విజయవంతంగా అమలు చేయగలిగానని వెల్లడించారు. భారత ప్రాధాన్యాలకు అనుగుణంగా సంస్కరణలను అమలు చేస్తామంటూ అప్పటి ఐఎంఎఫ్ ఎండీ మైకేల్ కాండెస్సస్‌కు పీవీ చెప్పారన్నారు.



రాజీనామా.. తిరస్కరించిన పీవీ..

పీవీ హయాంలో స్టాక్ మార్కెట్ కుంభకోణంపై నివేదిక సమర్పిస్తూ.. మన్మోహన్ సింగ్ మొద్దు నిద్ర పోతున్నారని జేపీసీ వ్యాఖ్యానించింది. మనస్తాపం చెందిన ఆయన రాజీనామా చేశారు. కానీ, పీవీ దాన్ని ఆమోదించలేదు. పీవీ-మన్మోహన్‌ల అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశాల్లో మన్మోహన్‌పై ఎన్ని విమర్శలు వచ్చినా వాటికి పీవీనే స్వయంగా జవాబిచ్చేవారు.

అనూహ్యంగా ప్రధానిగా బాధ్యతలు..

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు సోనియాగాంధీ అనూహ్యంగా ప్రధాని బాధ్యతలు మన్మోహన్ సింగ్‌కు అప్పగించారు. విదేశీయురాలనే పేరుతో శరద్ పవార్, ములాయంసింగ్ యాదవ్‌లు సోనియా నాయకత్వాన్ని వ్యతిరేకించడం, సోనియా ప్రధాని అయితే తాను గుండు కొట్టించుకుంటానని బీజేపీ నేత సుష్మా స్వరాజ్ హెచ్చరించడంతో ప్రధాని పదవిని స్వీకరించలేదు. పాలనాదక్షుడైన మన్మోహన్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టారు. మన్మోహన్ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై దృష్టి కేంద్రీకరిస్తే.. తెర వెనక కూటమి సర్కారు రాజకీయాలను సోనియా నిర్వహించారు. 2009లో యూపీఏ రెండోసారి గెలిచినప్పుడు కూడా ప్రధాని పదవి ఆశిస్తున్న ప్రణబ్ ముఖర్జీ, చిదంబరాన్ని పక్కనపెట్టిన సోనియా.. మరోసారి మన్మోహన్‌పైనే భరోసా ఉంచారు. ఆయన రెండోసారి ప్రధానిగా ఉన్న కాలంలో 2జీ స్పెక్ట్రమ్ వేలం, బొగ్గు గనుల వేలం తదితర నిర్ణయాల్లో కుంభకోణాలు జరిగాయి. అయితే అదే సమయంలో కుంభకోణాలకు పాల్పడిన మంత్రులు, అధికారులు జైలు పాలైనా మన్మోహన్ సింగ్‌పై ఎలాంటి మచ్చా పడలేదు. రాజకీయాల్లో ప్రవేశించాలని నిర్ణయం తీసుకున్నప్పటి నుంచీ ఆయన తాను చేరిన కాంగ్రెస్ పార్టీకి విధేయంగా పనిచేశారు. తనకంటూ సొంత రాజకీయ బృందాన్ని ఏర్పాటు చేసుకోలేదు. ఏనాడు ఆయన అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు రాలేదు. పార్టీ వ్యవహారాల్లో ఏనాడూ జోక్యం చేసుకోలేదు. సోనియా, ఆమె రాజకీయ బృందం ఓవైపు.. మన్మోహన్ మరోవైపు.. ఎవరి రంగంలో వారు బలంగా పనిచేసేవారు. అదే సమయంలో కేబినెట్ సమావేశాల్లో మన్మోహన్‌దే తుది నిర్ణయంలా ఉండేది. ఆయన్ను సోనియా ఎన్నడూ అగౌరవపరిచిన దాఖలాలు లేవు. అయితే కోర్ గ్రూప్ సమావేశాలు సోనియా నివాసంలో జరిగేవని, కొన్నిసార్లు మన్మోహన్ అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయాలు, నియామకాలు జరిగేవని, ఆయన అసంతృప్తిగా ఉండేవారని ఆయన మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు తన పుస్తకం 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'లో రాశారు. కానీ, మన్మోహన్ అధికార ప్రతినిధి ఈ విషయాలను ఖండించారు.

నాకంటే మన్మోహనే మంచి ప్రధాని..

'నాకంటే మన్మోహన్ సింగ్ మంచి ప్రధాని అవుతారని నాకు తెలుసు. అందుకే నేను ఆ పదవి తీసుకోలేదు' అని సోనియా ఓ సందర్భంలో చెప్పారు. కాంగ్రెస్ 2014లో ఓడినప్పటికీ అందుకు మన్మోహన్‌ను ఎవరూ నిందించలేదు. ఆయన్ను కీలుబొమ్మ అని ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో ఆరోపించినా పట్టించుకోలేదు. చివరిసారిగా 2019లో రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ అనారోగ్యం వల్ల ఎక్కువ రోజులు హాజరు కాలేకపోయారు. చక్రాల కుర్చీలో వచ్చి పార్లమెంటు ఓటింగ్‌లో పాల్గొనేవారు.







ప్రభావతి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఫిర్యాదు ఆధారంగా గుంటూరు, నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్‌లో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని, ఆయన ప్రస్తుతం అందుబాటులో లేనందున విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వ్యాజ్యంపై విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు. తనను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన సీఐడీ పోలీసులతో పాటు తప్పుడు వైద్య నివేదిక అందజేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇటీవల గుంటూరు, నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవినాష్‌రెడ్డి పీఏ బెయిల్‌పై ముగిసిన వాదనలు

వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరువైపుల వాదనలు ముగియడంతో జనవరి 7న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టేలా ప్రేరేపించారనే ఆరోపణలతో పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బండి రాఘవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదయ్యిందని గుర్తు చేశారు. సంబంధిత కోర్టులోనే పిటిషన్ వేసుకోవాలి కదా అని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ నేరుగా ఎలాంటి దూషణలకు పాల్పడలేదని, అందువల్ల ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు చెల్లుబాటు కాదన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదనలు వినిపిస్తూ.. పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో పిటిషనర్ నిందితుడు కాదన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదైన కేసులలో సంబంధిత కోర్టుల్లోనే బెయిల్ లేదా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవాలన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిల్ పిటిషన్లు కొట్టివేయాలని కోరారు.

అమరావతిలో 'అండర్ గ్రౌండ్' దందా



- భూగర్భ విద్యుత్ లైన్‌కు 'హై' టెండర్లు
- ప్రభుత్వానికి రూ.156 కోట్లు నష్టం
- ఇటీవల అత్యధిక ధరలకు టెండర్లు
- కూటమి ప్రభుత్వానికి తెలియకుండా మాయ
- జగన్ హయాంలోని అధికారుల కుట్ర
- తెలంగాణలోని ధరల కంటే చాలా ఎక్కువ
- ట్రాన్స్‌కో తీరుపై సీఆర్‌డీఏకు పక్కా సమాచారం
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం

ఓ వైపు జగన్ సర్కారు మిగిల్చిపోయిన అప్పులు.. మరోవైపు నిధుల కొరత. అయినా రాజధాని అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. కేంద్ర సాయంతో పాటు బ్యాంకు రుణాలు తీసుకుంటూ పనులకు శ్రీకారం చుడుతోంది. ఇటు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు మాత్రం రాజధానిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ టెండర్లలో ప్రభుత్వానికి 156 కోట్లు నష్టం కలిగిస్తున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని కొందరు అధికారులు ఇంకా పాత పోకడలు వీడలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం చేకూర్చేలా, అప్రతిష్ఠ కలిగించేలా ఏపీ ట్రాన్స్‌కో అధికారులు వ్యవహరించారు. ప్రభుత్వానికి తెలియకుండా రాజధాని అమరావతిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు వేయడానికి ఇటీవల అత్యధిక రేట్లతో టెండర్లు పిలిచారు. తద్వారా ప్రభుత్వానికి రూ.150 కోట్లకు పైగా నష్టం కలిగిస్తున్నారు. ఈ ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం సీఆర్‌డీఏ ఉన్నతాధికారులకు తెలియడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా రాజధాని అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు (ఎస్ఎస్ఆర్)ను పెంచేసిన ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఏడాదిన్నరగా వాటిని సవరించలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా పాత పంథానే అనుసరిస్తున్నారు.

ఇదీ విషయం...


సీఆర్‌డీఏ పరిధిలో భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు సెప్టెంబరులో రెండు టెండర్లు పిలిచారు. అండర్ గ్రౌండ్ కాపర్ కేబుల్ ఎక్స్‌ఎల్‌పీఈ 220 కేవీ 1000 స్క్వేర్ ఎంఎం లైన్లను రూ.993.24 కోట్లతో 24 నెలల్లో పూర్తి చేసేందుకు ఒక టెండర్ పిలిచారు. 220 కేవీ జీఐఎస్, 220 కేవీ డీసీ 1000 స్క్వేర్ ఎంఎం ఎక్స్‌ఎల్‌పీఈ లైన్లకు సంబంధించి రూ.253.74 కోట్లతో 18 నెలల్లో పూర్తి చేసేందుకు మరో టెండర్‌ను పిలిచారు. ఈ రెండు టెండర్ల మొత్తం విలువ రూ.1,246.98 కోట్లు. ఈ టెండర్ల రూపకల్పనలో ఏపీ ట్రాన్స్‌కో అధికారులు అడ్డగోలుగా రేట్లు పెంచారన్న ఆరోపణలు వస్తున్నాయి.

హైదరాబాద్‌లో అలా.. ఇక్కడ ఇలా..

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో శివరామపల్లి నుంచి గచ్చిబౌలి వరకు అక్కడి ప్రభుత్వం అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ పనులకు రూ.114.44 కోట్లకు టెండర్లు పిలిచింది. అమరావతిలో తలపెట్టే 1000 స్క్వేర్ ఎంఎం కంటే ఎక్కువగా.. 1,200 స్క్వేర్ ఎంఎం సామర్థ్యంతో కూడిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేయాలి. ఏపీ ట్రాన్స్‌కో టెండర్లలో నిర్దేశించిన యూనిట్ రేటుకు, టీజీ ట్రాన్స్‌కో పిలిచిన రేట్లకు ఎంతో వ్యత్యాసం ఉంది. అమరావతిలో కంటే 20 శాతం అధిక సామర్థ్యంతో కూడిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ కోసం టీజీ ట్రాన్స్‌కో జీఎస్టీతో సహా కిలోమీటరుకు రూ.1.69 కోట్లతో చేపట్టేందుకు యూనిట్ రేటును నిర్దేశించింది. అదే ఏపీ ట్రాన్స్‌కో 20 శాతం తక్కువ సామర్థ్యంతో కూడిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్‌కు సంబంధించి జీఎస్టీతో సహా కిలోమీటరుకు రూ.1.86 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచింది. గచ్చిబౌలిలో టీజీ ట్రాన్స్‌కో టెండర్లు ఇంచుమించుగా ఏపీ ట్రాన్స్‌కో పిలిచిన సమయంలోనే పిలిచారు. ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు వచ్చిందన్న దానిపై ఏపీ ట్రాన్స్‌కో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఏపీ ట్రాన్స్‌కో పిలిచిన 20 శాతం తక్కువ సామర్థ్యం కలిగిన అండర్ గ్రౌండ్ కేబుల్స్ కారణంగా కిలోమీటరుకు రూ.51 లక్షలు తగ్గిస్తే.. మొత్తం 300 కిలోమీటర్లకు రూ.153 కోట్ల మేర ఖర్చు తగ్గాలి.

కేంద్రం ధరల కంటే ఎక్కువ

జూలై 14న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇండికేటివ్ కాస్ట్ మాట్రిక్స్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం చూస్తే 220 కేవీ డీసీ లైన్ అండర్ గ్రౌండ్ కేబుల్ లేయింగ్ కాస్ట్ (ఏడు వైర్లు)ను కిలోమీటరుకు రూ7.2 కోట్లుగా నిర్ణయించారు. కానీ ఏపీ ట్రాన్స్‌కో పిలిచిన ప్రస్తుత టెండర్‌లో కిలోమీటర్ ధర సుమారు రూ.14.5 కోట్లుగా ఉంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన దానికంటే దాదాపు రూ.7 కోట్ల మేర అదనపు రేటుతో టెండర్లు పిలిచారు. టీజీ ట్రాన్స్‌కో ప్రకారం చూస్తే రూ.156 కోట్లు, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రకారం చూస్తే రూ.300 కోట్ల వరకు అదనంగా కోట్ చేస్తూ టెండర్లు పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఈ మేరకు అదనపు భారం పడుతోంది.


ఏపీ ట్రాన్స్‌కో అధిక రేట్లకు పిలిచిన టెండరు నోటిఫికేషన్ కాపీ

పీఎస్ఎల్వీ-సీ60తో జంట ఉపగ్రహాలు

- స్పేస్ డాకింగ్ ప్రయోగానికి ఇస్రో శ్రీకారం

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో మరో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి ఈ నెల 30 పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసీలోకి పంపనుంది. ఈ ప్రయోగం ద్వారా విభిన్న పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టనుంది. దీన్ని స్పేస్ డాకింగ్ ప్రయోగంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించిన రాకెట్ అనుసంధాన పనులతో పాటు శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను కూడా గురువారం పూర్తి చేసినట్లు ఇస్రో అధికారికంగా వెల్లడించింది. ఈ నెల 30వ తేదీ రాత్రి 9.48 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం జరగనుంది. దీని ద్వారా చేసే పరిశోధనలు.. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత్ ఆధ్వర్యంలో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపి.. వాటిని అనుసంధానిస్తూ, విడగొడుతూ ఇస్రో ప్రయోగాలు చేపట్టనుంది. ఈ ఉపగ్రహాలతో పాటు వివిధ రకాల పరిశోధనల కోసం 24 ఉపకరణాలను కూడా పంపుతున్నారు. ఈ మిషన్ విజయవంతమైతే మరిన్ని ప్రయోగాల్లో డాకింగ్ సిస్టమ్‌ను పరిశీలించనున్నారు.


రాకెట్ శిఖర భాగాన పూర్తయిన స్పాడెక్స్ అమరిక

తెనాలికి చెందిన 'స్వేచ్ఛశాట్-వీ.0' కూడా..

రాకెట్ నుంచి స్పాడెక్స్ ఉపగ్రహం విడిపోయిన తర్వాత నాలుగో దశలో విభిన్న పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టనుంది. ఈ ప్రయోగంలో పీఎస్-4 ద్వారా ఏకంగా 24 పరిశోధనలు చేసేందుకు 24 చిన్న ఉపకరణాలను పంపుతున్నారు. ఈ పరిశోధనల ద్వారా ఇస్రోకు విలువైన సమాచారం రావడమే కాకుండా స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ఉపకరణాల్లో ఇస్రోకు చెందినవి 14 కాగా.. మరో 10 ఉపకరణాలు దేశంలోని వివిధ ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలు, విశ్వ విద్యాలయాలకు చెందినవి. ఇందులో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ వారు ఇస్రో సహకారంలో యుహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ మాడ్యూల్‌కు సంబంధించిన 'స్వేచ్ఛశాట్-వీ.0'ని పీఎస్ఎల్వీ-సీ60 ద్వారా అంతరిక్షంలోకి పంపుతున్నారు. ముంబైకి చెందిన అమిటీ యూనివర్సిటీ విద్యార్థులు పాలకూర కణాలను అంతరిక్షంలోకి పంపుతున్నారు. ఇది అంతరిక్షంలో ప్రత్యేక పరిస్థితిల్లో మొక్కలు ఎలా పెరగతాయనే దానిపై అధ్యయనం చేసేందుకు ఉపయోగపడనుంది.


నంద్యాల జిల్లా బేతంచర్ల గోడౌన్‌లో అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేశ్ నాయుడు


To
The Joint Collector
Nandyal.

Dated:25.12.2024.

Sir,

Today i.e., 25.12.2024 inspection conducted Buffer godowns of AP SWC IG Bethamcherla and NSLN IG Bethamcherla by the Director of Civil Supplies Sri.Mahesh Naidu along with DM Civil Supplies, Nandyal and found shortage of 398 bags as per book balance and comparing with ground balance in AP SWC Bethamcherla godown.

DM, Civil Supplies Nandyal

Warehouse Manager AP State Warehouse Corporation Bethamcherla Investor Godown

బేతంచర్ల ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లో 398 బస్తాలు తక్కువగా ఉన్నట్లు అధికారులు జేసీకి సమర్పించిన లేఖ

బుగ్గన బంధువుల గోడౌన్లలో బియ్యం మాయం

- బేతంచర్ల బఫర్ గోదాముల్లో మాయమైన 1300 బస్తాలు
- తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లైస్ డైరెక్టర్
- ఓ గోదాములో 398 బస్తాలు మాయం
- మరో గోదాంలో 920 బస్తాలు మాయమైనట్లు అనుమానం
- గోడౌన్ యాజమాన్యానికి అధికారుల సహకారం
- రిజిస్టర్లు చూపించటంలో జాప్యం చేస్తూ కాలయాపన

నంద్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా దోచుకున్నారు. అధికారులతో కుమ్మక్కై కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తమ జేబుల్లో వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ దోపిడీదారులు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి పేర్ని నానికి సంబంధించిన గోదాముల్లో బియ్యం మాయమైన ఘటన బయటపడింది. అదే కోవలో బేతంచర్లలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బంధువులకు చెందిన గోడౌన్లలో 1300 బస్తాలకు పైగా మాయమయ్యాయని తెలుస్తోంది. ఈ లెక్క తేల్చేందుకు సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేశ్ నాయుడు, నంద్యాల డీఎం రాజు నాయక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మాయమైన బస్తాలు ఈ మధ్య కాలానివేనని, గత ప్రభుత్వ హయాంలో మాయమైన వాటి గురించి పూర్తిగా ఆరా తీస్తే అవినీతి రూ. కోట్లలో బయటపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

బుగ్గన మంత్రి అయ్యాకే రెండు గోడౌన్లు..

వాస్తవానికి 2019కి ముందు బేతంచర్లలో సివిల్ సప్లైస్‌కి సంబంధించిన గోడౌన్లు ఏమీ లేవు. బుగ్గన సొంత నియోజకవర్గం డోన్‌కు కర్నూలు, గుంతకల్లు, నంద్యాల నుంచి పీడీఎస్ బియ్యం సరఫరా అయ్యేది. వైసీపీ ప్రభుత్వంలో బుగ్గన మంత్రి కాగానే ప్యాపిలి, డోన్, బనగానపల్లెలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం సరఫరా చేయడానికి బేతంచర్లలోనే రెండు బఫర్ గోడౌన్లను ఏర్పాటు చేయించారు. ఈ రెండు గోడౌన్లలో ఒక దానిని ఎస్‌డబ్ల్యూసీ (స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్)కి లీజుకు ఇప్పించగా, మరో దానిని తన బంధువు, సన్నిహితుడు కలిసి ప్రైవేటుగా నడుపుకొనేలా చక్రం తిప్పారు. ప్రస్తుతం ఎస్‌డబ్ల్యూసీకి సంబంధించిన గోదాములో అధికారులు తనిఖీ చేయగా 398 బియ్యం బస్తాలు మాయమైనట్లు గుర్తించారు. ఇక ప్రైవేటు గోడౌన్‌ను తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా దాని యజమానులు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. అధికారుల నుంచి ముందస్తు సమాచారం ఉండటంతోనే వారు ఉడాయించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రైవేటు గోడౌన్‌లో దాదాపు 920 బస్తాలు మాయం అయినట్లు సమాచారం. ఈ విషయాన్ని బయటకు రాకుండా ఉంచేందుకు సంబంధిత శాఖ అధికారులు వేరే చోటు నుంచి బియ్యం బస్తాలు తెప్పించి అంతా సక్రమంగా ఉందని చూపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

మాయమైన బియ్యం విలువ రూ. 50 లక్షలు

ప్రస్తుతం మాయమైన 1300 బస్తాల్లోని బియ్యం దాదాపు 650 క్వింటాళ్ల మేర ఉంటుంది. కిలో బియ్యాన్ని రూ. 43 చొప్పున ప్రభుత్వం సేకరిస్తున్న లెక్కన ఈ గోదాముల్లో మాయమైన బియ్యం విలువ దాదాపు రూ. 50 లక్షలు ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గట్టిగా నిఘా పెడుతున్నా ఈ స్థాయిలో బియ్యం మాయమవుతున్నాయంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఇంకే స్థాయిలో జరిగిందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవర్నీ వదిలే ప్రసక్తిలేదు: సివిల్ సప్లైస్ డైరెక్టర్

ఇక బేతంచర్ల గోడౌన్లకు సంబంధించిన వివరాలను నంద్యాల సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డీఎం రాజు నాయక్ గోప్యంగా ఉంచుతున్నారు. బఫర్ గోడౌన్‌లోని పీడీఎస్ బియ్యానికి సంబంధించిన మూవ్‌మెంట్ రిజిస్టర్లు, ప్రతినెలా చేసే ఫిజికల్ వెరిఫికేషన్ బోర్డు, క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలు ఏవీ కూడా చూపించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. బేతంచర్ల గోడౌన్ల రికార్డులన్నీ పరిశీలిస్తే కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న విషయం బయటకు వస్తుందని, బియ్యాన్ని మాయం చేసిన వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయిస్తామని, అలాగే వారికి సహకరించిన అధికారులను కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదని సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేశ్ నాయుడు చెప్పారు.

భూముల ధరల పెంపు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తోంది. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో అనేకసార్లు భూముల మార్కెట్ ధరలను పెంచారు. దీని వల్ల ప్రజలు, సామాన్యులపై ఎనలేని భారం పడింది. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు మార్కెట్ ధరలు పెంచాలని ప్రభుత్వంపై అధికారులు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల ఇతిబాధలు పట్టించుకోకుండా ఆదాయం పెంపే లక్ష్యంగా ఏకంగా ఏటా 14వేల కోట్ల రెవెన్యూ చూపించేలా ప్రతిపాదనలు చేశారు. దీనిపై ఆర్థిక శాఖ గంపెడాశలు పెట్టుకుంది. ఇది అమలైతే ఒక్క రిజిస్ట్రేషన్ల ద్వారానే ఏటా 14వేల కోట్ల ఆదాయం వస్తుందని, కాబట్టి భూముల మార్కెట్ ధరలు పెంచేందుకు అనుమతించాలని ఆర్థిక శాఖ, రెవెన్యూశాఖల అధికారులు ముఖ్యమంత్రి వద్ద పట్టుబట్టారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 2025 జనవరి 1 నుంచే భూముల మార్కెట్ ధరలు పెంచాలని తొలుత నిర్ణయించింది. దీనిపై ప్రజల్లో కొంత ఆందోళన, అలజడి నెలకొన్నాయి. భూముల ధరలు పెంచొద్దని ప్రభుత్వాన్ని కోరుతూ ఉద్యమాలూ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ అంశంపై మరోసారి సమగ్రంగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుందామని, జనవరి 1 నుంచి భూముల మార్కెట్ ధరల పెంపు నిర్ణయం అమలును వాయిదా వేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు ఇచ్చారు. ఈనెల 30న మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో జోనల్ రెవెన్యూ సమావేశం జరగనుంది. అదేరోజు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని మంత్రి అనగాని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 'మాది ప్రజా ప్రభుత్వం. వారికి కష్టం కలిగేలా ఏకపక్ష నిర్ణయాలు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతకు ముందే ప్రజలకు హామీ ఇచ్చారు. కాబట్టి భూముల మార్కెట్ ధరలు పెంచాలన్న అంశంపై మరోసారి అధికారులతో చర్చించాలనుకున్నాం. రెవెన్యూ సదస్సులో రెండో సెషన్ తర్వాత రిజిస్ట్రేషన్ ఐజీలతో సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిపై వారిచ్చే నివేదికలపై చర్చిస్తాం. ఆ తర్వాత సీఎంకు నివేదిస్తాం' అని అనగాని స్పష్టం చేశారు. ఇప్పటికే నిఘా విభాగం కూడా ఈ అంశంపై నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. 'రాష్ట్రంలో ఒకవైపు రెవెన్యూ సదస్సులు గ్రామగ్రామాన జరుగుతున్నాయి. ప్రభుత్వం తమ సమస్యలు తీరుస్తుందన్న నమ్మకంతో ప్రజలు భారీగా తరలివచ్చి సదస్సుల్లో ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తున్నారు. ఈ తరుణంలో భూముల మార్కెట్ ధరలు పెంచడం ప్రతికూల ప్రభావం చూపిస్తుంది' అని నిఘా విభాగం ప్రభుత్వానికి సూచించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

తనయ కోసం తండ్రి ఆత్మహత్య

- కుమార్తెకు అత్తింటి వేధింపులు
- ఆ బాధ చూడలేక విశాఖ నుంచి వచ్చి బలవన్మరణం
- సీఎం, డిప్యూటీ సీఎంల పేరిట సూసైడ్ నోట్

కలిగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తెకు ఘనంగా వివాహం చేశాడు. కానీ అత్తింటి ఆరళ్లకు బలవుతుందేమోననే భయంతో పుట్టింటికి తీసుకొచ్చాడు. అయినా వారి వేధింపులు ఆగకపోవడంతో సీఎం, డిప్యూటీ సీఎంల పేరిట సూసైడ్ నోట్‌రాసి ఆ తండ్రి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ హృదయవిదారకమైన సంఘటన నెల్లూరు జిల్లా కలిగిరిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కలిగిరి మండలం తూర్పు దూబగుంటకు చెందిన బొట్టా శ్రీనివాసులు (52) 30 ఏళ్ల క్రితం స్వగ్రామాన్ని వదిలి ఉపాధి కోసం విశాఖ జిల్లా భీమిలికి వెళ్లాడు. అక్కడ ఇటుక బట్టీల వ్యాపారం చేసుకుంటూ భార్య, కుమారుడు, కుమార్తెతో జీవిస్తున్నాడు. ఆ ప్రాంతంలో భార్య తరఫు బంధువైన సూర్యకుమారి రెండో కుమారుడు చంద్రశేఖర్‌కు తన కుమార్తె యమున (24)ను ఇచ్చి ఐదేళ్ల క్రితం ఘనంగా వివాహం చేశాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు(3) ఉన్నాడు. ఈ నేపథ్యంలో అప్పటివరకు బీడుగా ఉన్న భూముల పక్కన హైవే రావడంతో యమున అత్తింటివారి భూములు రూ.కోట్ల ధర పలికాయి. డబ్బు అమాంతంగా వచ్చిపడటం, యమున ఉన్నత చదువులు చదివి ఉండడం, ఆమె భర్తకు చదువులేకపోవడం తదితర కారణాలతో కొన్ని నెలలుగా యమునను వదిలించుకోవాలని అత్తింటివారి వేధింపులు మొదలయ్యాయి. దీంతో శ్రీనివాసులు తన కుమార్తెను ఇంటికి తీసుకొచ్చాడు. రాజకీయ బలగం ఉన్న యమున అత్తింటివారు.. ఇటీవల ఆమెపై దాడి చేసి, మూడేళ్ల కుమారుడిని బలవంతంగా తీసుకెళ్లారు. ఈ విషయమై యమున తండ్రి స్థానిక దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రాజకీయ పలుకుబడితో కేసును నీరుగార్చారు. కళ్లెదుటే కూతురు పడుతున్న బాధను చూడలేక విశాఖ నుంచి కలిగిరి వచ్చి నాలుగు రోజులుగా తన సోదరుడి ఇంటివద్ద ఉన్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై సూసైడ్ నోట్ రాసి బుధవారం ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమిలి నుంచి వచ్చిన మృతుడి భార్య కుమారుడు, కుమార్తె, బంధువులు గురువారం కలిగిరి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఆత్మహత్యకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పోస్టుమార్టం అయ్యాక మృతదేహాన్ని భీమిలి తరలించారు.


శ్రీనివాసులు(ఫైల్)

సూసైడ్ నోట్ రాసి..

ఆత్మహత్య చేసుకునేముందు శ్రీనివాసులు.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రులకు సూసైడ్ నోట్ రాశారు. ఆ నోట్‌లో తన కుమార్తెను అత్తింటి వారు ఎలా వేధించారో, తాను ఎంతటి మానసిక వేదనను గురయ్యానో వివరించాడు. తాను కూడా టీడీపీ సభ్యుడినేనంటూ, తన కుమార్తెను కాపాడాలంటూ ఐడీ కార్డుతో సహా రాసిన సూసైడ్ నోట్ స్థానికంగా సంచలనం రేపింది. ఉపాధి కోసం దూరప్రాంతానికి వెళ్లి, కుమార్తె బాధను చూడలేక స్వస్థలానికి వచ్చి శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకోవడం పలువురిని తీవ్రంగా కలిచివేసింది.

నిందితురాలిగా పదేళ్ల కుమార్తె!

- 'పార్శిల్ మృతదేహం' కేసులో విస్తు గొలిపే నిజాలు
- పర్లయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్‌వర్మ
- సహకరించిన మూడో భార్య, కుమార్తె
- నేడు మీడియాకు వెల్లడించనున్న ఎస్పీ

భీమవరం క్రైం/ఉండి డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో ఈ నెల 19న సాగి తులసి ఇంటికి 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' అయిన కేసులో పదేళ్ల చిన్నారి పాత్ర కూడా ఉందన్న విషయం ఇప్పుడు సంచలనం రేపుతోంది. జరిగిన సంఘటనలను బట్టి చూస్తే.. తులసి ఆస్తిని కొట్టేయాలన్న కుట్రలో శ్రీధర్‌వర్మ, అతడి ఇద్దరు భార్యల క్రూరమైన నేర స్వభావం తేటతెల్లమవుతుండగా, ఈ హత్యలో మూడో భార్య కుమార్తె అయిన.. పదేళ్ల బాలిక పాత్ర కూడా ఉందంటూ పోలీసులు ఆ చిన్నారిని నిందితురాలి జాబితాలో చేర్చడం గమనార్హం. ఈ కేసులో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం నిందితుల అరెస్ట్ చూపించి.. పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. కాగా, శ్రీధర్‌వర్మ తల్లిదండ్రులు కాళ్ల మండలం కోపల్లెలో చెరువులపై పనిచేస్తూ అక్కడే జీవిస్తుంటారు. అతడి మొదటి భార్య ఎలిజబెత్ రాణి గాంధీనగర్‌లో ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. రెండో భార్య రేవతికి పిల్లలు లేరు. ఆమెను మొగల్తూరులో ఉంచాడు. మూడో భార్యగా చెబుతున్న సుష్మకు పదేళ్ల కుమార్తె ఉంది. ఆమెను కాళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక ఇంట్లో ఉంచినట్లు తెలిసింది. వీరితోపాటు రెండో భార్య రేవతి.. తన అక్క తులసి ఆస్తిని కాజేయాలని ప్లాన్‌లో ఉండడంతోనే భర్తకు సహకరించేదని సమాచారం.

పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి..

మృతదేహాన్ని పార్శిల్ చేసి పంపిన వెంటనే శ్రీధర్‌వర్మ పరారైన విషయం తెలిసిందే. అయితే శ్రీధర్‌వర్మే నిందితుడని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అతడి కోసం గాలించగా.. కొన్ని సీసీ కెమెరాల్లో కనబడినట్లుగా కనిపించి, ఆ రూట్లలో కాకుండా మరో రూట్లలో వెళుతూ పోలీసులను దారి మళ్లించాడు. నాలుగు రోజులపాటు ముప్పుతిప్పలు పెట్టిన అనంతరం కృష్ణా జిల్లా బంటుమిల్లి వద్ద పోలీసులకు దొరికేశాడు. విచారణలో భాగంగా నిందితుడు శ్రీధర్‌వర్మను హత్య జరిగినట్లు భావిస్తున్న ఉండి మండలం వాంద్రం రహదారి వైపుకు గురువారం తీసుకువెళ్లారు. అతడి కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరిని భీమవరం, ఆకివీడు, కాళ్ల, ఉండిలలో రహస్య ప్రాంతాల్లో విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే.. కాళ్ల గ్రామ శివారు గాంధీ నగర్‌లో శ్రీధర్ వర్మ మొదటి భార్య వద్ద ఉండేవాడు. పోలీసుల దర్యాప్తులో ఆ నివాసంలో కొన్ని క్షుద్రపూజలకు ఆనవాళ్ళు దొరకడంతో స్థానికుల్లో భయాందోళనకు గురవుతున్నారు. పర్లయ్యను కిరాతకంగా హత్య చేసి పార్శిల్ చేసిన శ్రీధర్‌వర్మను ఉరి శిక్ష వేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.